RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in



01 మే 2025 గురువారం | హైదరాబాద్ | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:20 | సంచిక:284

## రాహుల్ గాంధీ ఒత్తిడికి తలొగ్గి కుల గణనకు కేంద్రం అనుమతించడం స్వాగతిస్తున్నాం

### టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కి గౌడ్

వార్తా 2 లో



## జాతీయ జన గణన లో కుల గణన చేర్చడం తెలంగాణ ప్రభుత్వ విజయం -

### మంత్రి పొన్నం ప్రభాకర్



వార్తా 2 లో

## కులగణనపై కేంద్ర ప్రభుత్వ నిర్ణయం తెలంగాణ ప్రభుత్వ విజయం

### టీపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్



వార్తా 2 లో

# రబీ ధాన్యం కొనుగోలుకు 15,000 వేల కోట్లు

### యాసంగి లోను రికార్డ్ స్థాయిలో ధాన్యం దిగుబడి

### 70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు సర్కార్ రెడీ

### 127 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనా

### 8,381 కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

### -మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:**యాసంగిలో పండిన పంటను కొనుగోలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం 15,000 కోట్లు విడుదల చేసిందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు.

ధాన్యం దిగుబడిలో ఖరీఫ్ సీజన్ లో యావత్ భారతదేశంలోనే రికార్డ్ సృష్టించిన తెలంగాణా రాష్ట్రం రబీ సీజన్ లోనూ అదే రికార్డ్ సృష్టించ బోతుందని ఆయన పేర్కొన్నారు.

యాసంగిలో తెలంగాణా రైతాంగం 54.89 లక్షల ఎకరాలలో సాగు చేయగా 127 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అవుతుందని అంచనా వేస్తున్నామని ఆయన తెలిపారు

70 లక్షల మెట్రిక్ టన్నుల మేర ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు గాను ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించుకున్నట్లు ఆయన ప్రకటించారు

ఈ రోజు మధ్యాహ్నం హైదరాబాద్ ఎర్రమంజిల్ కాలనీ లోని పౌర సరఫరాల శాఖా కేంద్ర కార్యాలయం నుండి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ పై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రాష్ట్రంలోనీ కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

వేరువేరు ప్రాంతాల నుండి వ్యవసాయ శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు,దుద్దిళ్ల శ్రీధర్ బాబు లు వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు

ధాన్యం కొనుగోళ్లపై పౌర సరఫరాల శాఖా రూపొందించిన విధివిధానాలను రాష్ట్ర పౌర సరఫరాల శాఖా ముఖ్య కార్యదర్శి డి.ఎస్.చౌహన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి వివరించారు

ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆయా జిల్లాల కలెక్టర్ లతో మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సునిషితమైనదని రానున్న 20 రోజులు అత్యంత కీలకమైనవని ఈ సమయంలో కలెక్టర్ లు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ అధికార యంత్రాంగాన్ని సమన్వయం చెయ్యాలని సూచించారు.

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలులో ఎటువంటి అవాంతరాలు ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు

ఎక్కడైనా ఇబ్బందులు ఏర్పడినట్లు కలెక్టర్ల దృష్టికి వస్తే సత్వరమే చర్యలు తీసుకోవడంతో పాటు పౌర సరఫరాల శాఖా ముఖ్య కార్యదర్శి డి ఎస్.చౌహన్ ను సంప్రదించాలని ఆదేశించారు

ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల లోపు మద్దతు ధరను రైతుల ఖాతాలో జమ చేయడంతో పాటు సన్నాలకందించే బోనస్ చెల్లింపులకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు

ధాన్యం కొనుగోళ్లకు గాను ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 8,381 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు 13.71 కోట్ల గోనె సంచులు అందుబాటులో ఉంచామని మరో 3.79 కోట్ల గోనె సంచులు సమీకరిస్తున్నట్లు ఆయన వివరించారు.అయితే తేమ శాతాన్ని పరిశీలించిన మీదటనే రైతులకు గోనె సంచులు పంపిణీ చేయాలని ఆయన సూచించారు

కొనుగోలు చేసిన ధాన్యాన్ని నిలువ ఉంచేందుకు గోదాములు అందుబాటులో లేని చోట్ల నేరుగా రైస్ మిల్లులకు తరలించాలని ఆయన అధికారులను ఆదేశించారు

మధ్యంతర గోదాముల వసతి ఉన్న చోట్ల కొనుగోలు కేంద్రాల నుండి ధాన్యాన్ని ఆయా గోదాములకు తరలించాలన్నారు.అవసరం అని భావించిన ప్రాంతాల్లో ఇప్పటికే పది లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని నిలువ ఉంచే సామర్థ్యం కలిగిన గోదాములను కేటాయించినట్లు ఆయన చెప్పారు

ఇప్పటికే 29 లక్షల మెట్రిక్ టన్నులకు పై బడి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు చేరిందని, సుమారు 2.55 లక్షల రైతుల నుండి 19.60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు ఆయన వివరించారు

కొనుగోలు చేసిన ధాన్యానికి ప్రభుత్వం అందించే మద్దతు ధర ప్రకారం 4,545.72 కోట్లు కాగా ఇప్పటివరకు 2,289 కోట్లు రైతుల ఖాతాలో జమ చేశామని ఆయన తెలిపారు.సన్నాలకు ప్రభుత్వం అందిస్తున్న బోనస్ మొత్తం 444.20 కోట్ల రూపాయలను రైతుల ఖాతాలో జమ చేసేందుకు ప్రభుత్వం సన్నద్ధమౌతుందన్నారు.

వాతావరణంలో సంభవిస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు రైతాంగానికి తెలియ జెప్పేందుకు వీలుగా కొనుగోలు కేంద్రాలలో ప్రతి రోజు ఉదయం వాతావరణ సమాచారాన్ని వివరిస్తున్నట్లు ఆయం చెప్పారు. అంతే గాకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలలో మౌలిక సదుపాయాల కల్పనతో పాటుగా ఎండ వేడిమికి ఇబ్బంది పడే రైతులకు ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచామన్నారు.

తేమ శాతాన్ని తెలియజెప్పే దయ్యర్ లను కొనుగోలు చేసిన కరీంనగర్ కలెక్టర్ ను ఆయన అభినందిస్తూనే మిగిలిన జిల్లాలలో కూడా ఇది అమలు పరచలన్నారు.ధాన్యం నాణ్యతతో పాటు త్వరితగతిన కొనుగోలు ప్రక్రియ పూర్తి చేసేందుకు దోహదపడుతుందన్నారు.

అయితే అదే సమయంలో ఆయా జిల్లాల కలెక్టర్లు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ కొనుగోలు చేసిన



ధాన్యాన్ని ఎప్పటికప్పుడు తరలించేందుకు వీలుగా వాహనాల ఏర్పాటు చేయడంతో పాటు హమాలీల సమస్యలను స్థానికంగానే పరిష్కరించాలని నిబంధనల మేరకు హార్వెస్టర్ల పనితీరును పరిశీలించడంతో పాటు బ్లోయర్ల పని తీరును గమనించాలని ఆయన అధికారులను ఆదేశించారు

అయితే కొనుగోలు చేసిన ధాన్యాన్ని 1,579 రైస్ మిల్లులను సి.యం.ఆర్ నిమిత్తం గుర్తించినట్లు ఆయన తెలిపారు.

ఇప్పటికే 45 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఆయా రైస్ మిల్లులకు కేటాయించినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

**రేషన్ కార్డు ధరఖాస్తుల పరిశీలన**

కొత్తగా మంజూరు చేయనున్న తెల్ల రేషన్ కార్డుల కోసం లబ్దిదారులు పెట్టుకున్న దరఖాస్తులను సునిశితంగా పరిశీలిస్తున్నట్లు ఆయన తెలిపారు.

పరిశీలన పూర్తి అయిన వాటిని ఎప్పటికప్పుడు అప్డేట్ చెయ్యాలని ఆయన అధికారులను ఆదేశించారు.

## ప్రైవేటుకన్నా ప్రభుత్వ పాఠశాలలు మెరుగైన ఫలితాలు రేవంత్ రెడ్డి





**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** దేశంలో సమూలమైన మార్పు రావాలంటే ప్రతి వారికీ నాణ్యమైన విద్యను అందించాలన్న లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి ( మల్లు భట్టివిక్రమార్క తో కలిసి ముఖ్యమంత్రి పదవ తరగతి పరీక్షా ఫలితాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలు ముఖ్యంగా రెసిడెన్షియల్ పాఠశాలలు ప్రైవేటు సంస్థలకన్నా మెరుగైన ఫలితాలు సాధించడం పట్ల సిబ్బందిని, అధ్యాపకులను, విద్యార్థులను ముఖ్యమంత్రి మనస్ఫూర్తిగా అభినందించారు. ప్రైవేటుకన్నా ప్రభుత్వ పాఠశాలలు మెరుగైన ఫలితాలు సాధించడం ప్రజా ప్రభుత్వం పనితీరుకు గీటురాయి అని అన్నారు. దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే ఉందని బలంగా విశ్వసిస్తున్నామని, బసవన్న స్ఫూర్తితో ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. 2025 మార్చి 21 వ తేదీ నుంచి ఏప్రిల్ 4 వ తేదీ వరకు జరిగిన ఈ ఎస్ఎస్సీ పరీక్షల్లో ప్రభుత్వ, ప్రైవేటు కలిపి మొత్తంగా 5,07,107 మంది విద్యార్థులు హాజరయ్యారు. రెగ్యులర్ గా 4,96,374 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా వారిలో 92.78 శాతం ఉత్తీర్ణత సాధించారు.ఈ పరీక్షల్లో బాలరకంటే బాలికలు మెరుగైన ఫలితాలు సాధించారు. బాలికలు 94.26 శాతం, బాలురు 91.32 శాతం ఉత్తీర్ణత సాధించారు. ప్రైవేటుగా 10,733 మంది హాజరు కాగా, వారిలో 57.22 శాతం ఉత్తీర్ణత సాధించారు. రాష్ట్రంలోని 4,629 పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణత సాధించాయి. ఈ ఫలితాల విడుదల కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ , ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ , షబ్బీర్ అలీ , హర్కర వేణుగోపాల్ రావు ,జహీరాబాద్ఎంపీ సురేష్ షట్కార్ ,మాజీ ఎంపీ వి.హనుమంతరావ్, తో పాటు విద్యా శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## కాళేశ్వరం తప్పంతా బీఆర్ఎస్ ప్రభుత్వానిదే ,కుండబద్దలు కొట్టిన ఎన్ ఎస్ డీఏ నివేదిక

హైదరాబాద్, ఏప్రిల్ 30 కాళేశ్వరం ప్రాజెక్టుపై ఎన్డీఎస్ఏ నివేదికను విడుదల చేసింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టలపై అధ్యయనం చేసిన ఎన్డీఎస్ఏ నిపుణుల కమిటీ తుది నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందించింది. ఈ మేరకు సీఎస్ శాంతి కుమారికి ఎన్డీఎస్ఏ ఛైర్మన్ అనిల్ జైన్ ఇటీవల లేఖ రాశారు. బ్యారేజీల నిర్వహణ లోపాలే ఈ సమస్యలకు కారణమన్నారు. మేడిగడ్డలోని బ్లాక్‌లను పూర్తిస్థాయిలో పరీక్షించాలని నివేదికలో పేర్కొంది. .

**మేడిగడ్డ బ్యారేజ్ ఘటన**

2023 అక్టోబర్ 21 - మేడిగడ్డ బ్యారేజీలోని 7వ బ్లాక్ 20 నంబర్ పిల్లరు కుంగిపోయింది.

2023 అక్టోబర్ 22 - కాళేశ్వరం చీఫ్ ఇంజినీర్, సీడీఓలు బ్యారేజీ కుంగిన ప్రాంతాన్ని పరిశీలించి దీనిపై రాష్ట్ర ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక అందించింది.

2023 అక్టోబర్ 25 - నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నిపుణుల బృందం ఇంజినీరింగ్ చీఫ్, ఎల్ అండ్ టీ బ్యారేజీ నిర్మాణ సంస్థ ప్రతినిధులు బ్యారేజీ కుందిన ప్రాంతాన్ని పరిశీలించారు. అక్టోర్ 28వ తేదీన రామగుండం ఈఎన్సీ ఎన్డీఎస్ఏ బృందానికి బ్యారేజీ వివరాలు అందించారు.

2023 నవంబర్ 1న - నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నిపుణులు మేడిగడ్డ బ్యారేజీ కుంగడానికి కారణాలతో నివేదికను రూపొందించింది. నవంబర్ 4న తెలంగాణ ప్రభుత్వానికి సమర్పించింది.

2024 ఫిబ్రవరి 13న మేడిగడ్డ బ్యారేజీ కుంగిన నేపథ్యంలో మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం, బ్యారేజీలను పరిశీలించి సమగ్ర నివేదిక అందించాలని రాష్ట్రప్రభుత్వం ఎన్డీఎస్ఏను కోరింది. కాళేశ్వరం మూడు బ్యారేజీలను పరిశీలించేందుకు ఎన్డీఎస్ఏ ఏడుగురు నిపుణులతో కమిటీ ఏర్పాటు చేసింది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవకతవకలపై న్యాయ విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు మాజీ జడ్జి జస్టిస్ పినాకి చంద్రఘోష్ ను తెలంగాణ ప్రభుత్వం నియమించింది.

ఏప్రిల్ 24, 2025న ఎన్డీఎస్ఏ కాళేశ్వరం ప్రాజెక్టుపై తుది నివేదిక సమర్పించింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లపై అధ్యయనం చేసిన నిపుణుల కమిటీ...ప్రజాధనంతో నాణ్యత లేకుండా బ్యారేజీలను నిర్మించి ఘోరమైన మానవ నిర్మిత విపత్తును సృష్టించారని నివేదిక పేర్కొంది. బ్యారేజీ నిర్మాణంలో వైఫల్యం, క్వాలిటీ కంట్రోల్ లేకపోవడం, బ్యారేజీల ఆపరేషన్, మెయింటెనెన్స్ వైఫల్యాలను ఎన్డీఎస్ఏ కమిటీ ఎత్తి చూపించింది.ఎన్డీఎస్ఏ నివేదికపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మంగళవారం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వ కక్కుర్తి వల్ల రాష్ట్రానికి చాలా నష్టం జరిగిందని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో తీవ్రమైన లోపాలు ఉన్నట్లు ఎన్డీఎస్ఏ నివేదిక ఇచ్చిందన్నారు. ఈ నివేదిక ఇచ్చిన తర్వాత కూడా బీఆర్ఎస్ నేతలు సిగ్గుపడటం లేదని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి విమర్శించారు.ఎక్కువ కమిషన్ల కోసం కక్కుర్తి పడి బీఆర్ఎస్ నేతలు కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టారని ఆరోపించారు.

## మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు కుమారుడి వివాహ వేడుకకు హాజరైన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రి లోకేష్





విజయవాడః మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత దేవినేని ఉమామహేశ్వరరావు కుమారుడి వివాహ వేడుకకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ హాజరయ్యారు. కృష్ణా జిల్లా కంకిపాడులోని ఆయానా కన్వెన్షన్ లో జరిగిన ఈ వివాహ మహోత్సవ వేడుకకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా హాజరయ్యారు. రేవంత్ రెడ్డి రాకను పురస్కరించుకుని మంత్రి లోకేష్, ఇతర టీడీపీ ప్రజాప్రతినిధులు పుష్పగుచ్ఛం అందించి ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి మంత్రి నారా లోకేష్ నూతన వధూవరులు నిహార్, శ్రీ సాయి నర్మదలను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజాబలం

01 మే 2025 గురువారం

## అందుతున్న మేకిన్ ఇండియా ఫలాలు

మన పరిశ్రమలు కొత్త భారత్‌ను ప్రపంచానికి పరిచయం చేస్తున్నాయి. భారత పారిశ్రామిక రథానికి చోదక శక్తిగా పనిచేస్తున్నాయి. మేక్ ఇన్ ఇండియాకు అసలైన మోడల్ గా నిలుస్తున్నాయి. భారత్ మారుతోంది. ఒప్పుడు ఎన్నో దిగుమతులు.. ఇప్పుడు అన్నీ ఉత్పత్తులే. మేకిన్ ఇండియా నినాదం క్రమంగా ప్రతిఫలాలను ఇస్తోంది. ప్రధాని మోదీ కలలు సాకారమవుతుండడంతో పాటు.. దేశం అన్ని రంగాల్లో పురోగమిస్తోంది. 2014లో ప్రతిష్టాత్మకంగా మేకిన్ ఇండియాను లాంచ్ చేశారు మోదీ. భారత్‌ను ప్రపంచంలో టాప్ ఉత్పత్తి దేశంగా మార్చేందుకు కలలు కన్నారు. దీనికోసం పక్కా ప్రణాళికలతో ముందుకు సాగారు. పదేళ్ల తర్వాత ఇప్పుడు దాని ప్రతిఫలాలను దేశం చూస్తోంది. 2014లో దేశంలో 80శాతం మొబైల్ ఫోన్లను దిగుమతి చేసుకునే పరిస్థితుల్లో ఉంటే.. ఇప్పుడు 99.9శాతం మొబైల్స్ ఇక్కడే ఉత్పత్తి అవుతున్నాయి. అంతేకాదు.. యూకే, నెదర్లాండ్స్, ఆస్ట్రియా, ఇటలీ, సౌతాఫ్రికా వంటి దేశాలకు ఎగుమతులు కూడా సాగుతున్నాయి. డిఫెన్స్ ప్రొడక్షన్‌తోపాటు.. అంతరిక్షం, ఎలక్ట్రిక్ వాహనాలు, సెమీకండక్టర్ల తయారీ, నిర్మాణ రంగం, రైల్వే ఇన్‌ఫ్రాలోనూ అద్భుత ఫలితాలను సాధిస్తోంది.స్వదేశీ కంపెనీలైన పతంజలి, టాటా, అమూల్ వంటివి ఇండియన్ గ్రోత్ స్టోరీని మారుస్తున్నాయి.స్వదేశీ ఉద్యమం స్వాతంత్ర పోరాటంలో కీలకమైన ఘట్టం. ఇప్పుడు మరోసారి అదే స్వదేశీ ఉద్యమం.. భారత్ స్వయ సంవృద్ధి పయనాన్ని నిర్దేశిస్తోంది. ఇది ఆర్థిక స్వావలంబనను మాత్రమే కాదు.. జాతీయ గౌరవాన్ని, సాంస్కృతిక గుర్తింపును ఇనుమడింపజేస్తోంది. స్వదేశీ ఉత్పత్తులను కొనుగోలు చేయాలనే భావన, తద్వారా జాతీయ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయాలన్న ఆకాంక్ష ఈ మధ్య కాలంలో పెరుగుతోంది. ఆర్థిక వ్యవస్థ బలోపేతం ద్వారా అంతర్జాతీయ స్థాయిలో భారత్‌ను శక్తివంతమైన ఆర్థిక వ్యవస్థగా నిలిపే కార్యక్రమంలో అనేక స్థానిక పరిశ్రమలు నిరంతరం పనిచేస్తున్నాయి.భారత్ పరిశ్రమకు నిదర్శనంగా నిలిచే పతంజలి.. ఈ విషయంలో ఎంతో ముందడుగు వేసింది. బ్రాండ్ భారత్ ను ప్రమోట్ చేయడంలో ఎంతో ముందుంది. భారత్ ఆత్మ అయిన ఆయుర్వేదాన్ని ప్రపంచ దేశాలకు పెద్ద ఎత్తున తీసుకెళ్తోంది. స్వదేశీ పారిశ్రామికోద్యమంలో ప్రధానమైన 'మేడ్ ఇన్ ఇండియా ను పతంజలి తమ కోర్ బిజినెస్ ప్రిన్సిపల్‌గా పాటిస్తోంది. ప్రపంచానికి ఆయుర్వేదాన్ని అందించిన భారత్ నుంచి ఆ బ్రాండ్ తెలిసేలా పతంజలి.. ఆయుర్వేద, సహజ ఉత్పత్తులైన సబ్బులు, నూనెలు, ఔషధాలు, ఇతర ఆహార పదార్థాలను ఇంటింటికీ చేరుస్తోంది. గడచిన 15 ఏళ్లలో పతంజలిని ప్రతి ఇంటిలో ఉపయోగించే పేరుగా మలిచి అసలైన అర్థం చెప్పింది.అంతేకాదు.. వందేళ్లకు పైగా భారత్ ఇండస్ట్రీకి చిరునామాగా నిలిచిన టాటా గ్రూప్, రిలయన్స్ జియో, అమూల్ డైయిరీ వంటివి కూడా భారత్‌లోనే కాదు.. ప్రపంచవ్యాప్తంగా పేరున్న ప్రొడక్టులు. బ్రాండ్ స్వదేశీ అన్నదాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ కూడా ఎక్కువగా ప్రోత్సహిస్తున్నారు. ఎక్కువగా స్వదేశీ ఉత్పత్తులు వాడమని ఆయన తరుచుగా చెబుతూనే ఉన్నారు. 2020 లోని ఓ ప్రసంగంలో స్వదేశీని ప్రచారం చేయడం అనేది మన మంత్రం కావాలి. మన ఉత్పత్తులను ఉపయోగించాలి. అదే ఆత్మనిర్భర భారత్‌కు అసలైన పునాది " అని ఆయన స్పష్టంగా చెప్పారు. రసాయన రహిత వ్యవసాయాన్ని చేపట్టాలని ఆయన తరచుగా చెబుతున్నారు. ఇది స్వావంలబంనలో ఓ భాగమన్నారు. ఈ నినాదం కేవలం ఆర్థిక బలోపేతానికి ఇచ్చింది మాత్రమే కాదు. సమాజిక, పర్యావరణ అంశాలను కూడా దృష్టిలో ఉంచుకుని ప్రధాని ఆ పిలుపునిచ్చారు.ఇటీవల అంతర్జాతీయంగా జరుగుతున్న పరిణామాలను దృష్టిలో ఉంచుకుంటే స్వదేశీ ఆవశ్యకత మనకు అర్థం అవుతుంది. ఇది దిగుమతులపై పడుతున్న భారాన్ని తగ్గించడమే కాదు. మన స్థానిక రైతులు, కుటీర పరిశ్రమలు, కళాకారులకు చాలా ప్రోత్సాహాన్నిస్తుంది. స్వదేశీ ఉత్పత్తులను ఉపయోగించాలని ఇప్పటికే మొదలైన ఆలోచన మరింత బలోపేతం కావాలిసిన అవసరం ఉంది . స్వదేశీ ఉద్యమం కొనుగోలుకు సంబంధించిన నిర్ణయం మాత్రమే కాదు.. జాతి నిర్మాణానికి సంబంధించిన ఓ ముందడుగు. మేక్ ఇన్ ఇండియాతో, డిజిటలైజేషన్, సాంకేతిక పురోగతి అనేక రంగాలలో కూడా కనిపించింది. ఎలక్ట్రానిక్స్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్‌లో స్వావలంబన పెరిగింది. మొబైల్ తయారీలో భారతదేశం అగ్ర దేశంగా మారింది. ఆపిల్, శాంసంగ్ సహా అనేక ఇతర ప్రపంచ కంపెనీలు భారతదేశంలో మొబైల్ తయారీ యూనిట్లను ఏర్పాటు చేశాయి. 2014లో, భారతదేశంలో కేవలం 2 యూనిట్లు మాత్రమే ఉత్పత్తి చేసేవి. ఇది 2020 నాటికి 200 కంటే ఎక్కువ యూనిట్లకు పెరిగింది.మేక్ ఇన్ ఇండియా రక్షణ రంగంలో స్వావలంబనను ప్రోత్సహించింది. భారతీయ కంపెనీలు ఇప్పుడు సైనిక పరికరాలు, ఆయుధాల ఉత్పత్తికి పెద్ద ఎత్తున సహకరిస్తున్నాయి. రక్షణ రంగంలో ఎఫ్‌డీఐ పరిమితిని ప్రభుత్వం 74 శాతానికి పెంచింది. తేలికపాటి యుద్ధ విమానం 'తేజస్' సహా అనేక స్వదేశీ రక్షణ పరికరాల ఉత్పత్తి ఈ చొరవలో ముఖ్యమైన భాగం.మేక్ ఇన్ ఇండియా ఇతర ప్రధాన విజయాలు 2023-24లో రూ. 1.55 లక్షల కోట్ల విలువైన ఖాదీ విక్రయాలు పీఎల్ఐ పథకం కింద రూ.1.28 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఇది 8.5 లక్షలకు పైగా ఉద్యోగాలను సృష్టించింది. 4 లక్షల కోట్లకు పైగా ఎగుమతులు పెరిగాయి. 2020లో టాయ్‌ల కోసం జాతీయ కార్యాచరణ ప్రణాళికను అమలు చేసినప్పటి నుంచి ఎగుమతులు 239 శాతం పెరిగాయి.

## కులగణనపై కేంద్ర ప్రభుత్వ నిర్ణయం తెలంగాణ ప్రభుత్వ విజయం

### టీపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్

**నాంపల్లి ప్రజాబలం ప్రతినిధి:** కేంద్ర ప్రభుత్వం జన గణన తో పాటు కుల గణన నిర్వహిస్తామని ప్రకటించడం హర్షించదగ్గ విషయం

దేశ చరిత్రలో మొదటిసారిగా కుల గణన నిర్వహించిన రాష్ట్రం తెలంగాణ

కుల గణన తో తెలంగాణలో ఏ కులం వారు ఎంత నిష్పత్తిలో ఉన్నారని తేల్చి చెప్పిన ఘనత కాంగ్రెస్ పార్టీది

రాహుల్ గాంధీ ఆలోచన మేరకు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రుల బృందం నిర్ణయం తీసుకొని పారదర్శకంగా కుల గణన సర్వే నిర్వహించడం జరిగింది

జనాభా లెక్కల్లో భాగంగా కులగణన కూడా చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం కాంగ్రెస్ ప్రభుత్వ విజయమని టీపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ప్రకటనలో పేర్కొన్నారు. కుల గణన తో తెలంగాణలో ఏ కులం వారు ఎంత నిష్పత్తిలో ఉన్నారని తేల్చి చెప్పిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని ఆయన స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ ఆలోచన మేరకు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రుల బృందం నిర్ణయం తీసుకొని పారదర్శకంగా కుల గణన సర్వే నిర్వహించడం జరిగిందన్నారు. దేశ చరిత్రలో మొదటిసారిగా కుల గణన నిర్వహించిన రాష్ట్రంగా తెలంగాణ చరిత్రలో నిలిచిపోతుందని తెలిపారు. రాహుల్ గాంధీ ఆలోచన మేరకు తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే శాస్త్రీయంగా కులగణనను విజయవంతంగా పూర్తి చేసి దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు మహేష్ గౌడ్. కులగణన లెక్కల ఆధారంగా తెలంగాణలో బడుగు బలహీన వర్గాలకు సామాజిక న్యాయం చేస్తూ బీసీలకు 42% రిజర్వేషన్లు కాంగ్రెస్ ప్రభుత్వం కల్పించిందన్నారు. కాంగ్రెస్ నిర్వహించిన కులగణనను ఇంతకాలం అపహాస్యం చేసిన బీజేపీ ఇప్పుడు దారిలోకి రావడం శుభ పరిణామని..ప్రజాభీష్టానికి లొంగి కులగణనను చేపట్టాలని నిర్ణయించిన కేంద్ర ప్రభుత్వం అదే బాటలో తెలంగాణ ప్రభుత్వం ఆమోదించిన బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లును 9 వ షెడ్యూల్ లో చేర్చి చట్టబద్ధత కల్పించాలని టీపిసిసి చీఫ్ డిమాండ్ చేశారు.

## జాతీయ జన గణన లో కుల గణన చేర్చడం తెలంగాణ ప్రభుత్వ విజయం - మంత్రి పొన్నం ప్రభాకర్

**జూబ్లీహిల్స్ ప్రజాబలం ప్రతినిధి:**తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కుల గణన రాష్ట్ర వ్యాప్తంగా అమలు జరిగి చట్టం చేసి 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ చట్టం చేసి పంపింది

కేంద్ర ప్రభుత్వం బీసీ లకు తెలంగాణ లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తూ దేశ వ్యాప్తంగా కుల గణన చేయాలని డిమాండ్ చేశాం

కుల గణన చేసి తెలంగాణ దేశానికి దిక్సూచిగా మారింది

ఇప్పుడే కేంద్ర ప్రభుత్వ జన గణన ద్వారా జనాభా లెక్కల్లో కుల గణన చేస్తామని ప్రకటించింది

ఇది తెలంగాణ ప్రభుత్వ విజయం...తెలంగాణ ప్రజల విజయం

1931 లో బ్రిటిష్ కాలంలో జాతీయ స్థాయిలో కుల గణన జరిగింది..

ఇది రాష్ట్ర ప్రభుత్వ విజయం సహకరించిన ముఖ్యమంత్రి కి ,ఉప ముఖ్యమంత్రి కి సహచర మంత్రులకు ,పార్టీ కి ధన్యవాదాలుఆలస్యమైన చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్న కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు

రాబోయే జన గణన లో కుల గణన చేస్తామని చెప్పడం బలహీన వర్గాల మంత్రిగా మీకు అభినందనలు కృతజ్ఞతలు తెలుపుతున్న

## రాహుల్ గాంధీ ఒత్తిడికి తలొగ్గి కుల గణనకు కేంద్రం అనుమతించడం స్వాగతిస్తున్నాం

### టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కి గౌడ్

**నాంపల్లి ప్రజాబలం ప్రతినిధి:** రాహుల్ గాంధీ ఒత్తిడికి తలొగ్గి కుల గణనకు కేంద్రం అనుమతించడం స్వాగతిస్తున్నాం

దేశాన్ని ఎక్స్ రే తీసి వనరుల్లో సంపదలో పేద వర్గాలకు వాటా పంచాలన్న రాహుల్ గాంధీ డిమాండ్ న్యాయబద్ధమైనది

కులగణన చేయడమే కాదు .. రిజర్వేషన్ల పెంపు, రాజ్యాంగబద్ధ హక్కులను ఎస్సీ ఎస్టీ బీసీలకు బదక్కేలా చూడాలి

గాంధీభవన్లో మీడియా సమావేశంలో టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కి గౌడ్

దేశవ్యాప్తంగా జన గణనతో పాటు కులగణన చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నాము

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ గారి డిమాండ్ కు తలోగ్గి కులగణన చేసేందుకు నిర్ణయం తీసుకోవడం సంతోషకరం

దేశంలో 90 శాతం ఉన్న పేద వర్గాలకు వనరుల్లో, సంపదలో వాటా దక్కాలన్న రాహుల్ గాంధీ గారి బలమైన డిమాండ్ తో.. కులగణన చేపట్టి, వారి జనాభాకు తగ్గట్టుగా వాటా పంచాలన్న ఆయన న్యాయమైన డిమాండ్ కు కేంద్ర ప్రభుత్వం దిగిరాక తప్పలేదు

అయితే కేంద్ర ప్రభుత్వం పారదర్శకంగా కుల గణన చేపట్టి, న్యాయపరంగా, రాజ్యాంగబద్ధంగా ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీలకు లభించాల్సిన వాటాను అందించాల్సిన అవసరం ఉన్నది

రాహుల్ గాంధీ ఆలోచనల మేరకు తెలంగాణ రాష్ట్రాన్ని ఒక రోల్ మోడల్ లాగా భావించి సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఇప్పటికే కులగణన చేపట్టడం జరిగింది. బీసీలకు 42% రిజర్వేషన్లు ఇచ్చేందుకు అసెంబ్లీలో చట్టం చేసి కేంద్రానికి పంపించడం జరిగింది. దాన్ని కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఆమోదించాలని డిమాండ్ చేస్తున్నాం.

అంతేకాకుండా కేంద్ర ప్రభుత్వం కూడా దేశవ్యాప్తంగా బీసీలకు 42% రిజర్వేషన్లు ఇచ్చే విధంగా నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాము.

50% రిజర్వేషన్ల పరిమితిని బద్దలు కొట్టే సమయం ఆసన్నమైంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు సామాజిక రాజకీయ ఆర్థిక రంగాలలో దక్కాల్సిన వాటా కోసం కుల గణన చేపట్టి రిజర్వేషన్లు పెంచాల్సిన అవశ్యకత ఏర్పడింది. రాష్ట్రాన్ని యూనిట్ గా తీసుకొని రిజర్వేషన్లు అమలు చేయాలి

దేశాన్ని ఎక్స్ రే తీయాలని, దేశంలో ఎవరెంత ఉన్నారో తేల్చాలని.. కేంద్ర ప్రభుత్వంపై రాహుల్ గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ చేసిన ఒత్తిడితో కేంద్రం దిగివచ్చి కులగణన కు ఓకే చెప్పింది.

ఇక మునుముందు కూడా దేశవ్యాప్తంగా ఎస్సీ ఎస్టీ బీసీలకు జనాభాకు తగ్గట్టుగా దక్కాల్సిన వాటా పై కాంగ్రెస్ పార్టీ నిర్మాణాత్మక పాత్ర పోషిస్తుంది అని తెలియజేస్తున్నాము.

రాష్ట్రాన్ని యూనిట్ గా తీసుకుని అమలు చేయాలి . కుల గణన సొంత గుప్పిట్లో పెట్టుకోకుండా... జనాభా ప్రాతిపదికన సంపద పంచాలి

కేసీఆర్ లాగా గణన చేసి బహిర్గతం చేయకుండా ఉండొద్దు . తెలంగాణ అనే పదమే కెసిఆర్ తన పార్టీ నుంచి తీసేసాడు . తెలంగాణ పదంకు నిషేధం పలికిన చంద్రబాబు .. కేసీఆర్ కి ఆదర్శం

అందుకే తన పార్టీ పేరుబీఆర్ఎస్ గా మార్చుకున్నాడు. తెలంగాణ పదం తీసేసిన దుర్మార్గుడు కేసీఆర్ కు తెలంగాణ తో పనేముంది

## లక్ష్యం మేరకు ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపిక పూర్తి చేయాలి

### కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

### ఇందిరమ్మ ఇండ్ల పథకంపై ప్రత్యేక అధికారులతో కలెక్టర్ సమీక్ష



**రాజన్న సిరిసిల్ల జిల్లా , ఏప్రిల్ -30 (ప్రజాబలం ప్రతినిధి)**జిల్లాలో లక్ష్యం మేరకు ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపిక పూర్తి చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంపై జిల్లాలోని ఆయా మండలాలు, మున్సిపాలిటీల ప్రత్యేక అధికారులతో కలెక్టర్ బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎన్ని దరఖాస్తులు వచ్చాయి? ఎన్ని సర్వే చేశారు? ఎన్ని దరఖాస్తులు ఆన్లైన్ చేశారో హౌసింగ్ పీడీ శంకర్ ను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయా మున్సిపాలిటీలు, మండలాల వారిగా లక్ష్యం మేరకు ఎంత పూర్తి చేశారో సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. అర్హులైన పేదల సొంత ఇంటి కల సాకారం చేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రవేశపెట్టిందని వివరించారు. ఇప్పటికే వచ్చిన దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో సర్వే చేశారని, అర్హులకే అందేలా చూడాలని స్పష్టం చేశారు. జిల్లాలోని ఆయా మున్సిపాలిటీలు, మండలాల్లో మొత్తం 7690 దరఖాస్తులు అధికారులు క్షేత్ర స్థాయిలో సర్వే చేశారని, వీటిలో ఇప్పటిదాకా 5776 వారి వివరాలు ఆన్లైన్ చేశారని వెల్లడించారు. మిగతా వివరాలు పరిశీలిస్తున్నారని పేర్కొన్నారు. అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు అందించాలని సూచించారు. వచ్చే నెల 2వ తేదీన ఆయా గ్రామాలు, మున్సిపాలిటీల వార్డుల్లో దరఖాస్తుదారు జాబితా ప్రదర్శిస్తారని, 5వ తేదీన తుది జాబితా ప్రదర్శిస్తారని కలెక్టర్ తెలిపారు. అధికారులు సమన్వయంతో పని చేసి లక్ష్యాన్ని పూర్తి చేయాలని సూచించారు.సమావేశంలో సిరిసిల్ల ఆర్డీవో రాధాబాయి, డీఆర్డీఓ శేషాద్రి, ఆయా మండలాల ప్రత్యేక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్ షర్మిలా రెడ్డిని అడ్డుకున్నచ పోలీసులు

విజయవాడ నన్నెందుకు హౌజ్ అరెస్ట్ చేశారో సమాధానం చెప్పాలి. ఒక పార్టీ అధ్యక్షురాలి మీద ఈ జులుం ఏంటని ఏపీసీసీ చీఫ్ షర్మిలా రెడ్డి అన్నారు. చంద్రబాబు గారు, హోం మంత్రి అనిత గారు సమాధానం చెప్పాలి. మరావతి మన రాజధాని. రాజధాని ఎలా ఉందో చూడటం తప్పా ? అమరావతి మీద రీసెర్చ్ చేయాలని అనుకోవడం తప్పా ? అమరావతి క్యాపిటల్ కమిటీ ఒక కాంగ్రెస్ పార్టీ నుంచి వేశాం. కమిటీ తరుపున అమరావతి విజిటి చేద్దాం అనుకున్నాం. ఒక కమిటీ వేస్తేనే మీకు ఇంత భయమా? అమరావతి రాజధాని లో ఏం దాచాలని అనుకుంటున్నారు? పార్టీ ఆఫీసుకి వెళ్ళి అక్కడ యాక్షన్ ప్లాన్ డిస్కస్ చేద్దాం అనుకున్నామని అన్నారు.

పార్టీ ఆఫీసుకి వెళ్లడానికి ఆడుకోవడం ఎంత వరకు న్యాయం ? ఈ నెల 2 న మోడీ వస్తున్నాడు. మోడీ నీ డిమాండ్ చేయాల్సిన అంశాలు చాలా ఉన్నాయి. వాటి మీద మాట్లాడే హక్కు మాకు లేదా ? ఇదేనా కూటమి వైఖరి నా ? నా ఇంటి ముందు ఇంత సెక్యూరిటీ ఎందుకు ? నేను లా అండ్ ఆర్డర్ ప్రాబ్లం సృష్టించడం లేదు. రాజధాని కి అన్యాయం చేసింది ఎవరు ? మేము కమిటీ వేసుకుంటేనే మీకు భయం ఎందుకు ? మేము ప్రొటెస్ట్ చేయాలని అనుకుంటే చంపేస్తారా ? దేనికి వాడుతున్నారు పోలీస్ వ్యవస్థను ? పోలీసులతో మీరు గులాం గిరి చేయాలని అనుకుంటున్నారా. నా మీద ఇంటి వద్ద పోలీసులు చేయి వేశారు. ఇదేనా మహిళలను ట్రీట్ చేసే విధానం. ధర్నాలు,ప్రొటెస్ట్ చేసే హక్కు నాకు లేదా ? మీరు నియంతలు కాదు గుర్తు పెట్టుకోండి. ఇప్పటికే మహిళల మీద అత్యాచారాల్లో రాష్ట్రం 3 వ స్థానం లో ఉంది. ఇలాంటి అంశాల మీద మీరు ఫోకస్ చేయండని అన్నారు.

# కలకలం రేపుతున్న సర్వే

విజయవాడ, ఏప్రిల్ 30,ఏపీలో కూటమి అధికారంలోకి వచ్చి దాదాపు 11 నెలలు అవుతోంది. ప్రభుత్వం పాలనతో పాటు సంక్షేమ పథకాలపై ఫుల్ ఫోకస్ పెట్టింది. అయితే క్షేత్రస్థాయిలో కొంతమంది ఎమ్మెల్యేల పనితీరుపై తీవ్ర విమర్శలు ఉన్నాయి. దీనిపై ఇప్పటికే సీఎం చంద్రబాబు పలుమార్లు నేరుగా ఎమ్మెల్యేలకు హెచ్చరించారు. పనితీరు మార్చుకోవాలని సూచించారు. అయినా కొంతమంది ఎమ్మెల్యేల పనితీరులో మార్పు రావడం లేదు. తాజాగా విలువడిన ఓ సర్వే ఈ విషయాన్ని చెబుతోంది. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఈసారి కూటమి కచ్చితంగా ఘనవిజయం సాధిస్తుందని చెప్పిన సర్వే నిపుణుల్లో ప్రవీణ్ పుల్లట ఒకరు. ఆయన చెప్పిన అంచనాలు ఎన్నికల్లో దాదాపు నిజమయ్యాయి. దీంతో కూటమి ఘనవిజయం సాధించింది. అయితే ఇప్పుడు అదే ప్రవీణ్ పుల్లట కూటమి ప్రభుత్వంలో ఎమ్మెల్యేల పనితీరుపై సంచలన ట్వీట్ చేశారుకూటమి అధికారంలోకి వచ్చిన తరువాత చాలామంది పనితీరు ఆశాజనకంగా లేదని ఇప్పటికే పలుమార్లు ట్వీట్ల రూపంలో తన సర్వే అంశాలను వెల్లడించారు ప్రవీణ్ పుల్లట. అయితే తాజా గణాంకాల ప్రకారం ఈసారి 41 మంది కూటమి ఎమ్మెల్యేలకు మళ్లీ టిక్కెట్ రాదని.. వచ్చినా ఓడిపోతారని సోషల్ మీడియాలో సంచలన ట్వీట్ చేశారు. దీంతో ఇది రాజకీయ వర్గాల్లో చర్చకు దారి తీస్తోంది. కూటమి ప్రభుత్వం ఏడాది పూర్తి చేసుకోనున్న తరుణంలో మరిన్ని సంచలన విషయాలు బయటపెడతానంటూ ప్రవీణ్ పుల్లట మరో ట్వీట్ చేశారు. 92 శాతం వన్ టైం ఎమ్మెల్యేలు మొదటిసారి.. చివరిసారి అంటూ మరో కామెంట్ కూడా పెట్టారు. అయితే ఇది ఎవరి గురించి అన్న విషయం మాత్రం చెప్పలేదు. అయితే ప్రవీణ్ పుల్లట త్వరలో మరిన్ని అంశాలు బయట పెడతారా? లేకుంటే హింట్స్ తో సరి పెడతారా? అన్న దానిపై ఉత్కంఠ కొనసాగుతోంది.ఏపీలో కూటమిఅంతులేని మెజారిటీతో గెలిచింది. 164 అసెంబ్లీ సీట్లతో ఏకపక్ష విజయం సాధించింది. అయితే ప్రభుత్వం ప్రజల అంచనాలకు చేరుకోలేకపోతోందన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి. ఇంకా సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోకపోవడం, అటు పాలన సైతం సజావుగా సాగకపోవడం వంటి కారణాలతో ప్రభుత్వం పై అసంతృప్తి ఉంది. కానీ ఏడాది పాలన కూడా పూర్తి కాకపోవడంతో అది వ్యతిరేకత కు టర్న్ కాలేదు. అయితే ఎన్నికలకు ముందు కూటమికి అనుకూలంగా ఉండే ప్రవీణ్ పుల్లట సర్వే.. ఇప్పుడు వ్యతిరేకంగా మారడం మాత్రం మూడు పార్టీల్లో ఒక రకమైన ఆందోళన కనిపిస్తోంది. ముఖ్యంగా ఎమ్మెల్యేల పనితీరు బాగా లేదన్న విమర్శలు వస్తున్న తరుణంలో సీఎం చంద్రబాబు కఠిన చర్యలకు ఉపక్రమించాలన్న డిమాండ్ వినిపిస్తోంది2024 ఎన్నికల్లో చాలామంది కొత్తవారికి అవకాశం ఇచ్చారు. దాదాపు 80 నుంచి 100 మంది కొత్తగా ఎన్నికైన వారే. ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత ఎన్డీఏ శాసనసభ పక్ష సమావేశం నిర్వహించారు చంద్రబాబు. ప్రజలు బాధ్యతతో ఈ విజయాన్ని కట్టబెట్టారని.. దీనిని నిలుపుకోవాల్సిన అవసరం ఉందని కూడా చెప్పుకొచ్చారు. ప్రజల నుంచి వ్యతిరేకత రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క ఎమ్మెల్యే పై ఉందని తేల్చి చెప్పారు. అటు తర్వాత కూడా వర్క్ షాపులు నిర్వహించి మరి చాలా అంశాలపై గట్టిగానే హెచ్చరికలు పంపారు. అయినా సరే కొంతమంది ఎమ్మెల్యేల వ్యవహార శైలిలో మార్పు రావడం లేదు. మరి ఈ సర్వే తోనైనా జాగ్రత్త పడతారా? లేదా? అన్నది తెలియాలి.

# సామాజిక పెన్షన్లలో భారీగా అక్రమాలు

వియవాడ, ఏప్రిల్ 30, ఏపీ ప్రభుత్వం అమలు చేస్తోన్న సామాజిక పెన్షన్లలో భారీగా అక్రమాలు వెలుగు చూస్తున్నాయి. వేల సంఖ్యలో అనర్హులను గుర్తిస్తున్నారు. వికలాంగుల పెన్షన్లలో ఇప్పటి వరకు 65వేల మంది అనర్హులను గుర్తించారు. పెన్షన్ల తనిఖీ పూర్తయ్యేనాటికి ఈ సంఖ్య మరింత పెరుగనుంది.

ఏపీలో సామాజిక పెన్షన్ల తనిఖీలో తవ్వే కొద్ది అక్రమాలు వెలుగు చూస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున అనర్హులకు పెన్షన్లు చెల్లిస్తున్నారని ప్రజా ప్రతినిధులు ఫిర్యాదు చేయడంతో ఏపీ ప్రభుత్వం వికలాంగుల పెన్షన్ల తనిఖీ చేపట్టింది. వికలాంగులకు రూ.6 వేల నుంచి రూ.15వేల వరకు పెన్షన్లు చెల్లిస్తుండటంతో పెద్ద ఎత్తున అనర్హులు వాటిని దక్కించుకుంటున్నారు.

ఏపీప్రభుత్వం అందిస్తోన్న సామాజిక పెన్షన్లను తప్పుడు ధృవీకరణ పత్రాలతో పొందుతున్నవారి డొంక కదులుతోంది. గత మూడు నెలలుగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం సామాజిక పెన్షన్లను వైద్య బృందాలతో తనిఖీ చేయిస్తోంది. ఈ క్రమంలో బోగస్ సర్టిఫికెట్లతో పెన్షన్లు పొందుతున్న వారిని పెద్ద సంఖ్యలో గుర్తించారు.ఏపీలో నెలకు రూ.6 వేలు నుంచి రూ.15వేల వరకు సామాజిక పెన్షన్లను చెల్లిస్తున్నారు. ఈ క్రమంలో తొలిదశలో రూ.15వేల పెన్షన్లు పొందుతున్న వారిలో అనర్హులను గుర్తించి వాటిని తొలగించారు.రెండో దశలో మార్చి నుంచి రూ.6 వేల పెన్షన్ పొందుతున్న వారికి క్షేత్ర స్థాయి పరీక్షలు నిర్వహించిన అనర్హులను తొల గిస్తున్నారు. శారరీక వైకల్యంలో భాగంగా అయిదు విభా?గాల్లో ప్రతి నెల 8లక్షల మందికి రూ.6 వేల పెన్షన్ చెల్లిస్తున్నారు.ఈ ఏడాది ఫిబ్ర వరి నుంచి ఆరోగ్య శాఖ, సెర్ప్ అధికారుల బృందాలు వైకల్య నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నాయి. లబ్దిదారులను ఎంపిక చేసిన ఆసుపత్రులలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని ప్రభుత్వం సూచించింది.

మొత్తం పెన్షనర్లలో 4లక్షల మంది ఆర్థోపెడిక్ సమస్యలు ఉన్న వారున్నారు. మిగిలిన వారిలో ఈఎన్టీ, కంటి చూపు లోపం, మానసిక వైకల్యం ఇతర సమస్యలున్న వారున్నారు.ఇప్పటి వరకు 3 లక్షల మందికి వైద్య పరీక్షలు పూర్తి చేయగా వారిలో సుమారు 65 వేల మంది అనర్హులను గుర్తించారు. పది వేల మందికి వైకల్యం ఉన్నా.. పెన్షన్ పొందే స్థాయిలో శారీరక వైకల్యం లేదు.శ్రీకాకుళం, విజయనగరం, తూర్పుగోదావరి, కృష్ణా జిల్లాలో అనర్హులుఅధికంగా ఉన్నట్లు గుర్తించారు. నెల్లూరు, అనంత పురం, కర్నూలు, తిరు పతి జిల్లాల్లో అనర్హులు పట్టుబడుతున్నారు.

అంగవైకల్యం, మానసిక, ఈఎన్టీ సమస్యలున్న వారికి నవంబర్ వరకు పరీక్షలు నిర్వహిస్తారు. నెలకు రూ.15 వేల పెన్షన్ పొందే 24,091 మందిలో 7,256 మంది అనర్హులలను గతంలోనే గుర్తించారు. మిగిలిన 70% లో 31.29% మంది రూ.6వేల పెన్షన్‌కు మాత్రమే అర్హత ఉంది.తక్కువ వైకల్యం ఉన్న వారికి 40శాతానికి పైగా వైకల్యంగా నమోదు చేయడంతో వారికి రూ.6వేల పెన్షన్ లభిస్తోంది.

# అంతు చిక్కని కమల వ్యూహం

ఏలూరు, ఏప్రిల్ 30, ఇతర రాష్ట్రాలతో పోలిస్తే భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ లో కొత్త పంథాను ఎంచుకుంది. మిగిలిన రాష్ట్రాల్లో ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తూ వస్తున్నారు. అంతే కాదు వారికి పదవులను కేటాయించడంలోనూ ముందుంటున్నారు. కానీ ఆంధ్రప్రదేశ్ లోమాత్రం పూర్తి భిన్నంగా నిర్ణయాలు తీసుకుంటుంది. గత కొన్నేళ్ల నుంచి బీజేపీ ఆంధ్రప్రదేశ్ లో తీసుకున్న నిర్ణయాలను పరిశీలిస్తే పట్టు బిగించుకోవడానికి, పార్టీ బలోపేతానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, అంతే కాకుండా పార్టీని నమ్ముకున్న వారికి అన్యాయం జరగదని బలమైన సంకేతాలను కూడా పార్టీ కేంద్ర నాయకత్వం క్యాడర్ లోకి పంపే ప్రయత్నం చేస్తుంది. సీనియర్ నేతలను కూడా పక్కన పెట్టి పార్టీ కోసం పనిచేసిన వారికి పదవులను కట్టబెడుతుండటం చర్చనీయాంశమైంది. పొరుగు రాష్ట్రమైన తెలంగాణను తీసుకుంటే అక్కడ ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి పదవులు ఇచ్చారు. డీకే అరుణ కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘకాలం పనిచేసి వచ్చినప్పటికీ ఆమెకు పార్టీ ఉపాధ్యక్షురాలిగా నియమించడమే కాకుండా తర్వాత పార్లమెంటు టిక్కెట్ కూడా ఇచ్చారు. అలాగే కొండా విశ్వేశ్వర్ రెడ్డికి కూడా ఎంపీ సీటును కేటాయించారు. అదే మాదిరిగా టీఆర్ఎస్ లో సుదీర్ఘకాలం ఉండి వచ్చిన ఈటల రాజేందర్ కు కూడా ప్రాధాన్యత ఇస్తూ పార్లమెంటుకు ఎన్నికయ్యేలా చర్యలు తీసుకుంది. కాకపోతే తెలంగాణలోనూ కేంద్ర మంత్రి పదవులు మాత్రం పార్టీని నమ్ముకున్న వారికే ఇచ్చింది. కిషన్ రెడ్డి, బండి సంజయ్ లు తొలి నుంచి బీజేపీలో కిందిస్థాయి నుంచి పనిచేసి వచ్చిన వారికి అవకాశం కల్పించింది. రాజ్యసభ స్థానం కూడా సుదీర్ఘకాలం పార్టీ కోసం పనిచేసిన లక్ష్మణ్ కు ఇచ్చింది. తమిళనాడులో కూడా అన్నాడీఎంకే నుంచి వచ్చిన నేతకు పార్టీ పగ్గాలు అప్పగించింది. అదే తరహాలో ఆంధ్రప్రదేశ్ లోనూ కాంగ్రెస్ పార్టీ నుంచి వచ్చిన పురంద్రీశ్వరికి, కన్నా లక్ష్మీనారాయణకు పార్టీ అధ్యక్ష బాధ్యతలను అప్పగించారు. ఇక మంత్రి పదవుల విషయానికి వచ్చే సరికి పార్టీలో కొత్తగా చేరిన వారికి కాకుండా బీజేపీ సిద్ధాంతాలను నమ్మిన వారికి అందలం ఎక్కించారు. రాష్ట్ర మంత్రిగా సత్యకుమార్ యాదవ్ ను ఎంపిక చేశారు. అలాగే కేంద్ర మంత్రి పదవి కూడా నరసాపురం నుంచి తొలి సారి ఎన్నికైన భూపతి రాజు శ్రీనివాసవర్మను ఎంపిక చేశారు. ఈ నిర్ణయాలన్నీ పార్టీ క్యాడర్ లో ఉత్సాహం నింపగా కూటమి లోని మిత్ర పక్షాలే ఒకింత ఆశ్చర్యపోవాల్సిన పరిస్థితి. సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న... తాజాగా విజయసాయిరెడ్డి రాజీనామాతో ఖాళీ అయిన రాజ్యసభ స్థానంలో జరుగుతున్న ఉప ఎన్నికకు సంబంధించి కూడా ఎవరికీ తెలియని పేరున్న నేతను ఎంపిక చేశారు. ఆంధ్రప్రదేశ్ రాజ్యసభ సభ్యుడిగా నేడు బీజేపీకి చెందిన పాక వెంకట సత్యనారాయణ నామినేషన్ దాఖలు చేశారు. భీమవరానికి చెందిన పాక వెంకట సత్యనారాయణను అనూహ్యంగా బీజేపీ ఎంపిక చేసింది. పాక వెంకట సత్యనారాయణ బీజేపీ క్రమశిక్షణ సంఘం కమిటీ ఛైర్మన్ గా వ్యవహరిస్తున్నారు. ఆయనను ఎంపిక చేయడంతో బీజేపీలో సుదీర్ఘకాలంగా పనిచేసిన వారికి పదవులు ఇస్తున్నట్లయింది. పాక వెంకట సత్యానారాయణ ఎంపిక తో బీజేపీ స్ట్రాటజీఏందో అర్థమవుతుంది. బీజేపీ చాలా ముందు చూపుతో ఇలా వ్యవహరిస్తుందన్న కామెంట్స్ బలంగా వినిపిస్తున్నాయి.

## సాకేకు ప్రమోషన్

అనంతపురం, ఏప్రిల్ 30 2024 ఎన్నికల ఫలితాలతో డీలాపడిన వైసీపీలో పునరుత్తేజం తెచ్చేందుకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలోనే పార్టీలో పదవుల భర్తీ చేపడుతున్నారు. క్షేత్ర స్థాయి నుంచి పార్టీని పునర్నిర్మించాలని భావిస్తున్న వైఎస్ జగన్.. ఆ క్రమంలో పలు స్థానాలకు ఇంఛార్జులను, సమన్వయకర్తలను నియమిస్తున్నారు. తాజాగా శింగనమల నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్తగా మాజీ మంత్రి సాకే శైలజానాథ్‌ను.. వైఎస్ జగన్ నియమించారు. 2024 ఎన్నికల్లో శింగనమల నియోజకవర్గం నుంచి వీరాంజనేయులును వైఎస్ జగన్ బరిలో నిలిపారు. సిట్టింగ్ ఎమ్మెల్యే అయిన జొన్నలగడ్డ పద్మావతిని కాదని.. వీరాంజనేయులను బరిలో దింపారు. టిప్పర్ డ్రైవర్‌గా పనిచేసిన నేపథ్యం ఉన్న వీరాంజనేయులుకు టికెట్ ఇవ్వటం అప్పట్లో చర్చనీయాంశమైంది. అయితే టీడీపీ అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ చేతిలో వీరాంజనేయులు ఓటమి పాలయ్యారు.అయితే తాజా రాజకీయ పరిస్థితుల్లో సాకే శైలజానాథ్‌ను శింగనమల వైసీపీ ఇంఛార్జిగా జగన్ నియమించారు. గతంలో కాంగ్రెస్ పార్టీలో పనిచేసిన సాకే శైలజానాథ్ 2025 ఫిబ్రవరిలో వైఎస్ జగన్ సమక్షంలో వైసీపీ కండువా కప్పుకున్నారు. అప్పటి నుంచి వైసీపీ తరుపున కూటమి ప్రభుత్వ విధానాలపై గళమెత్తుతున్నారు. తాజాగా ఆయనకు నియోజకవర్గ బాధ్యతలు అప్పగిస్తూ జగన్ నిర్ణయించుకోవడం విశేషం. మరోవైపు కాంగ్రెస్ పార్టీ ద్వారా సాకే శైలజానాథ్ రాజకీయ రంగ ప్రవేశం చేశారు. శింగనమల నుంచి 2004, 2009లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీచేసి విజయం సాధించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో మంత్రిగా కూడా పనిచేశారు.అయితే రాష్ట్ర విభజన తర్వాత ఏపీలో కాంగ్రెస్ పరిస్థితి దిగజారింది. ఎన్నికల్లో అన్ని స్థానాల్లో అభ్యర్థులను కూడా బరిలో దింపలేని పరిస్థితికి చేరుకుంది. అయినప్పటికీ సాకే శైలజానాథ్ కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగారు. 2022లో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా కూడా సాకే శైలజానాథ్ పనిచేశారు. అయితే 2024 ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు శైలజానాథ్ టీడీపీలో చేరతారనే ప్రచారం జరిగింది. జేసీ దివాకర్ రెడ్డిని కలవడంతో సాకే శైలజానాథ్ టీడీపీలో చేరబోతున్నారంటూ వార్తలు వచ్చాయి. అయితే ఆయన కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా శింగనమల నుంచి పోటీ చేసి మూడో స్థానంలో నిలిచారు. ఆ తర్వాత ఈ ఏడాది ప్రారంభంలో వైఎస్ జగన్‌ను కలిసిన సాకే శైలజానాథ్ వైసీపీలో చేరారు. ఇప్పుడు శింగనమల వైసీపీ ఇంఛార్జిగా నియమితులయ్యారు.

# గ్రాండ్ గా గ్రౌండ్ ప్లానింగ్...

విజయవాడ, ఏప్రిల్ 30, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏ పనిచేసినా చాలా పకడ్బందీగా చేస్తారు. ఆయన డ్రీమ్ ప్రాజెక్టును లాంచ్ చేయడానికి ఎప్పుడైనా గ్రాండ్ గానే ప్లాన్ చేస్తారు. దానివల్ల ప్రచారంతో పాటు హైప్ క్రియేట్ అవుతుందని, దాని వల్ల రాష్ట్రానికి ఎంతో ఉపయోగముంటుందని చంద్రబాబు భావిస్తారు. ఇప్పటి వరకూ పదిహేనేళ్ల పాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన కాలంలోనూ ప్రతి పనికీ రాజకీయాన్ని జోడించి తనకు కీర్తి ప్రతిష్టల స్థాయిని మరింత పెంచేలా చంద్రబాబు డిజైన్ చేస్తారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోనూ ఇప్పటికీ హైదరాబాద్ ఐటీ రంగంలో అభివృద్ధి చెందిందని అన్నా, నేటికీ హైదరాబాద్ అత్యధికంగా ఆదాయాన్ని ఆర్జించి పెట్టే ప్రాంతంగా తీర్చిదిద్దింది ఎవరన్నా ప్రత్యర్థులు సయితం చంద్రబాబు వైపు వేళు చూపించాల్సిందే.సంపద పెరుగుతుందని... అదే చంద్రబాబు నాయుడు కోరుకునేది. కావాల్సింది. అందుకే తాజాగా అమరావతి రాజధాని పునర్మిరాణ పనుల ప్రారంభం పేరిట చంద్రబాబు చేస్తున్న హడావిడి వెనక కూడా అంతే బలీయమైన ఆకాంక్ష ఉందంటున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ రాజధాని పనులకు శంకు స్థాపనలు చేసి వెళ్లిన తర్వాత ఈ ప్రాంతంలో రియల్ ఎస్టేట్ ధరలు మరింత పెరుగుతాయని ఆయనకు తెలుసు. నిర్మాణ పనులు ప్రారంభమయిన తర్వాత ఇక్కడ ఒక్కసారిగా భూముల ధరలకు రెక్కలు వచ్చి రియల్ వ్యాపారం ఊపందుకుని పరోక్షంగా ప్రభుత్వానికి కూడా సంపద చేకూరుతుందని చంద్రబాబు అంచనా వేస్తున్నారు. అదే సమయంలో అనేక సంస్థలు కూడా అమరావతిలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తాయని చంద్రబాబు ఆశిస్తున్నారు. . అమరావతి పునర్నిర్మాణం పేరుతో ఖర్చు పెట్టే ప్రతి పైసా రాష్ట్రానికి అంతే వేగంగా తిరిగి వస్తాయని చంద్రబాబు భావిస్తున్నారు. అందుకోసమే కొంత ఆర్భాటమైనా తాను అనుకున్నది చేసి తీరాలన్న పట్టుదలతో చంద్రబాబు ఉన్నారు. ఒకటి కాదు..రెండు కాదు.. లక్షల కోట్ల రూపాయలు ప్రభుత్వానికి అదనంగా సంపదను సమకూర్చుకోవాలంటే ఆ మాత్రం రిస్క్ తీసుకోక తప్పదు. వాస్తవానికి అయితే మరో ఏ ముఖ్యమంత్రి అయినా రాజధాని పునర్నిర్మాణ పనులు పేరిట ఇంత పెద్ద స్థాయిలో సభను ఏర్పాటుచేయరు. కానీ చంద్రబాబు ఆలోచన మాత్రం వేరుగా ఉంటుంది. అమరావతి కల సాకారమయితే తన పేరు చిరస్థాయిగా మిగిలిపోతుందన్న భావనతో ఆయన ఒక్కొక్క అడుగూ ముందుకు వేస్తున్నారు.. ప్రధాని నరేంద్ర మోదీ రావడంతో కొంత హైప్ రావడమే కాకుండా ఈ కార్యక్రమంతో చంద్రబాబుకు తన ఇమేజ్ కూడా మరింత పెరుగుతుందని తెలుసు. ఒకవైపు అభివృద్ధి మరొకవైపు సంక్షేమాన్ని కలగలుపుతూ తీసుకెళ్లేది చంద్రబాబు మాత్రమేనని ఇప్పటికే ప్రజలు నమ్ముతారు. ఆ నమ్మకం చెక్కు చెదరకుండా ఉండేందుకే చంద్రబాబు నాయుడు అమరావతి రాజధాని నిర్మాణ పనుల కు శంకుస్థాపన కార్యక్రమానికి భారీగా ప్లాన్ చేసినట్లు స్పష్టంగా అర్థమవుతుంది. మరొక వైపు దేశంలోనే అమరావతి బ్రాండ్ ఇమేజ్ పెరగడం ఖాయమని చంద్రబాబు అంచనా వేస్తున్నారు. మొత్తం మీద చంద్రబాబు నాయుడు ఆలోచనలు గ్రౌండ్ అయితే మాత్రం గ్రాండ్ సక్సెస్ అయినట్లేనని అనుకోవాల్సి ఉంటుంది.

# వ్యాపారం మీది, పెట్టుబడి ప్రభుత్వానిది

నెల్లూరు, ఏప్రిల్ 30, ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత యువతకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించే అంశంపై ఎక్కువ దృష్టి పెట్టింది. ప్రతి ఇంటికి వ్యాపారవేత్తలను సిద్ధం చేస్తానంటూ ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు ప్రభుత్వం ఆ దిశగా చాలా ప్రయత్నాలు చేస్తోంది. ఆ హామీలో భాగంగా ప్రభుత్వం కొత్తగా ఓ స్కీమ్ తీసుకొచ్చింది. దీని ద్వారా ఔత్సాహికులు సొంతగా వ్యాపారాలు చేసుకోవడమే కాకుండా పది మందికి పని కల్పించేందుకు వీలు అవుతుంది. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ కార్పొరేషన్ ద్వారా ఔత్సాహికులకు లోన్ ఇచ్చే స్కీమ్‌ను ప్రభుత్వం తీసుకొచ్చింది. ఇందులో లోన్ తీసుకున్న వారంతా వ్యవసాయం, దాని అనుబంధ సంస్థలు, రవాణా, పరిశ్రమలు, సేవల రంగం, వ్యాపార రంగాల్లో నిలదొక్కుకునేలా ప్రయత్నాలు చేయవచ్చు. ఉపాధి పొందడమే కాకుండా తోటి వారికి కూడా పని కల్పించే అద్భుతమైన అవకాశానని ప్రభుత్వం కల్పిస్తోంది. ప్రస్తుతానికి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా లోన్‌లు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. మే పదో తేదీ వరకు అప్లై చేసుకోవడానికి గడువు ఇచ్చింది. ఇలా ఎస్సీ కార్పొరేషన్ ద్వారా లోన్ తీసుకొని 32 రకాల వ్యాపారాలు చేసుకోవచ్చు. ఇందులో కొన్నింటికి మినిమం అర్హత పెట్టారు. మరికొన్నింటికి అసలు ఎలాంటి విద్యార్హత లేకుండానే అప్పులు ఇవ్వబోతున్నారు. ఈ స్కీమ్ పొందాలంటే అర్హతలు ఏంటీ?

ఎస్సీ కార్పొరేషన్ ద్వారా వచ్చే లోన్ పొందాలంటే లబ్ధిదారుడు ఏదైనా ూఅ కమ్యూనిటీకి చెందినవారై ఉండాలి. కుల ధృవీకరణ పత్రం కలిగి ఉండాలి. ఏపీకి చెందిన వ్యక్తులే ఈ స్కీమ్‌కు అర్హులు. లబ్ధిదారుడి వయస్సు 21 నుంచి 50 సంవత్సరాల మధ్య ఉండాలి. లబ్ధిదారుడు దారిద్ర్యరేఖకు దిగువన (ఃఖఒ) వర్గంలో ఉండాలి.

మొదటి లబ్ధిదారుడు ష్ట్రబిబిజూబ://జీజూనీఎఎఎబ.జీజూఇటబబ.తిని/ వెబ్‌సైట్‌లోకి వెళ్లి ప్రాథమిక వివరాలు నమోదు చేయాలి. అనంతరం యూజర్ ఐడి ఒ పాస్‌వర్డ్ వస్తుంది. యూజర్ ఐడి అంటే రిజిస్ట్రేషన్ కోసం ఇచ్చిన మొబైల్ నంబర్. పాస్‌వర్డ్ అంటే ఆ నెంబర్‌కు వచ్చే ూఖ దీని ఆధారంగా లాగిన్ అవ్వాలి. అనంతరం రెండో దశలో లబ్ధిదారుడు తన దరఖాస్తు పూర్తి చేయడానికి అడ్రెస్, కులం, విద్యార్హతలు, పథకం వివరాలు పూర్తి చేసి స్కీమ్‌లోకి లాగిన్ అవ్వాలి. అప్లై చేసిన తర్వాత దరఖాస్తుదారుడు అప్లికేషన్ ప్రింట్ తీసుకోవాలి. ఎస్సీ కార్పొరేషన్ మూడు విభాగాల్లో రుణాలు ఇస్తుంది. మొదటి విభాగంలో ఉన్న వారికి రూ.3 లక్షలలోపు పెట్టుబడి వ్యయం యూనిట్లు అందజేస్తారు. రెండో విభాగంలో రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలలోపు వారికి పెట్టుబడి సాయం అందజేస్తారు. మూడో జాబితాలో రూ. పది లక్షలపైన ఆర్థిక సాయం చేస్తారు. మొదటి కేటగిరిలో లబ్ధిదారులకు ప్రభుత్వం 60 శాతం సాయం చేస్తుంది. బ్యాంకులు 35 శాతం రుణం ఇస్తాయి. ఐదు శాతం లబ్ధిదారులు వాటా పెట్టుకోవాల్సి ఉంటుంది. గరిష్టంగా ఈ కేటగిరిలో లక్ష రూపాయల వరకు సబ్సిడీ పొందవచ్చును. రెండో కేటగరిలో ప్రభుత్వం నుంచి 40 శాతం సాయం అందనుంది. బ్యాంకులు 55 శాతం వరకు రుణాలు ఇస్తాయి. మిగిలిన ఐదు శాతం లబ్ధిదారులు పెట్టుబడి పెట్టుకోవాలి. ఈ కేటగిరిలో ఇచ్చే రాయితీలు ఇతర ఫెసిలిటీసే మూడో కేటగిరికి కూడా వర్తిస్తాయి.

# అనంతపురంలో 'అమ్మ రాజీనామా' కథ.. 'పాపకు ఏమీ కాని ఓ తల్లి' లేఖ

అనంతపురం , ఏప్రిల్ 30, అమ్మ రాజీనామా.. ఇది ఒక సినిమా పేరు.. కానీ రియల్ లైఫ్‌లోనూ ఓ తల్లి అమ్మ పదవికి రాజీనామా చేసింది. కొన్ని అనివార్య కారణాలతోనే అమ్మ పదవికి న్యాయం చేయలేకపోతున్నానని.. పొత్తిళ్లలో ఉండాల్సిన తన పసిపాపను తీసుకెళ్లి రోడ్డు పక్కన వదిలేసింది. శిశువుకు చక్కగా స్నానం చేయించి ఓ బేబీ బెడ్‌లో పడుకోబెట్టి రోడ్డు పక్కన ఉంచింది. తాను అమ్మ పదవికి రాజీనామా చేస్తున్నట్లుగా ఓ లేఖను రాసి.. అందులో తన పాపను రోడ్డుపై ఎందుకు అలా అనాథగా వదిలి వెళ్లాల్సి వచ్చిందో వివరించింది. ఆ లేఖలో చివరిగా రాసిన ఐదు పదాలు ఎమోషనల్‌గా ఉన్నాయి.అనంతపురంలోని విజయనగరం కాలనీ అది.. అప్పుడే పుట్టిన ఆడ శిశువును రోడ్డు పక్కన వదిలేసి వెళ్లారు. పసికందు ఏడుపు విని అక్కడికి వెళ్లిన స్థానికులు చిన్నారిని అక్కున చేర్చుకున్నారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా.. వారు పాపను తీసుకెళ్లి ఆస్పత్రిలో చేర్చారు.. ఆ తర్వాత ఐసీడీఎస్ అధికారులు అక్కడికి వచ్చారు. చిన్నారిని తమ సంరక్షణలో ఉంచేందుకు తీసుకెళ్లారు. అయితే శిశువు దగ్గర తల్లిదండ్రులు రాసిన లేఖను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.ఆ లేఖలో.. 'ప్రియమైన మేడం, సార్ గారికి నా నమస్కారాలు.. నా కూతుర్ని నేను పోషించలేను.. మీరే నా కూతురికి ఒక మంచి జీవితం ఇవ్వాలని కోరుకుంటూ.. మీ దగ్గర వదిలి వెళ్లిపోతున్నాను. తన జీవితం బాగుండాలి.. తనని మీరే బాగా చూసుకోవాలని వేడుకుంటున్నాను. నేను చనిపోతున్నాను. నా కూతుర్ని బాగా చూసుకోండి సార్ ప్లీజ్.. ఒక తల్లిగా నా ఆవేదన.. పాపకి ఏమీ కాని ఓ తల్లి' అంటూ ఓ నోట్‌ను ఆ చిన్నారి పాప పక్కనే వదిలేసి వెళ్లారు. పాపను రోడ్డు పక్కన వదిలేసి ఈ లేఖ ఉంచింది ఎవరు అన్న కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు.. దగ్గరలోని సీసీ ఫుటేజ్‌ను పరిశీలించే పనిలో ఉన్నారు. అలాగే అనంతపురం పోలీసులు పాప గురించి ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్న స్థానికుల్ని అడిగి తెలుసుకుంటున్నారు.

# ఘనంగా బసవ జయంతి వేడుకలు

## నివాళులు అర్పించిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**రాజన్న సిరిసిల్ల జిల్లా, ఏప్రిల్ -30 (ప్రజాబలం ప్రతినిధి)**బసవ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో బుధవారం బసవ జయంతి వేడుకలను నిర్వహించగా, కలెక్టర్ హాజరయ్యారు. ముందుగా బసవేశ్వర చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు.కార్యక్రమంలో సిరిసిల్ల ఆర్డీవో రాధాబాయి, జడ్పీ సీఈవో వినోద్ కుమార్, బీసీ సంక్షేమ శాఖ అధికారి రాజ మనోహర్ రావు, డీఆర్డీఓ శేషాద్రి, కుల సంఘం ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# టార్గెట్ గొట్టిపాటి..

ఒంగోలు, ఏప్రిల్ 30, వైయస్సార్ కాంగ్రెస్ అధినేత ప్రకాశం జిల్లాపై దృష్టి పెట్టారు. ప్రధానంగా అద్దంకి నియోజకవర్గం పై ఫుల్ ఫోకస్ పెట్టారు. అక్కడ మంత్రి గొట్టిపాటి రవికుమార్ హవాకు బ్రేక్ వేయాలని చూస్తున్నారు. సమర్ధుడైన నాయకుడిని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జిగా తేవాలని చూస్తున్నారు. 2029 ఎన్నికల్లో గొట్టిపాటి రవికుమార్ ను ఓడించే నేతను తేవాలన్నది జగన్మోహన్ రెడ్డి ప్లాన్. ఈ క్రమంలో సీనియర్ నేత కరణం బలరామకృష్ణమూర్తి సేవలను వినియోగించుకోవాలని చూస్తున్నారు. ఎలాగైనా 2029లో అసెంబ్లీలో గొట్టిపాటి రవికుమార్ అడుగుపెట్టకూడదు అన్నది జగన్మోహన్ రెడ్డి ప్లాన్.అద్దంకి అంటే ముందుగా గుర్తుకొచ్చేది కరణం బలరాం. ఆ నియోజకవర్గంలో తనకంటూ ఒక ముద్ర చాటుకుంటూ వచ్చారు. కానీ గొట్టిపాటి రవికుమార్ కు బ్రేక్ వేయలేకపోయారు. కాంగ్రెస్ పార్టీ ద్వారా పొలిటికల్ ఎంట్రీ ఇచ్చిన రవికుమార్ వరుసగా ఐదు సార్లు గెలుస్తూ వచ్చారు. అద్దంకిలో అయితే నాలుగు సార్లు వరుస విజయంతో తనకంటూ ఒక ముద్ర చాటుకున్నారు. రెండున్నర దశాబ్దాలుగా అక్కడ రాజకీయాలను శాసిస్తున్నారు. ముఖ్యంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి కొరకరాని కొయ్యగా మారిపోయారు. అందుకే రవికుమార్ హవాకు బ్రేక్ వేయాలని చూస్తున్నారు జగన్మోహన్ రెడ్డి.2004లో పొలిటికల్ ఎంట్రీ ఇచ్చారు గొట్టిపాటి రవికుమార్ తొలిసారిగా మార్టూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలిచారు. అసెంబ్లీలో అడుగుపెట్టారు. 2009 పునర్విభజనతో మార్టూరు అద్దంకిగా మారింది. దీంతో గొట్టిపాటి రవికుమార్ అద్దంకికి మారాల్సి వచ్చింది. ఆ ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి కరణం బలరాం పై పోటీ చేసి గెలిచారు రవికుమార్. 2014 ఎన్నికల నాటికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు రవి కుమార్. ఆ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు. తర్వాత తెలుగుదేశం పార్టీలోకి ఫిరాయించారు. 2019 ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా మూడోసారి అద్దంకి నుంచి పోటీ చేసి గెలిచారు. ఎన్ని రకాల ఇబ్బందులు ఎదురైనా తెలుగుదేశం పార్టీలో కొనసాగారు. 2024 ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. మంత్రిగా ఎన్నికయ్యారు.2024 ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా హనీమిరెడ్డినిబరిలో దించారు జగన్మోహన్ రెడ్డి. ఈయన వైవి సుబ్బారెడ్డి కి సన్నిహితుడు. అయితే ఓటమి తర్వాత హనీమిరెడ్డి నియోజకవర్గంలో కనిపించడం లేదు. దీంతో ఇక్కడ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచే నాయకుడు లేకుండా పోయారు. అందుకే ఇప్పుడు సమర్థవంతుడైన నేత కోసం జగన్మోహన్ రెడ్డి అన్వేషిస్తున్నారు. ఈ క్రమంలోనే కరణం బలరామకృష్ణకు కబురు చేశారు. అద్దంకి నియోజకవర్గ బాధ్యతలు తీసుకోవాలని సూచించారు. మొన్నటి ఎన్నికల్లో చీరాల నుంచి కరణం బలరాం కుమారుడు వెంకటేష్ వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. అయితే కరణం బలరాం టిడిపిలోకి వెళ్ళిపోతారని ప్రచారం జరుగుతోంది. సరిగ్గా ఇటువంటి సమయంలోనే జగన్మోహన్ రెడ్డి పిలిచి బలరాం తో మాట్లాడినట్లు తెలుస్తోంది. త్వరలో అద్దంకి బాధ్యతలు బలరామకృష్ణకు అప్పగిస్తారని ప్రచారం జరుగుతోంది. అందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

## ఈ తరానికి ఆదర్శనీయుడు పుచ్చలపల్లి సుందరయ్య

### -నేడు ఆయన జయంతి




పుచ్చలపల్లి సుందరయ్య ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు, తెలంగాణా రైతాంగ సాయుధ పోరాట వీరుడు, స్వాతంత్ర్య సమర యోధుడు. కమ్యూనిస్టు గాంధీగా పేరొందిన సుందరయ్య తెలుగునాట కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతలలో ప్రముఖుడు. కులవ్యవస్థను నిరసించిన ఇతను అసలు పేరు పుచ్చలపల్లి సుందరరామిరెడ్డి లోని రెడ్డి అనే కులసూచికను తొలగించుకున్నాడు. సహచరులు ఇతనును "కామ్రేడ్ పి.ఎస్." అని పిలిచేవారు. ఇతను నిరాడంబరతతో ఆదర్శ జీవితం గడిపాడు. స్వాతంత్ర సమరంలోని అనేక ఉద్యమాల్లో పాల్గొన్నాడు. సుందరయ్య భార్య కూడా సీపీఐ-ఎంలోని ముఖ్య నాయకురాలు. తెలంగాణ ప్రజల పోరాటం - దాని పాఠాలు, విశాలాంధ్రలో ప్రజారాజ్యం వంటి పుస్తకాలు, నివేదికలు రాశాడు. పార్లమెంటు సభ్యునిగా సుదీర్ఘ కాలం పనిచేశాడు, ఆ సమయంలో పార్లమెంటుకు కూడా సైకిల్ మీద వెళ్ళేవాడు.

పుచ్చలపల్లి సుందరయ్య, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా విడవలూరు మండలం, అలగానిపాడు గ్రామంలో ఒక భూస్వామ్య

కుటుంబంలో 1913, మే 1 న జన్మించాడు. తండ్రి వెంకటరామిరెడ్డి, తల్లి శేషమ్మ. తల్లిదండ్రులు ఇతనికు సుందరరామిరెడ్డి అని పేరు పెట్టారు. ఆరేళ్ళ వయసులో తండ్రి మరణించాడు. ప్రాథమిక విద్యను వీధిబడిలోనే పూర్తిచేసాడు. తరువాత అక్కయ్య వాళ్ళ ఇంటివద్ద ఉంటూ తిరువళ్ళూరు, ఏలూరు, రాజమండ్రి, మద్రాసు లలో చదివాడు. ఇతనిని "కమ్యూనిస్టు గాంధీ" అంటారు. పార్లమెంటు భవనంలో చప్రాసీల సైకిళ్లతోపాటు ఇతని సైకిలు కూడా స్టాండులో ఉండేది. రాష్ట్ర విధానసభలోనూ అదే సైకిలును ఉపయోగించాడు. పెళ్ళి చేసుకున్న తర్వాత సంతానం కలిగితే తన ప్రజాసేవకు ఆ బంధాలు, బాంధవ్యాలు అడ్డుతగులుతాయని పెళ్ళికాగానే కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స చేయించుకొన్నాడు. తండ్రినుంచి వంశపారంపర్యంగా లభించిన ఆస్తిని నిరుపేద ప్రజలకు పంచివేశాడు.1985, మే 19న మద్రాసులోని అపోలో ఆస్పత్రిలో పుచ్చలపల్లి కన్నుమూశాడు. హైదరాబాద్ భాగ్‌లింగంపల్లిలో ఆయన పేరుతో గ్రంథాలయం, ఆడిటోరియం, పార్కు ఏర్పాటయ్యాయి. గాంధీజీ నిరాడంబరత, ప్రకాశం వంటి ప్రజా సాన్నిహిత్యం, పటేలు వంటి పట్టుదల, నెహ్రూ వంటి రాజకీయ పరిణతి సుందరయ్యలో ఉన్నాయని పాతతరం నాయకులు వర్ణిస్తారు.

1952 లో సుందరయ్య మద్రాసు నియోజక వర్గం నుండి పార్లమెంటు రాజ్యసభకు ఎన్నికయ్యాడు. పార్లమెంటులో కమ్యూనిస్టు వర్గానికి నాయకుడయ్యాడు. తరువాత రాష్ట్ర శాసనసభకు ఎన్నికై, 1967 వరకు శాసన సభా సభ్యునిగా కొనసాగాడు. మళ్ళీ కొంత కాలం విరామం తరువాత 1978 లో శాసన సభకు ఎన్నికై, 1983 వరకు శాసన సభ సభ్యునిగా ఉన్నాడు. తను మరణించే సమయానికి సుందరయ్య ఆంధ్ర ప్రదేశ్‌లో పార్టీ సాధారణ కార్యదర్శి, కేంద్ర కమిటీ సభ్యుడు.

# మరిన్ని ఉగ్రదాడులు..

# అప్రమత్తమైన ఇంటెలిజెన్స్

శ్రీనగర్, ఏప్రిల్ 30, (న్యూస్ పల్స్) జమ్మూ కాశ్మీర్లో మరిన్ని ఉగ్రదాడులకు అవకాశం ఉందని ఇంటెలిజెన్స్ వర్గాలు కేంద్రాన్ని హెచ్చరించాయి. దాంతో అప్రమత్తమైన ప్రభుత్వం జమ్మూ కాశ్మీర్లోని సగానికి పైగా పర్యాటక స్థలాలను మూసివేసింది. మరికొన్ని పర్యాటక స్థలాల వద్ద భద్రత పెంచింది. కాశ్మీర్ వ్యాప్తంగా 87 టూరిస్టు కేంద్రాలు ఉండగా 48 నుంచి 50 వరకు పర్యాటక స్థలాలను మూసివేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది. సోన్ మార్గ్, దాల్ లేక్, గుల్మార్గ్, బైసారన్ లోయ సహా సున్నితమైన పర్యాటక కేంద్రాలలో ప్రత్యేక భద్రత దళాలు ఏర్పాటు చేశారు.పర్యాటకులు ప్రవేశించడానికి అనుమతించని టూరిస్ట్ ప్రదేశాలలో గురేజ్ లోయ, దూద్‌పత్రి ఉన్నాయి. గత వారం 'మినీ స్విట్జర్లాండ్'గా పిలుచుకునే బైసరన్‌లో ఉగ్రవాదులు పర్యాటకులపై దాడి చేయగా 26 మంది ప్రాణాలు కోల్పోయారు. 2019 పుల్వామా దాడి తర్వాత కాశ్మీర్ లోయలో అతిపెద్ద దాడి ఇది. పర్యాటకులకు ముప్పు ఉందని, మరో ఉగ్రదాడి జరిగే అవకాశం ఉందని భావించి కాశ్మీర్‌లోని 87 పబ్లిక్ పార్కులు, ప్రదేశాలలో 48 చోట్ల గేట్లు మూసివేశారు. భద్రతా సమీక్ష కొనసాగుతోందని, రాబోయే రోజుల్లో జాబితాలో మరిన్ని ప్రదేశాలను మూసివేసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారని తెలిపింది.మూసివేసిన పర్యాటక ప్రదేశాలు కాశ్మీర్‌లోని సుదూర ప్రాంతాలలో ఉన్నాయని, గత పదేళ్లలలో తెరుచుకున్న కొత్త టూరిస్ట్ స్పాట్స్ కూడా మూసివేసినట్లు అధికారులు తెలిపారు. పర్యాటకులు సందర్శించలేని ప్రదేశాలలో కోకెర్నాగ్, దుక్సుమ్, మార్గన్ టాప్, సింథాన్ టాప్, అచ్చబల్, బాంగస్ లోయ, తోసామైదాన్ ఉన్నాయి.ఏప్రిల్ 22న జరిగిన పహల్గాం ఉగ్రదాడి కేసును జాతీయ దర్యాప్తు సంస్థ దర్యాప్తు చేస్తోంది. ఉగ్రదాడికి సంబంధించి రోజుకో వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఆ వీడియోల ఆధారంగా, ఆ వీడియో తీసిన వ్యక్తుల సమాచారాన్ని సేకరిస్తున్నారు. అసలు ఆ సమమయంలో ఏం జరిగింది, ప్రత్యక్ష సాక్షులను విచారించడానికి అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. ఉగ్రదాడి జరిగిన బైసరన్ లోయ ప్రదేశంలో ఐఎన్ఐఏ అధికారులు సీన్ రీక్రియేట్ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఆ సమయంలో బైసరన్ లోయను సందర్శించిన వారిని ప్రశ్నించి ఉగ్రదాడికి సంబంధించి పూర్తి వివరాలు సేకరించే పనిలో అధికారులు ఉన్నారు.

# మేడే ఒక చారిత్రాత్మక చైతన్య దినం

## -నేడు 139వ అంతర్జాతీయ కార్మిక దినోత్సవం

## -కార్మికులకు, కర్షకులకు మేడే శుభాకాంక్షలు




మే డే!.. కార్మిక దినోత్సవం? ప్రతి ఏడాది మే 1 వ తేదీ నాడు జరుపుకునే స్మారక దినం. చాలా దేశాలలో మే దినం అంతర్జాతీయ కార్మిక దినోత్సవం లేదా కార్మిక దినోత్సవం తో ఏకీభవిస్తాయి. ఇవి అన్నీ కూడా కార్మికుల పోరాటం మరియు కార్మికుల ఐక్యతను గర్విస్తాయి.కొన్ని పురాణగాథలు కొన్ని రోజులను పండుగలుగా మార్చాయి. కొన్ని జాతీయ సంఘటనలు ఆ సమాజానికి పర్వదినాలు అవుతాయి. కొందరు మహనీయులు తమ రక్తాన్ని చిందించి కొన్ని రోజులను చారిత్రాత్మక రోజులుగా మారుస్తారు. మే డే ఒక చారిత్రాత్మక చైతన్య దినం. చికాగోలో వున్న కొంతమంది రక్తతర్పణం చేసి కేవలం తమ దేశంలో వుండే కార్మికవర్గానికే కాకుండా ప్రపంచానికంతటికీ కొత్త వెలుగును అందించారు. మే డే ఒక చారిత్రాత్మక చైతన్య దినం. తమ హక్కుల కోసం రక్తార్పణం చేసి కార్మికవర్గానికే కాకుండా ప్రపంచానికి కొత్త వెలుగులు అందించిన చరిత్ర మే డే కు ఉంది. అందుకే నాడు కార్మికులు 8 గంటల పనిదినం కోసం పోరాడారు. ప్రాణాలు సైతం త్యాగం చేసి కార్మిక ప్రపంచానికి చీకటిని చెరిపేసి వెలుగునందించారు. వారి పోరాటం నేటి సమాజానికి సైతం స్ఫూర్తిమంతం... 19వ శాతాబ్దంలో పెట్టుబడిదారులు కార్మికులను చేస్తున్న దోపిడీని గ్రహించి మార్క్సిస్టు మూల పురుషుడు కార్ల్ మార్క్స్ ప్రపంచ కార్మికులారా ఏకం కండి... పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళ్లు తప్ప... అని ఇచ్చిన నినాదానికి కార్మికుల నుంచి ఉవ్వెత్తున స్పందిన వచ్చింది. ఇంగ్లాండ్ యురోపియన్ దేశాల్లో పారిశ్రామిక రంగం వేగంగా అభివృద్ధి చెందుతున్న సమయంలో అటు కార్మిక రంగం అంతేవేగంగా విస్తరించింది. ఈ పారిశ్రామిక విప్లవం ప్రారంభ దినాల్లో శ్రామికులను యాజమాన్యాలు, బానిసల్లా పనిచేయించుకునే వారు. కార్మికులకు కనీస సౌకర్యాలు, తగిన వేతనం, కల్పించకపోగా రోజుకు 18- 20 గంటలు పనిచేయించే వారు. దీంతో కార్మికులు మొదటిసారిగా 1806లో తిరుగుబాటుకు చేశారు. బ్రిటన్‌లో ప్రారంభమైన ఈ తిరుగుబాటు అమెరికా సంయుక్త రాష్ట్రాలతో పాటు యూరప్, ఫ్రాన్స్, జర్మనీ తదితర దేశాలకు పాకింది. 8 గంటలు పనిదినం, 8 గంట నిద్ర, 8 విశ్రాంతి కావాలంటూ అటు యూరప్ లోను, ఇటు అమెరికాలోని కార్మికులు ఉద్యమించారు. ఈ తిరుగుబాటు మొత్తానికి అమెరికా ఫెడరేషన్ ఆఫ్ లేబర్స్ యూనియన్ నాయకత్వం వహించింది. చికాగో నగరంలో 1886మే 1న హే మార్కెట్ ప్రాంతంలో కార్మికుల హక్కుల కోసం భారీ నిరసన ప్రదర్శన జరిపారు. ఈ ర్యాలీని చెదరగొట్టేందుకు అమెరికా ప్రభుత్వం పోలీసులను ఉసిగొల్పింది. దీంతో రెచ్చిపోయిన పోలీసులు ప్రదర్శనపై కాల్పులు జరిపారు. నలుగురు కార్మికులు తుపాకీ తుటాలకు బలయ్యారు. కాల్పులకు వ్యతిరేకంగా మే 4న మరో నిరసన సభ ఏర్పాటు చేశారు. ఈ సభనూ చెదరగొట్టే ప్రయత్నంలో పోలీసులు మరోసారి ప్రతాపాన్ని చూపారు. స్వైర విహారం చేశారు. దీంతో చికాగో లోని హే మార్కెట్ రక్తంతో పూర్తిగా తడిసి ముద్దైంది. అక్కడే ఆవిర్భవించింది ఈ అరుణపతాకం. ఆ విధంగా మే 1 ప్రపంచ కార్మిక వర్గ విప్లవపోరాట ఉద్యమ చరిత్రలు రక్తాక్షరాలతో లిఖించదగింది. ఆనాటి పోరాటాలు ఒక్క చికాగో నగరమేగాక ప్రపంచం నలుమూలల వ్యాపించాయి. ఆ రకంగా మొదలైన మే డే నాటి నుంచి మన దేశంలో వామపక్షాల ఆధ్వర్యంలోని కార్మికులు, ఉత్సవాలను జరుపుతున్నారు. నాటి నుంచి నేటి వరకు అనేక రూపాల్లో కార్మికులు తమ పోరాటాలను కొనసాగిస్తూనే ఉన్నారు.

ఛభారతదేశంలో...భారతదేశంలో చికాగో కంటే ముందే కలకత్తాలో కార్మికులు నిర్ణీత పనిగంటల కోసం హౌరా రైల్వేస్టేషన్‌లో 1862లో సమ్మెచేశారు. అప్పటివరకు ఆ రైల్వే కార్మికులు 10 గంటలు పనిచేసేవారు. అప్పుడే బెంగాల్ పత్రికల్లో పాలకవర్గానికి చెందిన అధికారులు ఎన్ని గంటలు పనిచేస్తారో మేము కూడా అన్ని గంటలే పనిచేస్తామని డిమాండ్ చేశారు. అయితే అది విస్తృత స్థాయిలో ప్రజా పోరుగా మారలేదు. కాబట్టి ఆ సంఘటన ఉద్యమ స్వరూపాన్ని అందుకోలేదు.

1923లో మొదటిసారి మన దేశంలో 'మే డే'ను పాటించారు. 1920లో ట్రేడ్ యూనియన్ ఏర్పడటం మూలంగా అప్పటినుంచే కార్మికవర్గంలో చైతన్యం పెరగడం మొదలైంది. అప్పటినుండి 'మే డే'ను పాటిస్తున్నారు. కానీ అసంఘటిత కార్మికవర్గం అన్ని రంగాల్లో వచ్చింది. 1985 తర్వాత చోటుచేసుకున్న ప్రైవేటైజేషన్, లిబరలైజేషన్, గ్లోబలైజేషన్ పరిణామాల వల్ల అసంఘటిత కార్మికవర్గాల కార్మిక చట్టాలు అమలుకు నోచుకోవడం లేదు.ముఖ్యంగా ఐ.టి.రంగంలో ఎంతోమంది ఆడపిల్లలు, యువకులు పనిచేస్తున్నారు. మార్కెట్ శక్తులు ఎక్కడ శ్రమను దోచుకునే అవకాశం వుంటే అక్కడ కంపెనీలు పెడుతున్నాయి. ఈ నేపథ్యంలో నిరుద్యోగాన్ని, బలహీనతలను ఆసరా చేసుకొని వాళ్ళచే 10, 12 గంటలు పనిచేయిస్తున్నారు. 1886లో ఆరంభమైన ఈ ఉద్యమం నేటికీ కార్మిక కర్తవ్యాల్ని తెలియజేస్తోంది. మార్కెట్ శక్తుల శ్రమ దోపిడీపై నిలదీయాల్సిన సమన్నం ఆసన్నమైంది. ఈ నేపథ్యంలో ఆనాటి కార్మికవర్గ చైతన్యం మరోసారి వెల్లివిరియాలి. ఈరోజు మే డే మనందరిలో కొత్త స్ఫూర్తిని రగిలించాలి. ప్రపంచీకరణ, సామ్రాజ్యవాదం, పెట్టుబడిదారులు, బహుళజాతి కంపెనీలు మొదలైన పీడక వర్గాలు శ్రామిక దోపిడీకి, కార్మిక చట్టాల ఉల్లంఘనకు సంఘటితమవుతున్న తరుణంలోనే ప్రపంచ కార్మికవర్గం ఆ శక్తులను ప్రతిఘటించేందుకు ద్విగుణీకృత ఉత్సాహంతో పోరాడాలి. అందుకు కార్మిక శ్రేణులు ఏకం కావాలి. ఈ మేడే మనకు కొత్త స్ఫూర్తినిస్తుందని ఆశిద్దాం.

# ఎడారిగా మారుతున్న పాకిస్తాన్

లాహోర్, ఏప్రిల్ 30, (న్యూస్ పల్స్) పహల్గామ్‌లో ఉగ్రవాద దాడి తర్వాత, భారతదేశం సింధు జల ఒప్పందం నుంచి దూరంగా ఉంది. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి, భారతదేశం, పాకిస్తాన్ మధ్య మూడు యుద్ధాలు జరిగాయి. కానీ సింధు జల ఒప్పందం కొనసాగింది. కానీ ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్ తన కార్యకలాపాలను మానుకోలేదు. ఇప్పుడు భారతదేశం ఒప్పందం నుంచి దూరంగా ఉండటంతో, పాకిస్తాన్ తన సాధారణ బెదిరింపులకు దిగింది. భారతదేశం ఈ చర్యను యుద్ధానికి నాందిగా చూస్తామని పాకిస్తాన్ తెలిపింది. కానీ పాకిస్తాన్ ప్రభుత్వం మాత్రమే భయపడుతున్నట్లు కాదు. పాకిస్తాన్ ప్రజలు కూడా భయంతో ఉన్నారుపాకిస్తాన్ రైతు హోమ్లా ఠాకూర్ వార్తా సంస్థ రాయిటర్స్‌తో మాట్లాడుతూ, తన పంటల భవిష్యత్తు గురించి ఆందోళన వ్యక్తం చేశారు. నది నీటి మట్టం గణనీయంగా తగ్గిందని ఆయన అన్నారు. కూరగాయలు ఎండిపోతున్నాయి. భారతదేశం నీటిని ఆపివేస్తే, దేశం మొత్తం థార్ ఎడారిగా మారుతుందని ఆ రైతు అన్నారు. మేము ఆకలితో చనిపోతాము అని అన్నారు.పాకిస్తాన్ ప్రభుత్వ ప్రతిస్పందనపై జఐ ఆర్థికవేత్త, కన్సల్టింగ్ సంస్థ ఆక్స్‌ఫర్డ్ పాలసీ మేనేజ్‌మెంట్‌లో బృంద నాయకుడు వకార్ అహ్మద్ మాట్లాడుతూ, భారతదేశం ఒప్పందం నుంచి వైదొలగడం వల్ల కలిగే ముప్పును పాకిస్తాన్ తక్కువగా అంచనా వేసిందని అన్నారు. సింధు నది నుంచి ఒక్క చుక్క నీరు కూడా పాకిస్తాన్‌కు చేరకుండా చూస్తామని కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్ చెప్పారు. పేరు వెల్లడించడానికి ఇష్టపడని ఒక అధికారి మాట్లాడుతూ, భారతదేశం కొన్ని నెలల్లో కాలువలను ఉపయోగించి తన పొలాలకు నీటిని మళ్లిస్తుందని చెప్పారు. అయితే, జలవిద్యుత్ ఆనకట్టల ప్రాజెక్టు పూర్తి కావడానికి 4 నుంచి 7 సంవత్సరాలు పడుతుంది.పాకిస్తాన్ నీటిని నిలిపివేయడం వల్ల వ్యవసాయం మాత్రమే ప్రభావితం కాదు. బదులుగా, నీటి కొరత విద్యుత్ ఉత్పత్తిని కూడా ప్రభావితం చేస్తుంది. ఆర్థిక వ్యవస్థకు పెద్ద దెబ్బ అవుతుంది. "ప్రస్తుతానికి మాకు వేరే మార్గం లేదు" అని కరాచీ పరిశోధన సంస్థ పాకిస్తాన్ వ్యవసాయ పరిశోధనకు చెందిన గష్రిబ్ షౌకత్ అన్నారు.

# సింహాద్రి అప్పన్న చందనోత్సవంలో అపశ్రుతి

# గోడకూలి ఎనిమిది మంది భక్తులు మృతి








సింహాచలం:విశాఖ జిల్లా సింహాద్రి అప్పన్న స్వామి చందనోత్సవంలో అపశ్రుతి చోటుచేసుకుంది. స్వామివారి నిజరూపాన్ని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులపై గోడ కూలడంతో ఎనిమిది మంది మృతి చెందారు. పలువురు గాయపడ్డారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత సింహాచలంలో భారీ వర్షం కురిసింది. దీంతో సింహగిరి బస్టాండ్ నుంచి ఎగువకు వెళ్లే మార్గంలో షాపింగ్ కాంప్లెక్స్ వద్ద రూ.300 టికెట్ క్యూలైన్‌పై సిమెంట్ గోడ కూలింది. దీంతో శిథిలాల కింద పలువురు చిక్కుకున్నారు. వెంటనే ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది, అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. హోంమంత్రి వంగలపూడి అనిత, విశాఖ జిల్లా కలెక్టర్ హరేంద్ర ప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చీ ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. ఆరు మృతదేహాలను విశాఖ కేజీహెచ్ ఆసుపత్రికి తరలించారు. మరో రెండు మృతదేహాలను శిథిలాల కింద గుర్తించారు.

## సింహాచలం దుర్ఘటన దురదృష్టకరం

అమరావతి సింహాచలంలో గోడ కూలడం మూలంగా క్యూ లైన్ లో ఉన్న ఎనిమిది మంది భక్తులు మృతి చెందారని తెలిసి తీవ్రగ్భ్రాంతికి లోనయ్యానని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. చందనోత్సవ సమయాన ఈ దుర్ఘటన చోటు చేసుకోవడం దురదృష్టకరం. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియచేస్తున్నాను. వారికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుంది. విశాఖపట్నం జిల్లా అధికారుల నుంచి ఈ ఘటన వివరాలు తెలుసుకున్నాను. భారీ వర్షాల మూలంగా గోడ కూలిందని తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించానని వెల్లడించారు.

## సింహాచలం ఘటనలో ఐటీ ఉద్యోగులైన దంపతుల దుర్మరణం

### మృతులు మధురవాడ చంద్రంపాలెం వాసులు

### హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో పనిచేస్తూ వర్క్ ఫ్రమ్ హోం

### మూడేళ్ల క్రితం వివాహం



సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ పరిసరాల్లో ఈ తెల్లవారుజామున జరిగిన గోడ కూలిన దుర్ఘటనలో విశాఖపట్నానికి చెందిన దంపతులు ప్రాణాలు కోల్పోయారు. ఈ విషాద ఘటన స్థానికంగా తీవ్ర విచారాన్ని నింపింది. మృతులను విశాఖపట్నం మధురవాడ సమీపంలోని చంద్రంపాలెం గ్రామానికి చెందిన పిల్లా ఉమామహేశ్వరరావు (30), ఆయన భార్య శైలజ (26)గా అధికారులు గుర్తించారు.అధికారులు అందించిన వివరాల ప్రకారం, ఉమామహేశ్వరరావు, శైలజ ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా హైదరాబాద్‌లోని వేర్వేరు సంస్థల్లో పనిచేస్తున్నారు. ప్రస్తుతం ఇద్దరూ ఇంటి నుంచే (వర్క్ ఫ్రమ్ హోం) విధులు నిర్వర్తిస్తున్నారు. వీరికి మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. స్వామివారి దర్శనం కోసం తెల్లవారుజామున 2 గంటల సమయంలో రూ. 300 ప్రత్యేక దర్శనం క్యూలైన్‌లో వీరు వేచి ఉన్నారు. అదే సమయంలో అక్కడున్న ఒక గోడ ఒక్కసారిగా కూలి వారిపై పడటంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందారు.

ఉమామహేశ్వరరావు, శైలజ దంపతులు ఎంతో అన్యోన్యంగా ఉండేవారని, అందరితో కలివిడిగా మెలిగేవారని స్థానికులు, బంధువులు చెబుతున్నారు. ఉన్నత చదువులు చదివి, మంచి ఉద్యోగాలు చేస్తూ స్థిరపడుతున్న సమయంలో ఇలా అర్ధాంతరంగా తనువు చాలించడం వారి కుటుంబ సభ్యులను, బంధుమిత్రులను తీవ్ర విషాదంలో ముంచెత్తింది. వారి స్వగ్రామమైన చంద్రంపాలెంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## బాధిత కుటుంబాలకు అండగా వుంటాం



తాడేపల్లి సింహాచలం లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద జరిగిన దుర్ఘటన నన్ను తీవ్ర ఆవేదనకు గురిచేసిందని మంత్రి నారా లోకేష్ అన్నారు. . ఈ ఘటనలో గాయపడిన వారికి విశాఖ కేజీ హెచ్ ఆసుపత్రిలో చికిత్స జరుగుతోంది. బాధితులకు మెరుగైన చికిత్స కోసం అవసరమైతే ప్రైవేటు ఆసుపత్రులకు తరలించాల్సిందిగా యంత్రాంగాన్ని ఆదేశించాం. పోలీసులు, ఎస్డీఆర్ ఎఫ్ బృందాలు సహాయ చర్యల్లో పాల్గొంటున్నాయి. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని అన్నారు..

## గోడ కూలి భక్తులు మృతి చెందడం విచారకరం: టీపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్




ఆంధ్ర ప్రదేశ్ లోని సింహాచలం ఆలయంలో గోడ కూలి భక్తులు మరణించడం బాధాకరం

ఘటనలో మరణించిన కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి

మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నా

క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్న

## ఘటన కలచివేసింది సీఎం చంద్రబాబు




అమరావతి శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి చందనోత్సవంలో గోడ కూలి ఏడుగురు భక్తులు మృతి చెందడం నన్ను కలచివేసిందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. భారీ వర్షాల కారణంగా గోడ కూలడంతో జరిగిన ఈ ఘటనలో మరణించిన వారి కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. అక్కడి పరిస్థితిపై జిల్లా కలెక్టర్, ఎస్పీలతో మాట్లాడాను.గాయపడిని వారికి చికిత్స అందించాలని ఆదేశించాను. ఎప్పటికప్పుడు పరిస్థిని సమీక్షిస్తున్నాని అన్నారు.

## సింహాచలం చందనోత్సవంలో భక్తుల మృతిపై మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్‌గ్భ్రాంతి



తాడేపల్లి విశాఖ జిల్లా సింహాద్రి అప్పన్న స్వామి చందనోత్సవంలో గోడ కుప్పకూలి భక్తులు మృతి చెందడంపై మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్‌గ్భ్రాంతి వ్యక్తం చేశారు. చందనోత్సవం సందర్భంగా రూ. 300 టికెట్ క్యూలైన్ పై గోడ కుప్పకూలి భక్తులు మృత్యువాత పడటంపై తీవ్రవిచారం వ్యక్తం చేశారు. స్వామివారి నిజరూప దర్శనానికి వచ్చిన భక్తులు ఇటువంటి దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమన్నారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ వారికి మెరుగైన వైద్యం అందించాలని, మరణించిన భక్తుల కుటుంబాలను ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

## అప్పన్న సన్నిధిలో విషాదం.. ఇబ్బంది లేకుండా దర్శనం



విశాఖపట్నం సింహాద్రి అప్పన్న చందనోత్సవంలో అపశృతి చోటుచేసున్న విషమయం తెలిసిందే. భారీ వర్షానికి రూ.300 క్యూలైన్ దగ్గర గోడ కూలి 8 మంది భక్తులు మృతి చెందారు. ఈ ఘటనపై స్పందించిన హోం మంత్రి అనిత, కలెక్టర్ హరేంధిర ప్రసాద్, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు సహాయక చర్యలు చేపట్టాయి. ప్రస్తుతం అక్కడ పరిస్థితి అదుపులోకి రావడంతో భక్తులు స్వామివారి దర్శనం చేసుకుంటున్నారు. అధికారులు దగ్గర ఉండి పర్యవేక్షిస్తున్నారు.

# ప్రతి 4 నెలలకు ఒక కమిషనర్...

# ఇదేం పాలనా... గ్రేటర్ హస్తవ్యస్తం

హైదరాబాద్, ఏప్రిల్ 30, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్?.దేశంలోనే పెద్ద కార్పొరేషన్లలో ఒకటి. వేలాది కోట్ల రూపాయల బడ్జెట్. కోటి మందికి పైగా జనాభా. అలాంటి కార్పొరేషన్ లో పథకాలు అమలు చేయాలన్నా?ప్రాజెక్టులు టేకప్ చేయాలన్నా..పనులు-ప్రాధాన్యతలు-అవసరాలన ం బట్టి చేపట్టాలన్నా వాటిపై ఉన్నతాధికారులకు సరైన అవగాహన ఉండాలి.16నెలల్లో నలుగురు కమిషనర్లు?ఇదీ మన జీహెచ్ఎంసీ పరిస్థితి అన్న టాక్ తెలంగాణ రాజకీయవర్గాల్లో విన్పిస్తోంది. హైదరాబాద్ నగరాభివృద్ధికి జీహెచ్ఎంసీ అనేది గుండెకాయ లాంటిది. అలాంటి జీహెచ్ఎంసీలో పట్టుమని 16నెలలు కూడా కాలేదు. అప్పుడే నలుగురు కమిషనర్లు మారారు. దీంతో నగరాభివృద్ధి కొంత కుంటుపడుతోందన్న టాక్ రాజకీయవర్గాల్లో విన్పిస్తోంది. ఎందుకంటే జీహెచ్ఎంసీ 625 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించిన భారీ లోకల్ బాడీ. చావు పుట్టుకల లెక్కల నుండి మొదలుకొని వేలాది కోట్ల రూపాయల ప్రాజెక్టుల టేకప్ వరకు అనేక పనులు సిటిజన్స్ కు చేసి పెట్టాల్సిన సంస్థ.ఇలాంటి ముఖ్యమైన గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పోస్ట్ అంటే అంత ఆషామాషి కాదు. ఉదయం పారిశుధ్యం నుండి మొదలుకొని రాత్రి స్ట్రీట్ లైట్స్ వరకు పనులన్నింటినీ చక్కబెట్టాలి. ఇలాంటి ముఖ్యమైన కార్పొరేషన్ లో అన్ని పనులను అధికారులతో సమన్వయంతో కలిసి ముందుకు తీసుకెళ్లాలి. ఒక్కమాటలో చెప్పాలంటే బల్దియా బాస్..ఆల్ ఇన్ వన్ అని చెప్పాలి.

అయితే జీహెచ్ఎంసీకి వస్తున్న అధికారులు ముచ్చటగా మూడు-నాలుగు నెలలు కాకముందే సీటు మారడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.2023 సాధారణ ఎన్నికల కంటే కొద్ది నెలల ముందే జీహెచ్ఎంసీకమిషనర్ గా వచ్చిన రోనాల్డ్ రోస్ ను ఎన్నికలు పూర్తైన తర్వాత ఏడు నెలల్లోనే కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మార్చింది. ఆ స్థానంలో ఆమ్రపాలి కాటానుగా నియమించింది. రెండు నెలలు ఇంచార్జిగా కొనసాగించి ఆ తర్వాత పూర్తిస్థాయిలో మరో రెండు నెలలు అవకాశం కల్పించింది.ఆమ్రపాలి కేవలం 4 నెలలు మాత్రమేజీహెచ్ఎంసీ కమిషనర్ గా పనిచేశారు. ఆ తర్వాత ఆమె ఏపీకి వెళ్లిపోవడంతో ఆమె స్థానంలో ఇలంబర్తిని గ్రేటర్ కమిషనర్ గా నియమించింది

ప్రభుత్వం. జీహెచ్ఎంసీలో రిపోర్టు చేసే కంటే ముందే జార్ఖండ్ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల కమిషన్ కేటాయించడంతో ఝార్ఖండ్ నుండే నెల రోజులపాటు గ్రేటర్ పరిస్థితిని చక్కబెట్టారు జీహెచ్ఎంసీ కమిషనర్ గా ఉన్న ఇలంబర్తి. 2024 నవంబర్ 14 నుండి పూర్తిస్థాయి బాధ్యతలు తీసుకున్న ఇలంబర్తి..కేవలం 5 నెలల్లోనే మళ్లీ ట్రాన్స్ ఫర్ అయ్యారు. ఇప్పుడు ఇలంబర్తి స్థానంలో ప్రభుత్వం ఆర్ వి కర్ణన్ నుజీహెచ్ఎంసీ నూతన బాస్ గా నియమించింది.జీహెచ్ఎంసీపై పట్టు సాధిస్తున్న తరుణంలో ఈ విధంగా 4నెలలకోసారి కమిషనర్లను మార్చడంతో పాలన గాడి తప్పుతుందన్న వాదనలు గ్రేటర్లో వినిపిస్తున్నాయి. మొదట్లో రోనాల్డ్ రోస్ జిహెచ్ఎంసిపై పట్టు సాధించి అనేక పనులను వేగంగా కంప్లీట్ చేసే తరుణంలోనే ఆయన ట్రాన్స్ ఫర్ కాగా?తాజాగా ఇలంబర్తి కూడా బదిలీ కావడం చూస్తుంటే బల్దియా పాలన ఏడాది కాలంగా మూడు అడుగులు ముందుకు రెండు అడుగులు వెనక్కి అన్న చందంగా తయారైందిఇటీవల కాలంలో జిహెచ్ఎంసిలోని అనేక అక్రమాలపై ఫోకస్ చేశారు ఇలంబర్తి. ఉన్నతాధికారులందరూ పనుల్లో ఉండేటట్లు ఆయా విభాగాల్లో ఉన్న లోపాలను గుర్తించి వేగంగా సిటిజన్స్ కు సేవలు అందేలా ఆదేశాలు జారీ చేశారు. ఒక్కొక్క విభాగంలోని లోపాలను గుర్తించి వాటిలో జరిగిన అక్రమాలపై విజిలెన్స్ విచారణలు కూడా చేయించారు. ఇంజనీరింగ్ విభాగంలో పలు సర్కిళ్లలో పనులు కాకుండానే బిల్లులు చెల్లించారన్న ఆరోపణలపై విచారణ జరిపించారు.అందులో కొన్ని అంశాల్లో అక్రమాలు జరిగినట్లు గుర్తించిన కమిషనర్..చర్యలకు ఉపక్రమించే తరుణంలోనే తాజాగా ట్రాన్స్ ఫర్ అయ్యారు. బర్త్ అండ్ డెత్..మలేరియా విభాగంలో కూడా విజిలెన్స్ ఎంక్వైరీ చేయించి ప్రాథమికంగా కొన్ని చర్యలు తీసుకున్నారు. ఇక పన్నుల వసూళ్లలోనూ..ఫిర్యాదులు అందడంతో వాటిని కూడా పరిష్కరించి వ్యవస్థను గాడిన పెట్టారు ఇలంబర్తి. అందువల్లే ఈ ఏడాది 2వేల,40 కోట్ల రూపాయల ఆస్తి పన్నును వసూలు చేసి రికార్డును క్రియేటర్ చేసింది జీహెచ్ ఎంసీ.రోనాల్డ్ రోస్, ఆమ్రపాలి?తాజాగా ఇలంబర్తి..జీహెచ్ ఎంసీ కమిషనర్లుగా పాలనపై ఫోకస్ పెట్టి తమదైన ముద్ర వేసే సమయంలోనే వారిని మార్చి వేస్తుండడం కారణంగా బల్దియా పాలన గాడిన పరిస్థితి లేకుండా పోయింది. అయితే ఇలా వరుసగా కమిషనర్లు మారడం వెనుక ప్రజాప్రతినిధుల హస్తం ఉందన్న చర్చ సాగుతోంది.

మరి ఇప్పటివరకు మారిన ముగ్గురు అధికారులు కూడా ముక్కుసూటిగా వ్యవహరిస్తారన్న పేరుంది. జీహెచ్ఎంసి మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలు, మంత్రులు?ఇలా ఎవరు చెప్పినా ఎన్ని ఒత్తిళ్లు చేసినా నిబంధనల ప్రకారమే వీరంతా నడుచుకున్నారు.మేయర్ కార్యాలయంలో పనిచేసే రిటైర్డ్ ఉద్యోగుల ఎక్స్ టెన్షన్ విషయంలోనూ?లిమిట్ కు మించి చేసిన బిల్లుల చెల్లింపుల్లోనూ కమిషనర్లందరూ చాలా స్ట్రిక్ట్ గా వ్యవహరించారని బల్దియాలో టాక్. ఇక ఉద్యోగుల ట్రాన్స్ ఫర్స్ విషయంలోనూ?నిబంధనలు పాటించని నిర్మాణాల ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల జారీ చేసే విషయంలోనూ నగర ప్రజా ప్రతినిధుల మాటలు భే ఖాతరు చేశారన్న వాదనలు ఉన్నాయి. మేయర్ కార్యాలయంతో పాటు ప్రజా ప్రతినిధుల విషయంలో కొనసాగిన గ్యాప్ వల్లే కమిషనర్లు మారుతున్నారా అనే అంశానికి బల్దియా ప్రధాన కార్యాలయంలో అవుననే సమాధానం వస్తుందన్న టాక్ విన్పిస్తోంది.అయితే త్వరలోనే జీహెచ్ఎంసీకి ఎన్నికలు జరగబోతున్నాయి. ఇలాంటి సమయంలో ముక్కుసూటిగా ఉండే ఇలంబర్తిని ట్రాన్స్ ఫర్ చేసి.. ఆర్వీ కర్ణన్ ను నూతన కమిషనర్ గా నియమించడం వెనుక ఏదో మర్మం ఉందనే చర్చ జోరుగా సాగుతోంది.

# మాజీ మంత్రిఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించిన ఆలయ ఛైర్మెన్



**సనత్ నగర్ ప్రజాబలం ప్రతినిధి:** వచ్చేనెల తేదీ: 02-05-2025 శుక్రవారం నుండి తేదీ: 04-05-2025 ఆదివారం వరకు జరిగే బల్కంపేట (ఎస్సార్ నగర్) లోని శ్రీ శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వార్ల 30వ వార్షిక బ్రహ్మోత్సవాలకు మాజీ మంత్రిఎమ్మెల్యే త్రలసాని శ్రీనివాస్ యాదవ్ కి బ్రహ్మోత్సవాలకు రావలసిందిగా ఆహ్వానించిన మాజీ కార్పొరేటర్ ఎన్. శేషు కుమారి తో కలిసి ఆలయ చైర్మన్ శ్రీ బొడ్డు కుమార్ గౌడ్, మరియు ప్రధాన అర్చకులు వేణుగోపాలచార్యులు, ఆహ్వాన పత్రికని అందించడం జరిగింది వారితోపాటు బీఆర్ఎస్ పార్టీ అమీర్ పేట్ డివిజన్ అధ్యక్షుడు ఎం.హనుమంతరావు, స్థానిక సంక్షేమ సంఘం నాయకులు అశోక్ యాదవ్, తాళ్ల శ్రీనివాస్ గౌడ్, బొడ్డుశ్రవణ్ కుమార్ గౌడ్, వనం శ్రీనివాస్, కూతురు నరసింహ, కట్ట బలరాం, తదితరులు పాల్గొన్నారు



# దోస్త్..కు అంతా సిద్ధం

హైదరాబాద్, ఏప్రిల్ 30, తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న డిగ్రీ కాలేజీల్లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి డిగ్రీ ఆన్లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) నోటిఫికేషన్ ఇంకా వెలువడలేదు. ఇంటర్ ఫలితాలు వచ్చి వారం రోజులు గడుస్తున్నా దోస్త్ షెడ్యూల్పై ఎలాంటి ప్రకటన వెలువడలేదు. దీంతో డిగ్రీ ప్రవేశాలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదలపై సందిగ్ధత నెలకొంది. సాధారణంగా ఇంటర్ ఫలితాలు వెలువడిన మరుసటి రోజే డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు దోస్త్ షెడ్యూల్ జారీ చేసేవారు. ఈసారి ఫలితాలు వచ్చి వారం రోజులైనా నోటిఫికేషన్ ఎప్పుడు వెలువడుతుందో ఉన్నత విద్యామండలి చెప్పలేకపోతుంది. ఈసారి రెండు విడతల్లోనే దోస్త్ ద్వారా ప్రవేశాలు నిర్వహించి జూన్ 16 నుంచి తొలి సెమిస్టర్ తరగతులను ప్రారంభించాలని ప్లాన్ చేసింది. ఇంకా దోస్త్ ప్రకటన వెలువడక పోవడంతో అకగమిక్ ఇయర్ ఆలస్యమయ్యే అవకాశం కనిపిస్తుందిఈసారి దోస్త్లో బకెట్ విధానాన్ని తొలగించాలని కొద్దిరోజుల క్రితం ఉన్నతవిద్యామండలి కార్యాలయంలో జరిగిన యూనివర్సిటీ వీసీ సమావేశంలో ఏకగ్రీవంగా నిర్ణయించారు. అయితే ఆ నిర్ణయం తీసుకునే అధికారం ఉన్నత విద్యామండలికి గానీ వీసీలకు గానీ లేదు. దీంతో విద్యాశాఖ కస్సున లేచింది. తమకు సమాచారం ఇవ్వకుండా, తమ ఆమోదం లేకుండా ఎలా నిర్ణయం తీసుకుంటారని ప్రశ్నించినట్లు సమాచారం. ఈ క్రమంలోనే పది రోజుల క్రితం వీసీలతో సమావేశం నిర్వహించినా.. ఆ సమావేశానికి సంబంధించి తీర్మానాల కాపీ (మినిట్స్) ఇంతవరకు అందలేదు. దాంతో ఉన్నత విద్యామండలి నోటిఫికేషన్ జారీలో జాప్యం నెలకొంది.ఆంధ్రప్రదేశ్ విద్యా హక్కు చట్టం కింద ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ షెడ్యూల్లో మార్పులు చేసినట్లు సమగ్రశిక్షా అభియాన్ ప్రాజెక్టు డైరెక్టర్ బి శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. మొదట ప్రకటించిన షెల్యూల్ ప్రకారం ఏప్రిల్ 28న నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కావాల్సి ఉండగా దానిని మే 2కు వాయిదా వేశామన్నారు. మే19 వరకు స్వీకరన ఉంటుందని వెల్లడించారు.

# ఎవ్వరిని గుర్తు పట్టని శ్రీ తేజ

హైదరాబాద్, ఏప్రిల్ 30, సంధ్య థియేటర్లో జరిగిన తొక్కిసలాటలో గాయపడిన శ్రీతేజ్ ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యాడు. పుష్ప 2 సినిమా ప్రిమియర్ షో టైంలో హైదరాబాద్లోని సంధ్య థియేటర్లో తొక్కిసలాట జరిగింది. ఈ దుర్ఘటనలో ఫ్యామిలీ సినిమా చూడటానికి వెళ్లిన శ్రీతేజ్ ఫ్యామిలీ ఇరుక్కుంది. అక్కడ జరిగిన తొక్కిసలాటలో తల్లి చనిపోయింది. తీవ్ర గాయాలు పాలైన శ్రీతేజ్ అప్పటి నుంచి చికిత్స పొందుతున్నాడు. తాజాగా డిశ్చార్జ్ అయ్యాడు. పుష్ప 2 సినిమా విడుదల సందర్భంగా డిసెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా ప్రీమియర్ షోలు వేశారు. దిల్సుఖ్నగర్కు చెందిన భాస్కర్, తన భార్య రేవతి, కుమారుడు శ్రీతేజ్ సంధ్య థియేటర్కు వెళ్లారు. భారీగా జనం రావడం, అదే టైంలో పుష్ప 2 హీరో అల్లు అర్జున్ ఫ్యామిలీతో కలిసి అదే థియేటర్కు వచ్చాడు. ఈ క్రమంలో తొక్కిసలాట జరిగింది. థియేటర్లో జరిగిన తొక్కిసలాటలో భాస్కర్ భార్య రేవతి, కుమారుడు శ్రీతే చిక్కుకున్నారు. ఈ దుర్ఘటనలో రేవతి స్పాట్లోనే ప్రాణాలు కోల్పోగా... కొనఊపిరితో ఉన్న శ్రీతేజ్ను ఆసుపత్రిలో చేర్పించారు. తీవ్ర గాయాలు పాలైన శ్రీతేజ్ను సికింద్రాబాద్ కిమ్స్లో చికిత్స అందించారు. అప్పటి నుంచి వైద్యుల పర్యవేక్షణలో ఉన్న శ్రీతేజ్ చావు అంచు నుంచి సురక్షితంగా బయటపడ్డాడు. ఇప్పుడు ఆరోగ్యం నిలకడగా ఉండటంతో బాలుడిని వైద్యులు డిశ్చార్జ్ చేశారు. శ్రీతేజ్ను ఇంకా కొన్ని సమస్యలు వెంటాడుతున్నాయని వైద్యులు చెబుతున్నారు. అందుకే ఆసుపత్రి నుంచి రిహాబిలిటేషన్ సెంటర్కు తరలించారు. అక్కడ పదిహేను రోజులు చికిత్స అందిస్తారు. అంటే ఫిజియోథెరపీ చేస్తారు. అనంతరం ఇంటికి పంపిస్తారు.తేజ్ కిమ్స్ లో మొత్తం 4 నెలల 25 రోజులు చికిత్స పొందాడు. దాదాపు 15 రోజుల క్రితం ఇంటెన్సివ్ కేర్ యూనిట్ నుండి తేజ్ ను జనరల్ వార్డుకు తరలించారు. శ్రీతేజ్ పరిస్థితి ఇప్పుడు స్థిరంగా ఉందని, ఇన్ ఫెక్షన్లు లేవని వైద్యులు నిర్ధారించారు. అయితే, ఫిజియోథెరపీ, పునరావాస కేంద్రంలో నిరంతర సంరక్షణను సూచించారు. దాదాపు 15 రోజుల పాటు ఫిజియోథెరపీ పొందిన తర్వాత ఇంటికి తీసుకెళ్లచని పేర్కొన్నారు.శ్రీతేజ్ ప్రస్తుత పరిస్థితి పై ఆయన తండ్రి భాస్కర్ మాట్లాడారు. “తేజ్ కళ్ళు తెరిచాడు. మేము అతనికి ఫీడింగ్ ట్యూబ్ ద్వారా ద్రవ పోషకాహారం అందిస్తున్నాము. అయితే, అతని మెదడు ఇంకా పూర్తిగా కోలుకోలేదు. అతను మనలో ఎవరినీ గుర్తించలేకపోతున్నాడు. ఎక్కువ కాలం ఆసుపత్రిలో ఉండటంతో ఇన్ఫెక్షన్ ప్రమాదం పెరుగుతుందని, పునరావాసం కోలుకోవడానికి సహాయపడుతుందని వైద్యులు సూచించారు. శ్రీతేజ్కు జీవితాంతం సంరక్షణ అవసరం” అని భాస్కర్ చెప్పారు.. అయితే తన బిడ్డ ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడని కానీ తమను ఇంకా గుర్తు పట్టడం లేదని అంటున్నారు. తన చెల్లి ఆసుపత్రికి వచ్చి మాట్లాడుతున్నా శ్రీతేజ్ స్పందించడం లేదని వాపోయారు. ఇంకా ఆసుపత్రిలో ఉంటే కొన్ని ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఉందని వైద్యులు చెప్పారని తెలిపారు. ఫుడ్ తీసుకుంటున్నాడని అందుకే కంగారు పడాల్సిన పని లేదని వైద్యులు చెప్పినట్టు తెలిపారు. ఇప్పటి వరకు ఆసుపత్రి వర్గాలు తమకు డబ్బులు గురించి అడగలేదని డిశ్చార్జ్ టైంలో కూడా ఎలాంటి ఒత్తిడి చేయలేదని అన్నారు

# మైండ్ గేమ్ లో మావోయిస్టులు

వరంగల్ , ఏప్రిల్ 30, బచావో కర్రెగుట్టల పేరుతో.. భద్రతా బలగాలు దూసుకెళ్లాయి. దాదాపు ఏడు రోజులుగా జల్లెడ పడుతున్నాయి. భారీ సంఖ్యలో మావోయిస్టులు ఉన్నారనే సమాచారంతో సాయుధ బలగాలు ముందుకెళ్లినా.. ఫలితం లేదనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. అయితే.. మావోయిస్టులు కావాలనే భద్రతా బలగాలను కర్రెగుట్టల వైపు రప్పించారా.. బలగాల దృష్టి మరల్చి మరో ప్రాంతానికి వెళ్లారా అనే చర్చ జరుగుతోంది. మావోయిస్టులు మరేదో వ్యూహం పన్నారనే చర్చ నడుస్తోంది.రెండు వారాల కిందట మావోయిస్టులు ఓ లేఖను విడుదల చేశారు. తమ రక్షణ కోసం కర్రెగుట్టల్లో బాంబులు అమర్చామని.. ఆదివాసీలు ఇటువైపు రావొద్దని హెచ్చరించారు. ఆ లేఖ కాస్త చర్చనీయాంశంగా మారింది. అయితే.. రాజ్యానికి బలం ఎక్కువ అని తెలిసి.. తాము ఉన్నచోటును మావోయిస్టులు ఎందుకు చెప్తారనే ప్రశ్న ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఆ లేఖ ద్వారా బలగాలను ఇటువైపు రప్పించి.. మావోలు మరో ప్రాంతానికి వెళ్లారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.కర్రెగుట్టల్లో బాంబులు అమర్చినట్టు మావోయిస్టులు ప్రకటన చేసి.. అగ్రనేతలను సేఫ్ ప్లేస్కు తరలించినట్టు ప్రచారం జరుగుతోంది. వ్యూహాత్మకంగానే మావోలు ఈ ప్రకటన చేశారని.. తెలుస్తోంది. ఇతర రాష్ట్రాల్లోని అడవుల్లో కూంబింగ్ చేస్తున్న బలగాలు కూడా ఇక్కడికి రావడంతో.. మావోయిస్టులు వేరే ప్రాంతానికి సులభంగా వెళ్లి ఉంటారనే చర్చ జరుగుతోంది. దీనిపైనా బలగాలు ఆలోచిస్తున్నట్టు సమాచారం.నిజంగా మావోయిస్టులు కర్రెగుట్టల్లో ఉంటే.. బలగాలు డ్రోన్లు, హెలికాప్టర్ల ద్వారా ఆ ప్రాంతాన్ని నిశితంగా పరిశీలించాయి. కానీ.. ఆశించిన స్థాయిలో మావోల కదలికలు గుర్తించలేదు. అంటే అసలు కర్రెగుట్టల్లో వారు లేరనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. ఒకవేళ ఉంటే.. ఇన్నిరోజులు కూంబింగ్ జరుగుతున్నా.. వేలాది మంది జవాన్లు జల్లెడ పడుతున్నా.. ఎవ్వరూ ఎందుకు కనిపించరనే ప్రశ్న.. హాట్ టాపిక్గా మారింది.వాస్తవానికి కర్రెగుట్టలు చాలా ఎత్తులో ఉంటాయి. ఒకవేళ నిజంగా మావోయిస్టులు ఆ గుట్టలపై ఉన్నారనుకున్నా.. వారికే అనుకూల పరిస్థితులు ఉంటాయి. బలగాలు కింది నుంచి గుట్టలపైకి ఎక్కాలి. ఈ క్రమంలో కాల్పులు జరిగితే.. ఇరువైలా భారీగా ప్రాణ నష్టం ఉండేది.. అని గతంలో ఆ ప్రాంతంలో పనిచేసిన ఓ రిటైర్డ్ పోలీస్ అధికారి వెల్లడించారు. ఇప్పటికే మావోయిస్టులు ఎత్తైన ప్రాంతంలో ఉంటే.. పైనుంచి కాల్పులు జరపడం ఈజీ అని ఆయన అభిప్రాయపడ్డారు.ప్రస్తుతం ఎండలు మండుతున్నాయి. కర్రెగుట్టల ప్రాంతంలో వడగాలులు బలంగా వీస్తున్నాయి. ఇలాంటి సమయంలో కూంబింగ్ సజావుగా సాగడం లేదని తెలుస్తోంది. ఇప్పటికే చాలామంది జవాన్లు వడదెబ్బకు గురయ్యారు అనే వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో బలగాలు ప్లాన్ మార్చుకున్నట్టు తెలుస్తోంది. ఇలా కూంబింగ్, దాడులు కాకుండా.. బేస్ క్యాంపులు ఏర్పాటు చేస్తే మంచిదనే అభిప్రాయానికి వచ్చినట్టు తెలుస్తోంది.

## ధరణి దరఖాస్లులు..భూ భారతిలో పెట్టుకోవాలి

నల్గొండ, ఏప్రిల్ 30, (న్యూస్ పల్స్) రాష్ట్రంలోని భూములకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం భూ భారతి పోర్టల్ను తీసుకొచ్చిన విషయం తెలిసిందే. దీంతో భూ సమస్యలపై ధరణిలో చేసుకున్న అప్లికేషన్లను రిజెక్ట్ అవుతున్నాయి. భూ భారతి పోర్టల్ అందుబాటులోకి రావడం, అలాగే, కొత్త ఆర్వోఆర్ చట్టం అమల్లోకి రావడంతో పాత దరఖాస్తులు తిరస్కరణకు గురవుతున్నాయి.దరఖాస్తుదారులు భూ భారతి పోర్టల్లోనే మళ్లీ అప్లికేషన్ పెట్టుకోవాలని అధికారులు అంటున్నారు. త్వరలోనే తెలంగాణ వ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని, అందులోనూ మాన్యువల్గా దరఖాస్తులు చేసుకోవచ్చని అన్నారు. తెలంగాణలో భూ భారతి పోర్టల్ను తీసుకొచ్చే సమయానికి ధరణిలో 81,000కుపైగా దరఖాస్తులు పెండింగ్లో ఉన్నాయి.ధరణిలోని పెండింగ్ దరఖాస్తులను భూ భారతి పోర్టల్కు బదిలీ చేశారు. భూ భారతి చట్టం తీసుకురావడంతో పాటు తహసీల్దార్, అడిషనల్ కలెక్టర్, ఆర్డీవో, కలెక్టర్ స్థాయుల్లో అధికారాలను వికేంద్రీకరించడంతో చిన్నపాటి సమస్యలను తహసీల్దార్, ఆర్డీవో స్థాయిలోనే పరిష్కారం అవుతాయి.దీంతో ధరణిలోని పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్లను సర్కారు ఆదేశించింది. అయినప్పటికీ అధికారులు కారణాలు చెప్పకుండానే పాత దరఖాస్తులను తిరస్కరిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో రిపోర్టు సైతం పెట్టకుండానే తిరస్కరిస్తున్నట్లు తెలుస్తోంది.గతంలో పరిష్కారం కాని తమ భూ సమస్యలు ఇప్పుడైనా పరిష్కారం అవుతాయని చాలామంది రైతులు ఇప్పుడు దరఖాస్తులు చేసుకుంటున్నారు. పెట్టుకుంటున్నారు. భూ భారతి పోర్టల్లో దరఖాస్తు చేసుకున్న ప్రతి దరఖాస్తును భూ భారతి చట్టంలోని నిబంధనల కిందే పరిష్కరించాల్సి ఉంది. ఏ దరఖాస్తును తిరస్కరించినా సరైన కారణం చెప్పాలి

## 117 సవర్ల బంగారం దోచేసిన దుండగులు

## చీరాల, పువ్వాడవారి వీధిలో భారీ చోరీ

చీరాల పువ్వాడ వీధిలో వుంటున్న మువ్వల శివప్రసాదరావు,భార్య పద్మావతి లు మంగళవారం రాత్రి హాస్పిటల్ కు వెళ్ళి తిరిగి వచ్చేలోపు ఇంటిని దొంగలు దోచేశారు. ఆ దంపతులు ఇంటికి తిరిగి రాగానే చోరీ జరిగిందని గుర్తించారు. కప్ బోర్డ్ లోని 117 సవర్ల బంగారం,1,60,000 నగదు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నట్లు వన్టౌన్ సీఐ సుబ్బారావు బుధవారం చెప్పారు.

## మెడికేర్ సెలెక్ట్ పాలసీ విడుదల

హైదరాబాద్ టాటా ఏఐజీ జనరల్ ఇన్సూరెన్స్. కొత్త రిటైల్ ఆరోగ్య బీమా పాలసీ ‘మెడికేర్ సెలెక్ట్’ను విడుదల చేసింది. రిటైల్ హెల్త్ పోర్టుఫోలియోతో పాటు బీమా వ్యాపారాన్ని మరింత పటిష్ఠం చేసుకునే లక్ష్యంతో ఈ పాలసీని తీసుకువచ్చినట్లు టాటా ఏఐజీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ ప్రతీక్ గుప్తా తెలిపారు. ఎలాంటి ఎంట్రీ వయసు లేకుండా, అందుబాటు ధరల్లో ఉండే ప్రీమియంతో ఈ సమగ్ర ఆరోగ్య బీమా పాలసీని రూపొందించినట్లు ఆయన చెప్పారు. ఎలాంటి వయోపరిమితులు లేకుండా ఈ పాలసీని అందరికీ ఆఫర్ చేస్తున్నట్లు గుప్తా పేర్కొన్నారు. టాటా ఏఐజీకి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కీలక మార్కెట్లుగా ఉన్నాయని, గత ఏడాది కాలంలో కంపెనీ రిటైల్ హెల్త్ విభాగం ఇక్కడ మూడింతల వృద్ధిని నమోదు చేసిందని ఆయన చెప్పారు. తెలుగు రాష్ట్రాల్లో 1,600కు పైగా హాస్పిటల్స్ నెట్వర్క్తో పాటు 14,000 మంది అడ్వైజర్లను టాటా ఏఐజీ కలిగి ఉందన్నారు.హైదరాబాద్, వరంగల్,

## హోటల్లో ఘోర అగ్నిప్రమాదం,

## 14 మంది మృతి



కోల్కొత్తలో ఘోర అగ్నిప్రమాదం జరిగింది. మంగళవారం రాత్రి సెంట్రల్ కోల్కతాలోని ఒక హోటల్లో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో 14 మంది మృతి చెందారని పలువురు తీవ్రంగా గాయపడ్డారని నగర పోలీస్ కమిషనర్ మనోజ్ కుమార్ వర్మ వెల్లడించారు.చికిత్స కోసం క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించామని చెప్పారు. ఈ ఘటనపై సమాచారం అందగానే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకు వచ్చారన్నారు. అలాగే సహాయక చర్యలు సైతం వారు చేపట్టారని వివరించారు. హోటల్లో చిక్కుకున్న పలువురిని వారు రక్షించారని తెలిపారు. అయితే ఈ ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదన్నారు. ఈ అగ్ని ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని పేర్కొన్నారు. అందుకోసం ఓ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు.

# కమలం, గులాబీ కలిసి పనిచేస్తాయా

# మరిన్ని ఆయుధాలు ఇచ్చిన కేసీఆర్




వరంగల్, ఏప్రిల్ 30, బీఆర్ఎస్ ఆవిర్భవించి 25 ఏండ్లయిన సందర్భంగా హన్మకొండ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించిన భారీ బహిరంగ సభ జనసమూహంగా విజయవంతమయినా, వేదిక నుండి పార్టీ శ్రేణులకు సరైన సందేశం ఇవ్వకుండా దశ దిశ లేని సభగా ముగిసింది. సభలో ఏకైక వక్త అయిన పార్టీ చీఫ్ కేసీఆర్ నుండి రావాల్సిన పంచ్‌లు రాలేదు. ఆయన హావభావాల్లో కూడా మునుపటి వేడి కనిపించలేదు. ఇటు కాంగ్రెస్, అటు బీజేపీపై సమాన స్థాయిలో విమర్శల వాన కురిపిస్తారని భావించినా తేడా కనిపించింది. పార్టీ నేతలకు, కార్యకర్తలకు ఎజెండా నిర్ణయిస్తారనుకున్నా బీఆర్ఎస్‌లో ఆ ఉత్సాహం ఎక్కడా కనిపించ లేదు.ఎల్కతుర్తి సమావేశం కోసం బీఆర్ఎస్ శ్రేణులు రాష్ట్ర వ్యాప్తంగా గ్రామగ్రామల నుండి ఎంతో ఉత్సాహంగా తరలి వచ్చారనడంలో ఎలాంటి సందేహాలు లేవు. పెద్దఎత్తున జనప్రవాహం ఉన్నా సభ వేదికపై కేసీఆర్‌లో తడబాటు కనిపించింది. సభకు వచ్చిన జనాలను చూస్తుంటే ఏడాదిన్నర కాంగ్రెస్‌పై ప్రజల ఆగ్రహం కనిపిస్తుందని ఆయన చేసిన వ్యాఖ్యల్లో కొత్తదనం ఏమీ లేదు. కేసీఆర్ సభలకు పెద్ద ఎత్తున జనాలు రావడం కొత్తేమీ కాదు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల సమయంలో కూడా బీఆర్ఎస్ సభలకు భారీగా ప్రజలొచ్చినా ప్రతికూల ఫలితాలు వచ్చాయనేది మరవకూడదు. జనాలు రావడం ఒకెత్తయితే, దాన్ని అనుకూలంగా మల్చుకోవడం మరో ఎత్తు.రాష్ట్రంలో పదిహేను నెలల కాంగ్రెస్ పాలనపై ప్రజా వ్యతిరేకత ఏర్పడిందని కేసీఆర్‌తో పాటు బీఆర్ఎస్ శ్రేణులు కూడా భావిస్తున్నా, ఆ వ్యతిరేకత బీఆర్ఎస్‌కు సానుకూలంగా మారుతుందా అనే దానిపై అంచనాలు తప్పే అవకాశాలున్నాయి. అసెంబ్లీ ఎన్నికల అనంతరం లోక్‌సభ ఎన్నికల్లో, ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఉనికే లేకుండా ఆ స్థానాన్ని బీజేపీ భర్తీ చేస్తుందని ఫలితాలే నిరూపిస్తున్నాయి.బీఆర్ఎస్‌కు ఒక వైపు కాంగ్రెస్ నుండి మరో వైపు బీజేపీ నుండి గట్టి సవాళ్లు ఎదురవుతున్నాయి. ఈ దశలో ఎల్కతుర్తి సభలో కాంగ్రెస్‌ను పెద్ద ఎత్తున విమర్శించిన కేసీఆర్ బీజేపీపై కేవలం రెండే నిమిషాలు మాట్లాడడం ఆశ్చర్యకరం. బీఆర్ఎస్‌కు బీజేపీ నుంచి కూడా గట్టి పోటీ ఎదురవుతున్నా ఆయన ఆ పార్టీని అంతగా పట్టించుకోకపోవడంతో పలు సందేహాలకు తావిస్తున్నాయి.బీజేపీ, బీఆర్ఎస్ ఒకటే అని ఇప్పటికే విమర్శిస్తున్న వారికి కేసీఆర్ తీరు మరిన్ని ఆయుధాలు అందించినట్టు ఉంది. పదకొండేళ్ల బీజేపీ పాలనలో తెలంగాణకు పదకొండు రూపాయలు కూడా ఇవ్వలేదని విమర్శించిన కేసీఆర్ బీజేపీని ఎందుకు తీవ్రంగా తూర్పారపట్టలేదు..? ఈ పదకొండేళ్లలో కేసీఆర్ పదేళ్ల పాలనలో పలుమార్లు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి కీలకాంశాల్లో బేషరుతగా మద్దతిచ్చారనేది వాస్తవం.పలుమార్లు బీజేపీ చేతిలో భంగపడ్డ కేసీఆర్ బహిరంగ సభలో కఠినంగా ఎందుకు వ్యవహరించలేదు. మావోయిస్టుల ఏరివేతలో భాగంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేపట్టిన కగార్ ఆపరేషన్ అంశాన్ని మాత్రమే సభలో ప్రస్తావించిన కేసీఆర్ వక్ఫ్ సవరణ చట్టంపై నోరు మెదపలేదు. కగార్ ఆపరేషన్ కూడా వామపక్షభావ సానుభూతిపరులను ఆకట్టుకోవడంలో భాగంగానే ప్రస్తావించారు. మొత్తం మీద బీజేపీపై కేసీఆర్ మెతకవైఖరి చూస్తుంటే రాజకీయాల్లో ఏమైనా జరగవచ్చనేది మరోసారి నిజం కావచ్చు.తెలంగాణ అస్తిత్వానికి బీఆర్ఎసే మారు పేరని చెప్పుకునే కేసీఆర్ దీనికి సంబంధించి సభల్లో కీలకాంశాలను ప్రస్తావించలేదు. తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమాలకు సంబంధించి పాత విషయాలను కేసీఆర్ మళ్లీ వల్లె వేశారు. రాష్ట్రం ఆవిర్భావం తర్వాత రెండు పర్యాయాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ మళ్లీ ఉద్యమాల విషయాలను ప్రస్తావిస్తే ప్రజల్లో సానుకూలత వచ్చే అవకాశాలు తక్కువే.రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చాక తెలంగాణ అస్తిత్వానికి సంబంధించి పరిణామాలు సంభవించినా కేసీఆర్ సభలో వాటి ప్రస్తావనే తేలేదు. సభలో 'జననీ జన్మభూమిశ్చ' అని కేసీఆర్ చెప్పినా తెలంగాణ తల్లి విగ్రహం మార్చడంపై, తెలంగాణ గేయంపై ఆయన సభాముఖంగా స్పందిస్తారని పార్టీ శ్రేణులు ఆశించినా నిరుత్సాహమే ఎదురైంది.కృష్ణా జలాలపై పక్క రాష్ట్రం ఏపీతో ఉన్న వివాదాలపై కేటీఆర్, హరీశ్‌రావు పలు మార్లు విమర్శలు చేసినా కేసీఆర్ నామమాత్రంగానే ప్రస్తావించారు. జలాలపై పూర్తి అవగాహన ఉన్న కేసీఆర్ కృష్ణా జలాలపై లోతుగా ప్రసంగిస్తారని ఆశించినా అలా జరగలేదు.రజతోత్సవ సభ కాబట్టి ఉద్యమ పార్టీ అయిన టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌ను ఎందుకు మార్చాల్సి వచ్చిందో కేసీఆర్ ప్రస్తావించాల్సింది. 'అబ్ కీ బార్ కిసాన్ సర్కార్' నినాదంతో జాతీయ రాజకీయాల్లో సత్తా చాటాలని తలచి భంగపడిన కేసీఆర్ జాతీయ నేతలకు కూడా దూరమయ్యారని ఈ సభ నిరూపించింది. గతంలో జాతీయ నాయకులను పలు సభలకు ఆహ్వానించిన కేసీఆర్ పార్టీ రజతోత్సవ సభకు ఏ జాతీయ నాయకుడిని పిలవకపోడమే నిదర్శనం.కాంగ్రెస్ సర్కార్ బీఆర్ఎస్ నేతలపై పలు కేసులు చేయడంతో పాటు, కాళేశ్వరం, విద్యుత్ కొనుగోళ్లపై ఎంక్వైరీ కమిషన్లు వేసింది. ఈ కేసులను కేసీఆర్ సభలో తిప్పి కొడుతారనుకున్నా ప్రస్తావించలేదు. తనను బీజేపీ ప్రభుత్వం అన్యాయంగా లిక్కర్ స్కాంలో ఇరికించిందని కవిత పలు మార్లు చెప్పినా కేసీఆర్ సభలో దాన్ని ఊసే ఎత్తలేదు.కాంగ్రెస్ అధికారం చేపట్టాక కులగణన, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ వంటి కీలక పరిణామాలు జరిగిన కేసీఆర్ సభలో వాటిపై ఎలాంటి ప్రస్తావన తేలేదు. కులగణన లెక్కలు తప్పంటూ హరీశ్‌రావు, కేటీఆర్ పెద్దఎత్తున విమర్శిస్తున్న తరుణంలో పార్టీ పెద్దగా స్పందించాల్సిన కేసీఆర్ దీన్ని విస్మయించారు. గతంలో తాము అమలు చేసిన పథకాల గురించి చెప్పిన కేసీఆర్ అదే సందర్భంలో కాంగ్రెస్ పార్టీ విఫలమైన అంశాలను గణాంకాలతో ప్రస్తావించి ఉంటే పార్టీ ప్రజలకు గట్టి సందేశం వెళ్లి ఉండేది. కేసీఆర్‌ది ఆకట్టుకునే వాక్చాతుర్యం అనడంలో ఎలాంటి సందేహాలు లేవు. అయితే ఈ సభలో ఆయన ప్రజలకు దూరమయ్యారా అనిపించింది. అనర్గళంగా మాట్లాడే కేసీఆర్ కాగితం చూస్తూ మాట్లాడడం కొత్తదనమే. ఎన్నికల అనంతరం ఒకటి రెండు సార్లు మాత్రమే కేసీఆర్ బయటకు వచ్చిన సందర్భాలు ఉండడంతోనే ఆయన రాసుకొని మాట్లాడాల్సి వచ్చింది.అసెంబ్లీకి రావడంపై కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు విడ్డూరంగా ఉన్నాయి. మా పిల్లలు అడిగే ప్రశ్నలకే సమాధానం చెప్పలేని కాంగ్రెస్ ప్రభుత్వం నేను రావాలని అంటుందా అని కేసీఆర్ ఎదురు ప్రశ్నించడం ఆశ్చర్యకరం.ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాలు ప్రశ్నించడం, ప్రభుత్వం సమాధానం చెప్పడం ఒక భాగం. ఇందులో పిల్లలు పెద్దలు తేడా ఉండదు. అలా అనుకుంటే సభలో ప్రతిపక్ష నాయకుడి బాధ్యతలు ఆ పిల్లల్లోనే ఎవరికో ఒకరికి ఇవ్వచ్చు కదా!రజతోత్సవ భారీ సభతో పార్టీలోని అభిప్రాయభేదాలకు విరామం పడుతుందని ఆశించిన పార్టీ సానుభూతిపరులకు ఆశాభంగం కలిగింది. సభ ఏర్పాట్లపై మొదట్లో హరీశ్‌రావుకు ప్రాధాన్యతిచ్చినట్టు కనిపించినా సభలో హరీశ్‌రావును పక్కనపెట్టినట్టే ఉందని పార్టీ కేడర్ బలంగా విశ్వసిస్తుంది. ఎన్నడూ లేని విధంగా సభా ప్రాంగణంలో హరీశ్ రావు ఫొటో లేకుండా కేసీఆర్, కేటీఆర్ ఫొటోలతోనే ఫ్లెక్సీలు దర్శనమివ్వడం ఇందుకు ఊతమిస్తుంది.వివిధ కారణాలతో కేసీఆర్ క్రియాశీలకంగా లేకపోవడంతో పార్టీలో ఆధిపత్య పోరు పెరిగి కేటీఆర్, హరీశ్‌రావు, కవితల మధ్య మూడు ముక్కలాట సాగుతుందనేది బహిరంగ రహస్యమే. ఎల్కతుర్తి సభావేదికగా కేసీఆర్ దీనిపై పరోక్షంగానో, ప్రత్యక్షంగానో స్పందించుంటే పార్టీ శ్రేణులకు మార్గదర్శకంగా ఉండేది. రాబోయే రోజుల్లో తాను క్రియాశీలకంగా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనబోతున్నట్టు ఆయన ప్రకటించుంటే పార్టీలో మూడు ముక్కలాటలకు తెరపడేది.బహిరంగ సభ సన్నాహక సమావేశాల్లో హరీశ్‌రావుకు కీలక బాధ్యతలు అప్పగించినట్టు అనిపించినా సభకు వచ్చేసరికి ఆయనను పూర్తిగా పక్కన బెట్టారనే అభిప్రాయం పార్టీ కార్యకర్తల్లో కలిగింది. సభ వేళ దగ్గరపడుతున్న కొద్దీ వ్యూహాత్మకంగా హరీశ్‌రావును దూరం చేశారు. అదే సమయంలో కేటీఆర్‌కు ఇస్తున్నట్టు భావం కలగకుండా కేసీఆరే పర్యవేక్షించారు. చివరికి సభ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పోస్టర్లలో కేసీఆర్‌తోపాటు, కేటీఆర్ ఫొటోలు ఏర్పాటు చేసి కేటీఆర్‌కు ఇస్తున్న ప్రాధాన్యతను చెప్పకనే చెప్పారు. దీంతో పార్టీలో హరీశ్‌రావుకు తీవ్ర అన్యాయం జరుగుతుందనే భావన పార్టీ వర్గాల్లో వ్యక్తమవ్వడం పార్టీలో ఇంటి పోరు పెంచడం ఖాయం.ఎన్నికలే డీఎన్ఏగా ఉన్న బీఆర్ఎస్ పార్టీ గతంలో ఎన్నికలంటే ఉరకలేసేది. ఇప్పుడు ఎన్నికలంటేనే వెనకడుగేస్తుంది. గతంలో పలు ఉప ఎన్నికలతో సత్తా చాటిన ఉద్యమ పార్టీ అసెంబ్లీ ఎన్నికల అనంతరం పలు ఎన్నికలకు దూరమవడం స్వయంకృతాపరాధం. అసెంబ్లీ ఎన్నికల పరాజయం షాక్ నుండి తేరుకోలేక లోక్‌సభ ఎన్నికల్లో నష్టపోయింది.అనంతరం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయకుండా కేసీఆర్ పార్టీ కేడర్‌కు తప్పుడు సందేశమిచ్చారు. దీనిపై కేసీఆర్ ఎల్కతుర్తి సభలో మాట్లాడలేదు. మరో కీలకాంశం పార్టీకి చెందిన 10 మంది పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలను దమ్ముంటే పోటీ చేయండని కేసీఆర్ సవాలు విసిరితే వేడి పుట్టించేది. గతంలో బీఆర్ఎస్ మిత్రపక్షంగా ఉండి ఎన్నో ప్రయోజనాలు పొందిన ఎంఐఎం ఇప్పుడు కాంగ్రెస్ పక్షాన చేరి అసెంబ్లీలో, బయట బీఆర్ఎస్‌పై, కేసీఆర్‌పై తీవ్ర విమర్శలు చేసినా కేసీఆర్ బహిరంగ సభలో స్పందించలేదు.ఎన్నడూ లేని విధంగా కేసీఆర్‌లో అభద్రతాభావం కలిగిందా అనేలా సాగింది ఎల్కతుర్తి సభ. బహిరంగ సభలో ఆయన ఒక్కరే ప్రసగించారు. కేటీఆర్, హరీశ్‌రావు, కవిత వంటి వారు మాట్లాడి ఉంటే తన ప్రసంగం చప్పబడుతుందని ఆయన అభిప్రాయపడ్డారా అనిపిస్తుంది. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల అనంతరం నైరాశ్యంలో కూరుకుపోయినా బీఆర్ఎస్ త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలను సద్వినియోగం చేసుకుంటే పార్టీకి బలం చేకూరుతుంది. ఆ దిశగా పార్టీ కేడర్‌కు కేసీఆర్ మార్గదర్శకం చేసుంటే ప్రయోజనం ఉండేది.దేశంలో అత్యధికంగా రూ. 200 కోట్ల నిధులతో ధనిక ప్రాంతీయ పార్టీగా పేరు గాంచిన బీఆర్ఎస్‌కు జానాదరణ ఉన్నా దాన్ని సద్వినియోగం చేసుకోవడంపైనే పార్టీ భవిష్యత్ ఆధారపడి ఉంది. పార్టీని మరోసారి అధికారానికి దగ్గర చేయడంతోపాటు అంతర్గత పోరుకు చికిత్స చేయాల్సిన బాధ్యత కూడా కేసీఆర్‌పైనే ఉంది.

## సమాజంలో కుల వ్యవస్థను వ్యతిరేకించి ఆధ్యాత్మికతను ప్రేరేపించిన మహనీయుడు బసవేశ్వరుడు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్







**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 30 :** సమాజంలో కుల వ్యవస్థను వ్యతిరేకించి ఆధ్యాత్మికతను ప్రేరేపించిన మహనీయుడు బసవేశ్వరుడు అని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బసవేశ్వరుడి జయంతి వేడుకలకు జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్,జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి పురుషోత్తం,జిల్లా అధికారులు,కుల సంఘాల ప్రతినిధులతో కలిసి హాజరై విశ్వగురు బసవేశ్వరుని చిత్రపటం వద్ద జ్యోతిని వెలిగించి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 12వ శతాబ్దపు సాధువు, సామాజిక సంస్కర్త, బసవేశ్వరుడు పుట్టినరోజును బసవ జయంతిగా జరుపుకుంటున్నామని, బసవేశ్వరుడు కుల వ్యవస్థను వ్యతిరేకించడమే కాకుండా పనిని ఆరాధించమని,ఏమీ ఆశించకుండా సమాజానికి సేవ చేయాలని తెలపడం జరిగిందని,అనుభవ మంటపం అనే ఆధ్యాత్మిక వేదికను స్థాపించి సమానత్వం,సామాజిక న్యాయం అందరికీ అందేలా కృషి చేశారని తెలిపారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కుల సంఘాల ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి ఫలితాల్లో లక్షెట్టిపేట గురుకుల బాలికల విజయకేతనం.




**ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గం రిపోర్టర్ ఏప్రిల్ 30 :** సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల లక్షెట్టిపేట లో పదవ తరగతి ఫలితాలలో విద్యార్థినులు విజయ దుందుభి మోగించినట్టుగా కళాశాల ప్రిన్సిపల్ కె.రమా కళ్యాణి ఒక ప్రకటనలో తెలియజేశారు.పదవ తరగతిలో 79 మంది బాలికలు పరీక్షకు హాజరుకాగా 79 ఉత్తీర్ణులై..100/ ఫలితాలు.సాధించడం జరిగిందని ప్రిన్సిపల్ తెలియజేశారు.పాఠశాల టాపర్ గా గొల్ల శృతిక - 563/600 మార్కులతో మొదటి స్థానం నిలువగా, అక్కల సాయి త్రినిత - 561/600 రెండవ స్థానంలో నిలువగా, బడావత్ దీపిక - 555/600 మార్కులతో మూడో స్థానం సాధించిందని ప్రిన్సిపల్ తెలిపారు.అలాగే 79 మంది బాలికలలో దాదాపు 35 మంది విద్యార్థులకు 500 పైగా మార్కులు సాధించి లక్షెట్టిపేట గురుకుల పాఠశాల ఘనతను మరోసారి నిలిపినట్టు తెలియజేశారు..

అద్భుతమైన ఫలితాలను సాధించిన టాపర్ లను, ఇతర విద్యార్థినులను కళాశాల వైస్ ప్రిన్సిపల్ కే. మహేశ్వరరావ, కే.శ్రీలత,హెచ్ శ్రీలత, ఉమాదేవి,సరస్వతి, భాగ్యలక్ష్మి,రజిత,మంజుల రాణి,ప్రవీణ,హేమలత, సుజాత తదితరులు అభినందించారు.

## పరీక్ష రాసి ..... తిరిగి రాని లోకానికి



మేడ్చల్ గుర్తు తెలియని వాహనం ఢీకొని విద్యార్థిని మృతి చెందిన సంఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది .మేడ్చల్ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం కామారెడ్డి జిల్లా లింగంపేట్ మండల్ నల్లమడుగుల తండా కు చెందిన ధనావత్ అర్చన (16) తన అన్నతో కలిసి మంగళవారం సాయంత్రం సీఎంఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో టీజీఈఏపిసిఈటి పరీక్ష రాసేందుకు వచ్చింది. పరీక్ష రాసిన అనంతరం రాత్రి కండ్ల కోయలో తన బంధువుల ఇంట్లో ఉండి తెల్లవారుజామున తన అన్నతో ద్విచక్ర వాహనంపై నల్లమడుగుల తాండ వెళ్తున్న క్రమంలో మేడ్చల్ లో గుర్తుతెలియని వాహనం ద్విచక్ర వాహనాలు ఢీ కొట్టింది. దీంతో అర్చన అక్కడికక్కడే మృతి చెందగా అన్న తీవ్ర గాయాలయ్యాయి. సంఘటనా స్థలానికి చేరుకొని మేడ్చల్ పోలీసులు అర్చన మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు మేడ్చల్ పోలీసులు తెలిపారు.

## ఘనంగా బసవ జయంతి వేడుకలు

## నివాళులు అర్పించిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**రాజన్న సిరిసిల్ల జిల్లా, ఏప్రిల్ -30 (ప్రజాబలం ప్రతినిధి)**బసవ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో బుధవారం బసవ జయంతి వేడుకలను నిర్వహించగా, కలెక్టర్ హాజరయ్యారు. ముందుగా బసవేశ్వర చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు.కార్యక్రమంలో సిరిసిల్ల ఆర్డీవో రాధాబాయి, జడ్పీ సీఈవో వినోద్ కుమార్, బీసీ సంక్షేమ శాఖ అధికారి రాజ మనోహర్ రావు, డీఆర్డీఓ శేషాద్రి, కుల సంఘం ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## హనుమాజీపేట ప్రభుత్వ పాఠశాల విద్యార్థి మండలంలో టాపర్.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** బుధవారం రోజు విడుదలైన పదవ తరగతి పరీక్ష ఫలితాలలో వేములవాడ రూరల్ మండలం హనుమాజీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 93:33% తో ఉత్తీర్ణత సాధించారని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సిహెచ్. శ్రీకాంత్ రావు తెలిపారు. మార్చి నెలలో జరిగిన పదవ తరగతి పరీక్షలకు హనుమాజీపేట పాఠశాల నుండి మొత్తం 45 మంది విద్యార్థిని, విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని అందులో42 మంది విద్యార్థులు ఉత్తీర్ణులు అయ్యారని ప్రధానోపాధ్యాయుడు తెలిపారు. 9 మంది విద్యార్థులు500 మార్కుల కన్నా ఎక్కువ సాధించినట్లు తెలిపారు. బి. ప్రఫుల్ కుమార్ అనే విద్యార్థి 552 మార్కులు సాధించి వేములవాడ మండలంలో అత్యధిక మార్కులు సాధించినట్లు ప్రధానోపాధ్యాయులు తెలిపారు. వశిష్ట549, శ్రీనిధి548, రోషిని535, మధుమిత526, గాయత్రి523, ప్రణవి515, మహంత్ 511, శ్రీకృతి 505, మార్కులు సాధించారని వీరందరికీ హనుమాజీపేట ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

## .మెరుగైన వైద్యం కోసం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని స్థానిక ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ను కలిసి కోరారు



**సనత్ నగర్ (ప్రజాబలం ప్రతినిధి నరేష్) ఏప్రిల్ 30** పేదరికం కారణంగా మెరుగైన వైద్యం చేయించుకోలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న ఇరువురికి మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అండగా నిలిచారు. రాంగోపాల్ పేట డివిజన్ చుట్టాల బస్తీకి చెందిన మహేష్, బన్సీలాల్ పేట డివిజన్ అరుణ్ జ్యోతి కాలనీకి చెందిన ఇల్లందుల పావని లు గత కొంతకాలంగా ఆరోగ్యపరంగా ఇబ్బందులు పడుతున్నారు. మెరుగైన వైద్యం కోసం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని స్థానిక ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ను కలిసి కోరారు.



ఎమ్మెల్యే చొరవతో వారికి ఒకొక్కరికి 2 లక్షల రూపాయలు చొప్పున ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఆర్థిక సహాయం మంజూరైంది. బుధవారం వెస్ట్ మారేడ్ పల్లి లోని తన కార్యాలయంలో లబ్ధిదారులకు ఆర్థిక సహాయం మంజూరు పత్రాలు (ఎల్ ఓ సి)లను ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అందజేశారు. తమకు ఆర్థిక సహాయం మంజూరు చేయించిన ఎమ్మెల్యే కు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బన్సీలాల్ పేట డివిజన్ బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు వెంకటేషన్ రాజు, నాయకులు ప్రేమ్ కుమార్, అబ్బాస్, శివ తదితరులు పాల్గొన్నారు.

## స్మశాన వాటిక కు వెళ్లేదారిని కబ్జా చేసినవారి నుండి కాపాడండి సామాజిక కార్యకర్త చిలువేరు శ్రీకాంత్




**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 30** స్మశాన వాటికకు వెళ్లే దారిని కబ్జాదారుల నుండి కాపాడండి అంటూ కోరుతూ జమ్మికుంట మండల తహసిల్దార్ కార్యాలయం ముందు ఆమరణ నిరాహార దీక్షకు దిగిన సామాజిక కార్యకర్త సిలువేరు శ్రీకాంత్, వివరాల్లోకి వెళ్తే జమ్మికుంట పట్టణంలోని మోత్కులగూడెం గ్రామంలో ఉన్నటువంటి స్మశాన వాటిక సర్వేనెంబర్ 793/ఏ. ఏ/2, 793/బి గల భూమి నుండి స్మశాన వాటికకు వెళ్లే రహదారిని ఆక్రమించి ఎం.పిఆర్ గార్డెన్ యజమాని నిర్మాణం చేపట్టి స్మశాన వాటికకు వెళ్లకుండా ప్రహరీ గోడను నిర్మించారు. ఈ విషయమై యజమాని పైన పలుమార్లు ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లిన గాని ఎవరు కూడా స్పందించకపోవడంతో బుధవారం రోజున ఆమరణ దీక్షకు కూర్చున్నట్లు చిలువేరు శ్రీకాంత్ పాత్రికేయులకు తెలిపారు. ప్రభుత్వ భూమిని కాపాడి స్మశాన వాటికకు ప్రజలు వెళ్లే విధంగా ప్రభుత్వ ఉన్నత అధికారులు చర్యలు తీసుకునే వరకు ఆమరణ నిరాహార దీక్ష ను విరమించేది లేదని శ్రీకాంత్ తెలిపారు.

పై విషయమై ఎం పి ఆర్ గార్డెన్ యజమాని ప్రకాష్ రెడ్డి ని వివరణ కోరగానేను ఎలాంటి ప్రభుత్వ భూమిని ఆక్రమించలేదని నాపై కావాలని తప్పుడు ఆరోపణలు చేస్తున్నారే తప్ప అందులో ఎలాంటి వాస్తవం లేదని ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగానే ప్రభుత్వ అధికారుల సూచన మేరకే ఎం.పి.ఆర్ గార్డెన్ నిర్మాణం చేపట్టానని అందులో స్మశాన వాటిక కి సంబంధించిన ఒక ఇంచు భూమి కూడా కలవలేదని తెలిపారు. ఏది ఏమైనా నేను న్యాయస్థానంలో తేల్చుకుంటానని కొంతమంది నాపై కావాలని తప్పుడు ప్రచారం చేస్తూ, అధికారులను, ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ప్రకాష్ రెడ్డి విలేఖరులకు వివరణ ఇచ్చారు.

## వరి కొనుగోలు కేంద్రం ఏర్పాటు



అందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఏప్రిల్ 30 (ప్రజాబలం ) సంగారెడ్డి జిల్లా అందోల్ నియోజకవర్గం లోని అల్లాదుర్గ్ మండల పరిధిలోగల సీతానగర్ గ్రామంలో ఐకెపి ద్వారా వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన అల్లాదుర్గం మండల తాసిల్దార్ మల్లయ్య, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు తాము పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని, దళాలను నమ్మి మోసపోవద్దని సూచించారు, ఈ కార్యక్రమంలో ఏబీఎన్ నాగరాజు, అల్లాదుర్గం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొప్పుల శేషారెడ్డి, మండల సీనియర్ నాయకులు సుభాష్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు బేతాయ, అల్లాదుర్గం మండల కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ జైపాల్, సీఏ కల్పన, గ్రామ ట్రెజర్ సాయమ్మ, కిష్టయ్య, గంగారం, శంకరయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఘనంగా సాంస్కృతికోత్సవ వేడుకలు




**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 30** జమ్మికుంటలోని ప్రభుత్వ డిగ్రీ మరియు పీ.జి కళాశాలలో బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ డా.బి.రమేష్ అధ్యక్షతన ఘనంగా కళాశాల సాంస్కృతికోత్సవ వేడుకలు జరిగాయి. కళాశాల విద్యాసంవత్సరం 2024–25 ముగింపును పురస్కరించుకొని కళాశాల సాంస్కృతికోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టంతో చదివి తమ లక్ష్యాలను సాధించాలన్నారు. ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు.శ్రమించినప్పుడే ఉత్తమ ఫలితాలను సాధించగలుగుతామన్నారు.తృతీయ సంవత్సరం పూర్తి చేసిన విద్యార్థులు వచ్చే సంవత్సరంలో పీ.జి , బీ.ఈడి వంటి ఉన్నత కోర్సులు చదవాలన్నారు. అలాగే అర్హత ఉన్న ఉద్యోగాల కోసం పోటీపడాలన్నారు. అనంతరం విద్యార్థులు తమ ఆట, పాటలతో వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో వైస్-ప్రిన్సిపాల్ డా.ఎస్. ఓదెలు కుమార్, డా. రాజేంద్రం,డా. గణేష్, డా.శ్యామల, డా. మాధవి, కిరణ్ కుమార్, ఉమాకిరణ్, రాజకుమార్, మమత,డా. రవి,ఎల్. రవిందర్, శ్రీనివాస్ రెడ్డి, సుష్మ, రవి ప్రకాశ్ రావు, డా. శ్రీనివాష్, కె. శ్రీనివాస్, రమేష్, ప్రశాంత్, సాయికుమార్, శ్రీకాంత్, అరుణ్ రాజ్, అనూష, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## యాసంగి సీజన్‌లో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా నిర్వహించాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు



**ప్రజాబలం ప్రతినిధి నిర్మల్ జిల్లా..** బుధవారం హైదరాబాదులో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ డి.ఎస్.చౌహాన్ తో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు,పౌర సరఫరాల అధికారులతో ఆయన వారి ధాన్యం కొనుగోళ్లపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో ఈ సంవత్సరం యాసంగి పంట 54 లక్షల 89 వేల ఎకరాల్లో సాగు కాగా,దాదాపు కోటి 37 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం ఉత్పత్తి అంచనా వేశామని తెలిపారు. ప్రభుత్వం ద్వారా సుమారు 70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంటుందని వివరించారు. కొనుగోలు ప్రక్రియపై జిల్లా కలెక్టర్లు ప్రత్యక్ష పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.ప్రతి కొనుగోలు కేంద్రంలో తేమ, తూకం, శుద్ధీకరణ యంత్రాలు, టార్పాలిన్ షీట్లు,గన్నీ బస్తాలు లాంటి వసతులు సమృద్ధిగా ఉండేలా చూడాలని ఆదేశించారు.తరుగు పేరిట అదనంగా ధాన్యం తీసుకోవద్దని స్పష్టం చేశారు.ధాన్యం రవాణా కోసం తగినన్ని లారీలు సిద్ధంగా ఉంచాలని,కూలీల కొరత లేకుండా ముందస్తుగా ఏర్పాట్లు చేయాలన్నారు. గోదాముల పర్యవేక్షణ కూడా నిరంతరంగా కొనసాగించాలన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ,జిల్లాలో ఇప్పటికే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని, ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు.ప్రతి కేంద్రంలో అవసరమైన యంత్రాలు,సామగ్రి అందుబాటులో ఉంచామని వివరించారు.అదనపు కలెక్టర్ (రెవెన్యూ)తో కలిసి పర్యవేక్షణ చేపడతామని,నిర్ణిత సమయంలో ధాన్యం కొనుగోలు పూర్తిచేస్తామని పేర్కొన్నారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, భైంసా ఆర్డీవో కోమల్ రెడ్డి,జిల్లా పౌర సరఫరాల మేనేజర్ సుధాకర్,వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్, ఏ డి మార్కెటింగ్ గజానంద్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు

# ఆయుర్వేదంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్

హైదరాబాద్, ఏప్రిల్ 30, భారత హెల్త్ కేర్ రంగం అద్భుతమైన పురోగతి సాధిస్తోంది. ఆధునిక సాంకేతికకు మూలికా, ఆయుర్వేద నివారణలను మిళితం చేయడం చేయడం ద్వారా మెరుగైన చికిత్స అందించడానికి, సంప్రదాయ, ఆయుర్వేదంతో కొత్త మందులు అందించడానికి అవకాశం ఏర్పడుతోదం?. భారతదేశంలో ఆరోగ్య సంరక్షణ భవిష్యత్తు వేగంగా అభివృద్ధి చెందుతోంది. వ్యాధి నిర్ధారణ, నివారణ, ఆవిష్కరణ, పరిశోధన ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నాయి. పతంజలి రీసెర్చ్ ఇన్స్టిట్యూట్, డాబర్ ఇండియా లిమిటెడ్ తో పాటు సన్ హెర్బల్స్ వంటి దేశంలోని అనేక కంపెనీలు, సంస్థలు ఆయుర్వేద మందుల కోసం క్లినికల్ ట్రయల్స్ నిర్వహిస్తున్నాయి. ఆరోగ్య సంరక్షణ మందుల తయారీలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఆయుష్మాన్ భారత్ , డిజిటల్ హెల్త్ మిషన్ వంటి ప్రభుత్వ కార్యక్రమాలు గ్రామీణ , పట్టణ ప్రాంతాలలో ఆరోగ్య సంరక్షణ సేవలకు అవకాశాలను పెంచాయి.భారతదేశంలో ఆరోగ్య సంరక్షణ భవిష్యత్తు ఆవిష్కరణ , పరిశోధన ద్వారా వేగంగా మారుతోంది. దేశంలోని టెలిమెడిసిన్ , ఇ-సంజీవని వంటి వేదికలు మారుమూల రోగులకు ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నాయి. వారి ఆరోగ్యాలను కాపాడుతున్నాయి. సాంకేతిక అభివృద్ధి, కృత్రిమ మేధస్సు, బయోటెక్నాలజీ , డిజిటల్ ఆరోగ్య పరిష్కారాల ద్వారా, దేశ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ సామాన్య ప్రజలకూ అందుబాటులోకి వస్తోంది. తక్కువ ధరల్లోనే ప్రభావవంతమైన వైద్యం అందుతోందది. క్షయ, ఊపిరితిత్తుల వ్యాధులను ముందస్తుగా గుర్తించడానికి అనుమతించే ఎక్స్-రేలు , సీటీ స్కాన్‌లను విశ్లేషించడానికి ఎఐ ని ఉపయోగిస్తున్నారు. టెలిమెడిసిన్‌లో ప్రాక్టో , 1ఎజి వంటి ప్లాట్‌ఫామ్‌లు గ్రామీణ ప్రాంతాల్లో కూడా మంచి వైద్యులను సంప్రదించగలిగేలా చేస్తున్నాయి. పతంజలి పరిశోధనా సంస్థ (ఖభీఎ)లోని 500 మందికి పైగా శాస్త్రవేత్తలు ఆయుర్వేదాన్ని ఆధునిక వైద్య శాస్త్రంతో కలిపి పరిశోధనలు చేస్తున్నారు. ఔషధాలను అభివృద్ధి చేస్తున్నారని కంపెనీ చెబుతోంది. పతంజలి టెలిమెడిసిన్ చొరవ , మూలికా ఉత్పత్తులు భారతదేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో తక్కువ ధరకు, అ ఆరోగ్య సంరక్షణ సేవలను అందుబాటులోకి తీసుకెళ్తున్నాయని పతంజలి తెలిపింది. పర్యావరణ అనుకూల ఉత్పత్తులు , సేంద్రీయ వ్యవసాయం ఇప్పుడు దేశంలో టెండ్రగా మారింది. "మా పరిశోధన పెట్టుబడి ఆయుర్వేదాన్ని ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడంలో ముఖ్యమైన పాత్ర పోషించాయి. పతంజలి చేసిన ఈ ప్రయత్నం ఆరోగ్య సంరక్షణ సేవలను మరింత అందుబాటులోకి తీసుకురావడమే కాకుండా, ప్రపంచ వేదికపై భారతదేశ సాంస్కృతిక వారసత్వాన్ని ప్రముఖంగా నిలబెడుతోంది." అని పతంజలి తెలిపింది.

## ఉగ్ర దాడికి నిరసనగా ఎల్లారెడ్డిపేట బంద్ ప్రశాంతం.

## పాకిస్తాన్ చిత్రపటం దహనం , రోడ్డుపై వేసి తొక్కిన యువకులు.







రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, ఎల్లారెడ్డిపేట, ( ప్రజాబలం ), జమ్మూ కాశ్మీర్లోని పహాల్గం లో హిందువుల పైన ఉగ్రవాదులు దాడి చేసిన హత్యాకాండలో మరణించిన వారికి శ్రద్ధాంజలి ఘటిస్తూ, వారికి నివాళులర్పించి మతోన్మాద ఉగ్రవాదానికి నిరసనగా 30-04-2025 బుధవారం రోజున రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో వర్తక, వాణిజ్య, మరియు హెూటల్ యజమానులు స్వచ్ఛందంగా బంద్ నిర్వహించారు.

పాకిస్తాన్లోని ఉగ్రవాదం అణిచివేతకు భారత ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకున్న, భారత ప్రభుత్వానికి భారతీయులం అందరం మద్దతుగా ఉంటామని, కాశ్మీర్ లోని పహల్గామ్ కి విహారయాత్రకు వెళ్లిన వారిని మతం పేరుతో విభజించి, ఒక వర్గం వారినే లక్ష్యంగా చేసుకొని హతమార్చిన ఉగ్రవాదుల పిరికిపంద చర్యను ప్రపంచమంతా ఖండించాలని, ఇప్పటికే చిప్ప చేత పట్టుకుని ప్రపంచమంతా తిరుగుతున్న పాకిస్తాన్ ఈ దుశ్చర్యకు పాల్పడడం సిగ్గుమాలిన చర్య అని ఈ ఉగ్ర దాడిలో మృతి చెందిన వారి కుటుంబాలకు, ప్రగాడ శ్రద్ధాంజలి ఘటిస్తున్నామని ఈ కార్యక్రమంలో పాల్గొన్న హిందూ ఉత్సవ సమితి సభ్యులు పేర్కొన్నారు.

## బొల్లారం గ్రామంలో ప్రమాదవశాస్తూ గాయపడ్డ పాస్టర్ మృతి.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** వేములవాడ రూరల్ మండలం బొల్లారం గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. బొల్లారం గ్రామానికి చెందిన పాస్టర్ జంగిలి రాములు ఇటీవల తన నివాసంలో ఫ్యాన్ రిపేర్ చేస్తుండగా కింద పడి గాయాల పాలయ్యాడు. తీవ్ర గాయాలతో బాధపడుతూ వరంగల్ లోని ఎంజిఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి తుది శ్వాస విడిచారు. పాస్టర్ రాములు మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి . ప్రజలతో మమేకమై దైవ సేవలో నిమగ్నమైన రాములు మృతి చెందడంతో గ్రామ ప్రజలను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. స్థానికులు, కుటుంబ సభ్యులు శోకసముద్రంలో మునిగిపోయారు. పాస్టర్ రాములకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వ ప్రకారం గా ఆదుకోవాలని బొల్లారం గ్రామస్తులు కోరుతున్నారు.

## కార్మిక రాజ్యం స్థాపనకై కష్టజీవులారా ఏకంకండి.



**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, బోయినపల్లి, ( ప్రజాబలం ),** రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం తడగొండ గ్రామంలో హమాలీల ఆధ్వర్యంలో మే డే కరపత్రం ఆవిష్కరణ చేయడం జరిగింది. మే ఒకటో తేదీన జరుపుకునే మేడే కార్మికుల దినోత్సవం బోయినపల్లి మండల కేంద్రంలో కష్టజీవుల ఎర్ర జెండాను ఎగురవేయడం జరుగుతుంది కాబట్టి ఆరోజు బోయినపల్లి మండలంలో ఉన్న గ్రామాలలోని అన్ని రంగాల కార్మికులు హమాలి, భవన నిర్మాణ కార్మికులు, మహిళా బీడీ కార్మికులు, గ్రామపంచాయతీ కార్మికులు, సన్న, చిన్న కారు రైతులు, ఉపాధి హామీ కూలీలు, ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు తదితర రంగాల కష్టజీవులు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని బోయినపల్లి మండల సిఐటియు కన్వీనర్ గురజాల శ్రీధర్ పిలుపునివ్వడం జరిగింది.

ఈ కార్యక్రమంలో తడగొండ హమాలీ కార్మికులు సంబు వీరేందర్, ఇస్తారి, మేకల శ్రీను, మేకల మహేందర్, పెద్ది గారి అశోక్, ఎండి రహీం, రాగుల శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్ళను అందించాలి షేక్ మొహమ్మద్ రసూల్



**ఖమ్మం ప్రతినిధి ఏప్రిల్ ॱ। (ప్రజాబలం)** ఖమ్మం జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో అవకతవకలు జరుగుతున్నాయని నిజమైన పేద ప్రజల లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు అందించాలని ఖమ్మం ఎంపీ కంటెస్టెడ్ అభ్యర్థి షేక్ మొహమ్మద్ రసూల్ ( రఫీ ) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొన్ని మండలాలలో 130 చదరపు గజాలు రేకుల ఇల్లు ఉన్న వాళ్లకు మిగతా ఆస్తి లేకుండా ఉన్నప్పటికీ వారు కూలికి పోయి జీవన ఉపాధిని నడిపిస్తున్నారు ఇలాంటి వారికి ఇందిరమ్మ ఇల్లు రాకుండా కొంతమంది కాంగ్రెస్ నాయకులకు 2 3 ఎకరాలు ఉన్నప్పటికీ వారకీ అర్హత లేకున్నప్పటికీ ఇందిరమ్మ ఇండ్లు కేటాయించారని ఆరోపించారు అర్హులకు న్యాయం జరగకుంటే నిరాహార దీక్షకు సిద్ధమని తెలిపారు

# చలో కరీంనగర్.

### తెలంగాణ ఉద్యమ కళాకారుల రౌండ్ టేబుల్ సమావేశాన్ని విజయవంతం చేయండి.

### ఉద్యమ కళాకారుల విభాగం రాష్ట్ర కన్వీనర్ ఎల్ల పోశెట్టి.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ), తేదీ 30-04-2025** బుధవారం రోజున తెలంగాణ ఉద్యమ కళాకారుల విభాగం ప్రధాన కార్యాలయం వేములవాడ నందు జరిగిన సమావేశంలో ఉద్యమ కళాకారుల విభాగం రాష్ట్ర కన్వీనర్ ఎల్లా పోశెట్టి మాట్లాడుతూ తేదీ04-05-2025 ఆదివారం రోజున మధ్యాహ్నం రెండు గంటలకు కరీంనగర్ పట్టణంలోని తారక్ హెూటల్ లో టి జి ఎస్ ఆర్ టి సి బస్టాండ్ ప్రక్కన జరుగు ఉత్తర తెలంగాణ ఉద్యమకారుల ( టి యు ఎఫ్ ) రౌండ్ టేబుల్ సమావేశాలకు కరీంనగర్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, నిజామాబాద్, నిర్మల్, మంచిర్యాల, ఆసిఫాబాద్, మరియు ఆదిలాబాద్ జిల్లాలలోని ఉద్యమకారులు, ఉద్యమ కళాకారులు, కవులు, రచయితలు, సాహితీవేత్తలు, వివిధ జిల్లాల అధ్యక్షులు, కన్వీనర్లు, మండలాల అధ్యక్షులు, కన్వీనర్లు, మహిళా కళాబృందల అధ్యక్షురాలు, మహిళా కళాకారులు, ఉద్యమ నాయకులు, గాయకురాళ్లకు ఇదే ఆహ్వానంగా భావించి ఇట్టి రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొనవలసిందిగా తెలియజేస్తూ, ఇట్టి రౌండ్ టేబుల్ సమావేశంను విజయవంతం చేయుటకు వివిధ హెూదాలో పనిచేస్తున్న అధ్యక్షులు, కన్వీనర్లు, మండలాల అధ్యక్షులు ప్రతి ఒక్కరు పూర్తి బాధ్యతలు తీసుకొని, అందరూ పాల్గొనుటకు కృషి చేయవలసిందిగా ఆయన ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో ఉత్తర తెలంగాణ కళాకారుల విభాగం కోఆర్డినేటర్ బొడ్డు రాములు, రాజన్న సిరిసిల్ల ఉద్యమకారుల జిల్లా అధ్యక్షులు బొజ్జ కనకయ్య, ఉద్యమకారుల న్యాయ సలహాదారుడు నేరెళ్ల తిరుమల గౌడ్, ఉద్యమ కళాకారులు రాజన్న జిల్లా అధ్యక్షులు వారాల దేవయ్య, తెలంగాణ ఉద్యమ కళాకారుల విభాగం రాజన్న సిరిసిల్ల జిల్లా ఉపాధ్యక్షులు కనపర్తి హనుమాన్, ప్రధాన కార్యదర్శి మానువాడ లక్ష్మీనారాయణ, నృత్య కళానికేత ప్రధాన కార్యదర్శి వెంపటి సంతోష్ కుమార్, ఉద్యమ కళాకారుల విభాగం వివిధ మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.ఖ

## బాధిత కుటుంబాలను పరామర్శించిన కోరం కనకయ్య, మల్లి బాబు యాదవ్



**ఇల్లందు ప్రతినిధి ఏప్రిల్ 30 (ప్రజాబలం)** ఇల్లందు నియోజకవర్గం కామేపల్లి మండలం పండితాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మద్దినేని రమేష్ కుమారుడుడా మద్దినేని పవన్ కృష్ణ గత సంవత్సరం ఇదే రోజున రోడ్డు ప్రమాదంలో మరణించారు వారికి స్మృతిగా బుధవారం జరిగిన సంవత్సరం కార్యక్రమంలో ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ పాల్గొని పవన్ కృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. మరియు గరిడేపల్లి గ్రామానికి చెందిన బట్టు శ్రీను ఇటీవల గుండెపోటుతో అకస్మాత్తుగా మరణించారు. ఈరోజు జరిగిన దశదినకర్మ కార్యక్రమంలో పాల్గొని వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వారి వారి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్న వయసులో ప్రాణాలు కోల్పోయి ఆ కుటుంబాలకు తీరని లోటు మిగిల్చారని తీవ్ర విచారం వ్యక్తం చేశారు.



ఈ కార్యక్రమంలో షేక్ పతే మహమ్మద్,గింజల నర్సిరెడ్డి, దమ్మాలపాటి సత్యం జన్నారపు లింగయ్య, నల్లపునేని వినోద రావు యలమద్ది నరసింహారావు వల్లం కొండ బ్రహ్మం, మాగం వెంకటేశ్వర్లు, గుజ్జర్లపూడి రాంబాబు మాలోత్ బావ్ సింగ్, గుజ్జర్లపూడి రాంబాబు, అంబడిపూడి వెంకటేశ్వర్లు పాటి చిన్న లక్ష్మయ్య, ధనియాకుల హనుమంతరావు, దొడ్డ వేణు, వెంకటేశ్వర్లు, అనురాధ, నరసింహారావు అప్పయ్య ఉపేందర్, బట్టు నాను బట్టు రమేష్, తుమ్మ భాస్కర్, గోపి రాణి రాజేష్ రాము తదితర బంధుమిత్రులు పాల్గొన్నారు

## అంగన్వాడీ టీచర్లకు, ఆయాలకు వేసవి సెలవు.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** అంగన్వాడీ టీచర్లకు, ఆయాలకు మే నెల రోజులు మొత్తం వేసవి సెలవులు ప్రకటిస్తూ కమిషనర్ క్రాంతి వెస్లీ ప్రకటించింది అని తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ( ఏ ఐ టి యు సి ) రాష్ట్ర అధ్యక్షురాలు ఎం. సాయి ఈశ్వరి బుధవారం రోజున హైదరాబాదులోని స్త్రీ శిశు సంక్షేమ శాఖ రాష్ట్ర కార్యాలయంలో కమిషనర్ క్రాంతి వెస్లీతో తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ % డ% హెల్పర్స్ అసోసియేషన్ ( ఏఐటీయూసీ ), ఇతర సంఘాలతో జరిపిన చర్చలలో వేసవి కారణంగా తల్లులకు, పిల్లలకు అంగన్వాడి కేంద్రాలకు రావడానికి కష్టతరంగా ఉందని, లబ్ధిదారులకు టేక్ హెూమ్ రేషన్ ఇచ్చి సెలవులు ప్రకటించాలని వినతి మేరకు కమిషనర్ సానుకూలంగా స్పందించి వేసవి సెలవులు మే నెల అంతా ప్రకటించినందుకు స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కకు, కమిషనర్ కు, అధికారులకు తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ %డ% హెల్పర్స్ అసోసియేషన్ తరపున కృతజ్ఞతలు తెలిపారు.

# యువతకు నైపుణ్యాభివృద్ధి, సాధికారతకు యునిసెఫ్ తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం

## 2 లక్షల మంది విద్యార్థులకు వ్యాపార నైపుణ్యాలను పెంపొందించడమే లక్ష్యం

## మంత్రి నారా లోకేష్ సమక్షంలో ఎంవోయూ

ఉండవల్లిః రాష్ట్రంలో నిరుద్యోగ యువతీ, యువకులకు నైపుణ్యాభివృద్ధితో పాటు సాధికారత కల్పించేందుకు యునిసెఫ్ తో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ కీలక ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందంలో భాగంగా ఏపీ ప్రభుత్వం, యూనిసెఫ్ 3 ప్రధాన యువశక్తి అభివృద్ధి కార్యక్రమాలను



ప్రారంభించడం జరిగింది. ఈ మేరకు ఉండవల్లి నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఏపీఎస్ఎస్ డీసీ, యునిసెఫ్ యువాహ్ ప్రతినిధులు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ సమక్షంలో ఎంవోయూపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ద్వారా యునిసెఫ్, ఏపీఎస్ఎస్ డీసీ పరస్పర సహకారంతో యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ (YFSI), యూత్ హబ్, పాస్‌పోర్ట్ టు ఎర్నింగ్ (P2E) కార్యక్రమాలను అమలుచేయనున్నారు. ఇంటికో వ్యాపారవేత్త, స్వర్ణాంధ్ర లక్ష్య సాధనకు ఇవి ఎంతగానో తోడ్పాటును అందించనున్నాయి. యువతలో నవీన ఆవిష్కరణలు, ఇంక్లూజన్, స్థిర జీవనోపాధి అవకాశాలను పెంపొందించనున్నాయి. యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ YFSI) ద్వారా పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజనీరింగ్ అభ్యసించే 2 లక్షల మంది యువతకు వ్యాపార నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు ఉద్యోగ సృష్టి, సమస్యల పరిష్కార నైపుణ్యాలను అందించేందుకు యూనిసెఫ్ గ్లోబల్ UPSHIFT ఫ్రేమ్‌వర్క్ ద్వారా శిక్షణ ఇవ్వనున్నారు. యూత్ హబ్ ద్వారా ఆంధ్రప్రదేశ్ నైపుణ్యం పోర్టల్‌తో అనుసంధానించిన బహుభాషా డిజిటల్ వేదిక ద్వారా యువతకు ఉద్యోగాలు, నైపుణ్యాభివృద్ధి, వాలంటీర్‌షిప్ అవకాశాలను కల్పిస్తారు. పాస్‌పోర్ట్ టు ఎర్నింగ్ (P2E) కార్యక్రమం ద్వారా 15 నుంచి 29 సంవత్సరాల మధ్యగల యువతకు ఉచితంగా అంతర్జాతీయ స్థాయిలో డిజిటల్, ప్రొఫెషనల్ నైపుణ్య శిక్షణను అందిస్తారు. ఈ కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి, శిక్షణ విభాగం కార్యదర్శి కోన శశిధర్, ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్ మెంట్ కార్పోరేషన్ ఎండీ, సీఈవో జి.గణేష్ కుమార్, ఏపీఎస్ఎస్ డీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.దినేష్ కుమార్, యునిసెఫ్ ఏపీ, కర్ణాటక, తెలంగాణ ఫీల్డ్ ఆఫీస్ సీఎఫ్ వో జిలాలిమ్ బిర్హాను టఫెస్సే, ఫీల్డ్ ఆఫీస్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ మురళీకృష్ణ మదమంచి, యూనిసెఫ్ ఇండియా అడాలసెంట్ అండ్ యూత్ డెవలప్ మెంట్ స్పెషలిస్ట్ మానస ప్రియా వాసుదేవన్, స్టాక్ హోల్మ్ డిజిటల్, ఏఐ, స్ట్రాటజీ, ఆఫీస్ ఆఫ్ ఇన్నోవేషన్ కన్సల్ టెంట్ రవితేజ బాలే, ఏపీ కర్ణాటక, తెలంగాణ యునిసెఫ్ ఫీల్డ్ ఆఫీస్ ఇన్నోవేషన్ కన్సల్ టెంట్స్ వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# హనుమాన్ ఆగ్రోస్ మజ్జిక పంపిణీ





**మంచిర్యాల నియోజకవర్గం రిపోర్టర్ ఏప్రిల్ 30 :** బెల్లంపల్లి హనుమాన్ ఆగ్రోస్ 24 సంవత్సరం సందర్భంగా ప్రజలు, రైతులు,ప్రయాణికులకు,మజ్జిక,చల్లని నీరు పంపిణీ. బుధవారం ఈ సందర్భంగా మాట్లాడుతూ... మార్వాడి యువ మంచు ఆధ్వర్యంలో హనుమాన్ అగ్రోస్ సహకారంతో ప్రజలకు,రైతులకు, ప్రణికులకు,మజ్జిగ,చల్లని నీరు పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో కమల్ కిషోర్ మారు,అశోక్ కుమార్ మారు,ఓం ప్రకాష్ మారు,రాహుల్ మారు, బాల ప్రసాద్ మార్వాడి,యువ మంచ్ అధ్యక్షుడు కృష్ణ కాంత్,మార్వడి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులను నిలువుదోపిడి చేస్తున్న కాంగ్రెస్ సర్కార్

### షరతుల్లేకుండా వరిధాన్యం కొనుగోలు చేయాలి
### కొనుగోలు కేంద్రాల్లో క్వింటాలుకు 5 కిలోల వడ్లు అదనంగా కోత
### రైతులను దోచుకుంటున్న మిల్లర్లు, కాంగ్రెస్ ప్రభుత్వం
### సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి
### మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు





**ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గం రిపోర్టర్ ఏప్రిల్ 30 :** రైతులను కాంగ్రెస్ సర్కార్ నిలువు దోపిడీ చేస్తుందని,వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో క్వింటాలుకు ఐదు కిలోల వడ్లు అదనంగా జోకుతున్నారని,సర్కార్ మిల్లర్లతో కలిసి రైతులను దోపిడీ చేస్తున్నారని,సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని,షరతులు లేకుండా వరిధాన్యం కొనుగోలు చేయాలనీ మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు డిమాండ్ చేశారు. బుధవారం మంచిర్యాల నియోజకవర్గంలోని లక్షెట్టిపేట మండలం గుల్లకోటలోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు.అనంతరం అయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి కట్టింగ్ లేకుండా వరి ధాన్యం కొనుగోలు చేస్తున్నామని చెబుతున్నదని,వాస్తవంగా కొనుగోలు కేంద్రంలో మాత్రం ప్రతి 40 కేజీల బస్తాకు రెండు కేజీలు అదనంగా కాంటా వేస్తూ క్వింటాలుకు 5 కిలోలు దోచేస్తున్నారన్నారు. రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం దోచుకుంటుందని మండిపడ్డారు.దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించి ఎలాంటి కటింగు లేకుండా,ఎలాంటి షరతులు లేకుండా రైతులు దగ్గర నుంచి వరి ధాన్యం కొనుగోలు చేసి రైతులకు అండగా ఉండాలని అయన డిమాండ్ చేశారు.బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు తరుగు పేరిట మంచిర్యాల నియోజకవర్గంలో అక్రమాలు చేస్తున్నారని, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు చేసిన ఆరోపణలు,సిట్టింగ్ జడ్జ్ తో విచారణ జరిపిస్తామని చెప్పి ఇప్పటికే చాలా నెలలు అవుతుందని, వెంటనే గత 10 సంవత్సరాలలో జరిగిన వరి ధాన్యం కొనుగోలు పైన, ఇప్పుడు జరుగుతున్న వరి కొనుగోలు పైన సిట్టింగ్ జడ్జ్ తో విచారణ జరిపించాలని అయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో డీసీఎంస్ మాజీ చైర్మన్ తిప్పని లింగయ్య, గుల్లకోట మాజీ సర్పంచ్ గొల్ల రవీందర్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు,రైతులు పాల్గొన్నారు.

# జిల్లాలో నెల రోజులపాటు 30, 30(ఎ) పోలీసు యాక్ట్

## జిల్లా యస్.పి. పరితోష్ పంకజ్ ఐపియస్.




**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 30(ప్రజాబలం)**సంగారెడ్డి జిల్లా/సంగారెడ్డి:జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో వుంచుకొని నెల రోజుల పాటు (మే 1వ తేది నుండి 31 వరకు) జిల్లా వ్యాప్తంగా 30, 30(ఎ) పోలీసు యాక్ట్-1861 అమలులో ఉంటుందని జిల్లా యస్.పి. పరితోష్ పంకజ్ ఐపియస్. ఒక ప్రకటనలో తెలియజేశారు. కావున పోలీసుల ముందస్తు అనుమతి లేనిది సంగారెడ్డి జిల్లా ప్రజలు,ప్రజా ప్రతినిధులు ధర్నాలు, రాస్తారోకోలు,నిరసనలు, ర్యాలీలు,పబ్లిక్ మీటింగ్స్, సభలు, సమావేశాలు నిర్వహించరాదని,శాంతి భద్రతలకు భంగం కలిగే విధంగా,ప్రజాధనానికి నష్టం కల్గించే, ఎలాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేపట్టకూడదన్నారు. జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు ఇట్టి విషయంలో పోలీసు వారికి సహకరించవలసిందిగా సూచించారు.అనుమతి లేకుండా పై చర్యలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై చట్టరిత్య కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

# విద్యుత్శక్తి అధికారులకు బి.ఆర్.ఎస్ ధన్యవాదములు



**రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి 30 ఏప్రిల్ 2025**గుడ్ మార్నింగ్ మణికొండ పేరిట భారత రాష్ట్ర సమితి పార్టీ స్థానిక నాయకులు ప్రజాబిప్రాయ సేకరణ గావిస్తూ గత 22 ఏప్రియల్ మంగళవారం రోజున సెక్రటేరియట్ కాలనీ అంతర్గత వీది నంబర్ 8 లో గల నందనా రెసిడెన్సీ ముందు ప్రధాన సమస్యగా ఎల్.టీ విద్యుత్ వైర్లు చేతికందే విధంగా వెలాడడం వలన ప్రాణనష్టం జరిగే ఆస్కారం ఎంతైనా ఉన్నదని అందుకు ప్రత్యక్షముగా ఊర పిచ్చుకలు రోజూ చనిపోతున్నావని బాధపడుతూ తెలిపిన విషయాన్ని వెంటనే సంబంధిత అధికారి అసిస్టెంట్ ఇంజనీర్ కు ఫోన్ ద్వారా తెలియ చేయడం, అతను సానుకూలంగా స్పందించి నేడు అట్టి వైర్ లను సరిచేయించే విషయమై విద్యుత్శక్తి సరఫరాను ఆపి పని మొదలు పెట్టిన దరిమిలా స్థానిక ప్రజల తరపున విద్యుత్శక్తి అధికారులకు భారత రాష్ట్ర సమితి పార్టీ తరపున ధన్యవాదములు తెలుపడమైనది.

## సదాశివపేటలో ఘనంగా బసవేశ్వర జయంతి వేడుకలు




**సంగారెడ్డి నియోజకవర్గ ప్రతినిధి ఏప్రిల్ 30(ప్రజాబలం)**సంగారెడ్డి జిల్లా/సదాశివపేట:మహాత్మా బసవేశ్వర 892 వ జయంతి ని పురస్కరించుకొని వీరశైవ సమాజం చౌకి మఠం, శ్రీ జగద్గురు పంచాచార్య బసవ సేవా సదన్ నందు ఉదయము 7:30కు షటస్థల ద్వజరోహణము,తదుపరి మహాత్మ బసవేశ్వర చిత్రపటానికి పూజా కార్యక్రమం మరియు సామూహిక ప్రార్థన తదుపరి బసవచౌక్ చేరుకొని బసవేశ్వరుడికి పూలమాల సమర్పించి అంగరంగ వైభవంగా వేడుకలు నిర్వహించినట్లు అధ్యక్షులు చీల మల్లన్న తెలిపారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సంగారెడ్డి శాసనసభ్యులు చింత ప్రభాకర్ బసవేశ్వరుని చిత్రపటానికి పూజా కార్యక్రమం మరియు సామూహిక ప్రార్థన అశ్వరుడా బసవేశ్వర చౌక్ వద్ద ద్వజరోహణంలో పాల్గొని సమాజంలోని రుగ్మతలను రూపుమాపేందుకు కంకణ బద్ధుడైన మహాత్ముడు మహాత్మా బసవేశ్వరుడని కొని ఆడారు,12వ శతాబ్దంలో మహిళలకు విశేషమైనటువంటి సముచిత స్థానాన్ని కల్పించిన మహనీయుడు మహాత్మా బసవేశ్వరుడు అని అన్నారు,ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి పిల్లోడి విశ్వనాథం మాట్లాడుతూ 12వ శతాబ్దంలో కులమత జాతి వర్గ బేధాలను రూపుమాపేందుకు విశేషమైనటువంటి కృషిచేసిన గొప్ప మహెూన్నతుడు మహాత్మా బసవేశ్వరుడు.ఆనాడు బసవేశ్వరుడు పరిపాలన యంత్రాంగాన్ని ఏ విధంగా అయితే కొనసాగించాడో అదే స్ఫూర్తితో ఈనాడు మన పార్లమెంటు నిర్మాణాన్ని చూస్తే తెలిసిపోతుంది అని అన్నారు,ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు బోవడగామ శ్రీశైలం, ఉపాధ్యక్షులు గంతల బస్వరాజ్ ,కొవురి విజయ్ కుమార్ ,కోశాధికారి పులుమామిడి వీరేశం మరియు గౌరవ కార్యవర్గ సభ్యులు మరియు మహిళా మూర్తులు పాల్గొన్నారు.

# 10 ఫలితాలు మేడ్చల్ జిల్లాకు 28వ ర్యాంక్

**ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఏప్రిల్ 30:**పదో తరగతి ఫలితాల్లో మేడ్చల్ జిల్లా విద్యార్థులు పర్వాలేదనిపించారు. మొత్తం 47235 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 42870 మంది విద్యార్థులు పాసయ్యారు. బాలికలు 21062, బాలురు 21808 మంది ఉత్తీర్ణత సాధించారు.4365 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా 90.76% తో 28వ స్థానంలో ఉంది.

# బసవేశ్వరుడు అభ్యుదయవాది

హైదరాబాద్ లింగాయత్ సమాజ్ కు ఆరాధ్య దైవమైన శ్రీశ్రీశ్రీ మహాత్మా బసవేశ్వరుడి 892వ జయంతిని ఆ సమాజ్ ప్రతినిధులు భాగ్యనగరంలో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం, వీరశైవ సమాజము-సికింద్రాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో ట్యాంక్ బండ్ పై ఉన్న బసవేశ్వరుడి విగ్రహానికి ఎం ఏల్ సి కవిత పూలమాల వేసి నివాళులర్పించారు.

కవిత మాట్లాడుతూ బసవేశ్వరుడు సమాజంలో కుల, వర్ణ, లింగ బేధాలు లేవని, అందరం సమానమేనని, సుమారు గత ఎనిమిది వందల సంవత్సరాల క్రితమే చాటి చెప్పారని సంఘం నాయకులు తెలిపారు. అందుకనే బసవేశ్వరుడిని బసవన్న, బసవుడు, విశ్వగురు అని పిలుస్తారన్నారు. సమాజంలో కుల వ్యవస్థను, వర్ణ భేదాలను, లింగ వివక్షతను సమూలంగా వ్యతిరేకించిన అభ్యుదయ వాది అని పేర్కొన్నారు.

# ప్రైమరీ హెల్త్ సెంటర్ కోసం రెండు కోట్ల 60 లక్షల నిధులు మంజూరు



**అందోల్ నియోజకవర్గంలో ప్రతినిధి ఏప్రిల్ 30 (ప్రజాబలం )** సంగారెడ్డి జిల్లా అందోల్ నియోజకవర్గం పరిధిలోని ఈరోజు చౌటుకూరు మండలం సుల్తాన్పూర్ గ్రామంలో ప్రైమరీ హెల్త్ సెంటర్ కోసం రెండు కోట్ల 60 లక్షల నిధులను గౌరవ శ్రీ దామోదర్ రాజనర్సింహ కేటాయించడం జరిగిందని చౌటకూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నత్తి దశరథ్ ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ ఈ ప్రైమరీ హెల్త్ సెంటర్ను సుల్తాన్పూర్ లో ఏర్పాటు చేయడానికి గల కారణాలు చౌటకూర్ మండలానికి సుల్తాన్పూర్ ఏ గ్రామానికి అయినా ఐదు కిలోమీటర్ల దగ్గర ఉండడంతో అన్ని గ్రామాల ప్రజలకు అందుబాటులో ఉంటుందనే ఉద్దేశంతో సుల్తాన్పూర్ గ్రామంలో ఈ ప్రైమరీ హెల్త్ సెంటర్ ను స్థాపించడం జరుగుతుందని తొందరలోనే గౌరవ శ్రీ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ చేతుల మీదుగా ఈ భవనానికి కొబ్బరికాయలు కొట్టి భూమి పూజా కార్యక్రమాలు జరుగుతాయని చౌటకుర్ మండలాన్ని అన్ని విధాలుగా ఎంపీడీవో ఆఫీస్, ఎమ్మార్వో ఆఫీస్, పోలీస్ స్టేషన్, పి హెచ్ సి సెంటర్, అన్ని శాఖల భవనాలు కూడా తీసుకొచ్చే ఏర్పాటు జరుగుతుందని అన్నారు ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పత్తి రాములు, ఈశ్వర్ గౌడ్, గోవర్ధన్ సుల్తాన్పూర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు దేవయ్య, శ్రీనివాస్ రెడ్డి, రమేష్,వెంకట్ రెడ్డి, వసంత, గొల్ల మహేష్ కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు సార సంజయ్, శివంపేట గ్రామ నాయకులు అశోక్, రాజశేఖర్, మండల కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# నూతన భూ చట్టాలతో భూ సమస్యలు పరిష్కారం

**భూభారతి చట్టం రైతుల పాలిట భూ సమస్యలు తీర్చే ఆయుధం లాంటిది**

**అధికారాల వికేంద్రీకరణ పౌతి కోసం నోటీస్ విధానం**

**జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి**



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఏప్రిల్ 30 (ప్రజాబలం )** సంగారెడ్డి జిల్లా అందోల్ నియోజకవర్గం పరిధిలోని వట్టిపల్లి మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన భూభారతి అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి, అదనపు కలెక్టర్ మాధురి, ప్రజాప్రతినిధులు ప్రభుత్వ అధికారులతో కలిసి పాల్గొన్నారు, ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి మాట్లాడుతూ భూభారతి చట్టం రైతుల పాలిట భూసమస్యలుతీర్చేశక్తివంతమైనఆయుధంలా పనిచేస్తుంది, అని పేర్కొన్నారు, ఈ చట్టంలో అధికారాల వికేంద్రీకరణ కోసం పౌతి కోసం నోటీసు విధానం సత్వర న్యాయ సేవలు అందుబాటులో ఉన్నాయని అన్నారు, ఈ చట్టంతో భూ సరిహద్దుల మధ్య గొడవలు ఉండవని భూమికి భూధార్ అక్షాంశాలు రేఖాంశాల తో పక్కాగా భూపటం ఏర్పాటు చేసుకోవచ్చు అన్నారు, రైతులు భూమాతను నమ్ముకోవడం జరుగుతుందని తెలిపారు అలాంటి భూములకు హక్కులు లేక గతంలో చాలా ఇబ్బందులు పడ్డారని అన్నారు, ధరణిలో జరిగిన పొరపాట్లను పరిష్కరించే అధికారం అధికారులకు లేకపోవడం వల్ల సివిల్ కోర్టుకు వెళ్లాల్సి వచ్చేదని, అందువల్ల రైతులు కోర్టుల చుట్టూ తిరిగి తిరిగి నాన్న అవస్థలు పడ్డారని తెలిపారు, ధరణి స్థానంలో నూతన చట్టం తేవడానికి ప్రభుత్వం, నిపుణులతో కమిటీ వేసి, అన్ని రాష్ట్రాలలో పరిశీలించి, రైతులకు సులువైన చట్టాన్ని అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు, భూభారతి చట్టంపై అవగాహన కల్పనకు రాష్ట్రవ్యాప్తంగా నాలుగు మండలాలను పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని రైతు సదస్సులు నిర్వహిస్తూ, రైతుల నుండి సలహాలు సూచనలు తీసుకుంటున్నామని తెలిపారు, ఈ సమావేశంలో రెవెన్యూ వ్యవసాయ అధికారులు ఆర్డీవో పాండు, అందోల్ తాసిల్దార్ ఉమా శంకర్, డిప్యూటీ చైర్మన్ మధుకర్ రెడ్డి, జోగిపేట వ్యవసాయ శాఖ మార్కెట్ కమిటీ చైర్మన్ మక్త జగన్మోహన్ రెడ్డి, ఆక్సన్పల్లి సొసైటీ చైర్మన్ నరేందర్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు రైతులు రైతు సంఘం ప్రతినిధులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు...

# బహుజన వర్గాలను రాజ్యాధికారానికి చేరువ చేసిన విశ్వ గురువు

## సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 30(ప్రజాబలం)**సంగారెడ్డి జిల్లా/సంగారెడ్డి:బసవ జయంతిని పురస్కరించుకొని సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని బైపాస్ బసవేశ్వరుడి విగ్రహానికి పూలమాల వేసి పూజ చేసిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అనంతరం వారు మాట్లాడుతూ సమాజాన్ని స్థాపించిన మహనీయుడు .. అన్ని కులా మతాలు మహిళలకు సమానత్వం కావాలని ఆనాడు కోరుకున్న మహనీయుడు బసవేశ్వరుడు కాయకవే కైలాసం అని చెప్పిన గొప్ప వ్యక్తి కష్టంలోనే సుఖం స్వర్గం ఉందని చెప్పిన మహనీయుడు ఆయన చూపిన మార్గంలో నడుస్తూ.. రాబోయే తరాలకు వారు ఆచరించే విధానాలను చెప్పాల్సిన అవసరం ఉంది,కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, నాయకులు శివరాజ్ పాటిల్, జిల్లా అధికారి జగదీశ్వర్ , రామప్ప, చీల మల్లన్న, సిద్దేశ్వర్, మల్లికార్జున్ , ముద్ద నాగు, మహిళలు , యువకులు పాల్గొన్నారు...

# సన్నాలకు సత్వరమే బోనస్ చెల్లింపు

## యాసంగి ధాన్యం కొనుగోళ్లపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ లో మంత్రి ఉత్తమ్



**ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఏప్రిల్ 30:**ఎర్రమంజిల్ కాలనీ పౌర సరఫరాల శాఖా ప్రధాన కార్యాలయంనుండి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి

ధాన్యం కొనుగోళ్లపై రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టర్లకు మార్గదర్శనం చేస్తున్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

యాసంగి ధాన్యం కొనుగోళ్లపై పౌర సరఫరాల శాఖా రూపొందించిన విధి విధానాలను విస్తరిస్తున్న పౌర సరఫరాల శాఖా ముఖ్య కార్యదర్శి డి.ఎస్.చౌహాన్ ధాన్యం కొనుగోళ్లు సునిశితమైన అంశం, ఆయా జిల్లాల కలెక్టర్లు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ ఎటువంటి అవాంతరాలు కలుగ కుండా చూసుకోవాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.



రానున్న 15-20 రోజులు ధాన్యం కొనుగోళ్లు ఉధృతంగా ఉంటాయి, ఈ సమయంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు.

గోడౌన్ లు అందుబాటులో లేని చోట అందుబాటులో ఉన్న మిల్లులకు ధాన్యం తరలించాలి

54.89 లక్షల ఎకరాల్లో రబీ సాగు 137.10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అంచనా

70.13 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు ప్రణాళికలు

అందుబాటులో సరిపడా గన్నీ బ్యాగులు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

రాష్ట్రంలో పెరుగుతున్న ధాన్యం దిగుబడికి అనుగుణంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు

ధాన్యం కొనుగోళ్లకు రాష్ట్ర వ్యాప్తంగా 8,381 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం చేస్తామన్నారు.

2021-22 ను పోల్చి చూస్తే ఈ రబీ సీజన్ లో అదనంగా 1,772 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి సన్నాలకు సత్వరమే బోనస్ చెల్లింపులు చేయాలన్నారు.

ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే రైతుల ఖాతాలో నగదు జమచేయాలని మంత్రి తెలిపారు.

ఈ కాన్ఫరెన్సులో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నుండి జిల్లా కలెక్టరు గౌతం, అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డి, సివిల్ సప్లై అధికారి సుగుణబాయి, జిల్లా వ్యవసాయ శాఖాధికారి చంద్రకళ, సిపిఓ శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# భారీగా ఎండు గంజాయి పట్టివేత

**అక్రమ గంజాయి రవాణా పై సంగారెడ్డి జిల్లా పోలీసుల ఉక్కు పాదం.**

**సిసియస్, జహీరాబాద్ పోలీసుల సంయుక్త ఆపరేషన్ లో సుమారు 20 లక్షల విలువ గల, 80 కిలోల నిషేదిత ఎండు గంజాయి సీజ్.**

**వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపిఎస్**



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 30(ప్రజాబలం)**సంగారెడ్డి జిల్లా/జహీరాబాద్:జిల్లాలో మరోసారి భారీగా గంజాయి పట్టుకున్నారు పోలీసులు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక డ్రగ్స్ పై ఉక్కుపాదం మోపుతున్నారు అధికారులు. ఎక్కడికక్కడ తనిఖీలు చేస్తూ గంజాయి రవాణాను కట్టడి చేస్తున్నారు. తాజాగా సంగారెడ్డి జిల్లాలో దాదాపు 80 కిలోల ఎండు గంజాయిని పట్టుకున్నారు, ఈ సంధర్బంగా జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ, పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా, కారులో తరలిస్తున్న రూ.20 లక్షల విలువైన 79.75 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు,నమ్మదగిన సమాచారం మేరకు మంగళవారం నాడు సాయంత్రం అందాజ 6:00 గంటల సమయంలో సిసియస్ టీం, చిరాగ్ పల్లి ఎస్ఐ కే.రాజేందర్ రెడ్డి తన సిబ్బందితో కలిసి మాడ్గి టి-రోడ్డు వద్ద జాతీయ రహదారి-65 ప్రక్కన వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా హైదరాబాద్ వైపు నుండి కర్ణాటక వైపు అనుమానాస్పదంగా వస్తున్న ఒక టాటా ఇండిగో సియస్ కారు నెంబర్ ఏపీ 28 డిఇ 3257 గల దానిని ఆపి తనిఖీ చేయగా కారు డిక్కిలో గోదుమ రంగు కవర్ చుట్టిన 40 ఎండుగంజాయి ప్యాకెట్స్ కనిపించినవి,వివరాలలోనికి వెళితే: నిందితుని దూరపు బంధువైన బీదర్ నివాసుడు గుండప్ప చెప్పినట్లుగా రూపాయలు 50,000/-లకు ఆశపడిన నిందితుడు, టాటా ఇండిగో సియస్ కారులో 40-ఎండు గంజాయి పాకెట్లును తీసుకొని, బాగ్దాల్ లో ఉన్న వినోద్ కు ఇవ్వడానికి వెల్లుతుండగా మార్గ మధ్యలో అనగా చిరాగ్ పల్లి గ్రామ శివారులో గల సహారా ధాబా వద్ద వాహనాల తనిఖీ చేస్తున్న చిరాగ్ పల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు, 40 ప్యాకెట్ల ఎండు గంజాయిని తూకం వేయగా 79.75 కిలోలు ఉన్నది దీని విలువ సుమారు 20 లక్షలు ఉంటుందని అన్నారు,నిందితున్ని అదుపులోకి తీసుకొని 40-ఎండుగంజాయి ప్యాకెట్స్, నేరానికి వినియోగించిన కారు,ఒక సెల్ ఫోన్ సీజ్ చేయడం జరిగిందని, నిందితున్ని రిమాండుకు తరలించడం జరుగుతుందని అన్నారు,జిల్లాలో మాదక ద్రవ్యాల దుర్వినియోగంపై జిల్లా పోలీసు శాఖ ఉక్కు పాదం మోపడం జరుగుతుందని, ఎవరైనా గంజాయి లేదా ఇతర మాదక ద్రవ్యాలను సాగు,సరఫరా చేసిన సంగారెడ్డి జిల్లా ఎస్-నాబ్ నెంబర్ 8712656777 కు సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.



ఈ గంజాయి అక్రమ రావాణ చేదనలో కీలకంగా వ్యవహరించిన అధికారులను, సిబ్బందిని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపిఎస్ అభినందించారు.

## పదో తరగతి ఫలితాలలో విజయ ఢంకా మ్రోగించిన తూప్రాన్ గీతా విద్యార్థులు

### రాష్ట్ర స్థాయిలో సత్తా చాటి ముందు వరసలో నిలిచిన తూప్రాన్ గీతా స్కూల్ విద్యార్థులు




**తూప్రాన్, ఏప్రిల్, 30. ప్రాజబలం ప్రతినిధి:-** బుధవారం మధ్యాహ్నం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన పదో తరగతి పరీక్షా ఫలితాలలో మెదక్ జిల్ల తూప్రాన్ గీతా విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో సత్తా చాటారు. పి. నిషాంత్ 600 మార్కులకు గాను 588 మార్కులు సాధించగా కే.చక్రవర్ధన్ 585 మార్కులతో రాష్ట్ర స్థాయిలో సత్తా చాటారు. మరో 28 మంది విద్యార్థులు 550 కి పైగా మార్కులు సాధించి ప్రభంజనం సృష్టించారు.

ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పి.రామాంజనేయులు, చైర్ పర్సన్ పి.ఉష , డైరెక్టర్లు బి.రాఘవేందర్ గౌడ్, కె.నారాయణ గుప్త , ప్రిన్సిపాల్ సి.హెచ్.వెంకట కృష్ణారావు, ఇంచార్జి ప్రిన్సిపాల్ ప్రేమ్ రాజ్ మరియు ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

## అర్హతల ప్రకారం సిబ్బంది నియామకం చేపట్టాలి

### సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 30(ప్రజాబలం)**సంగారెడ్డి జిల్లా/సంగారెడ్డి మెడికల్ కళాశాలలో సిబ్బంది నియామకం అర్హత ప్రకారం చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కే కే భవన్ లో జరిగిన సమావేశంలో మాట్లాడుతు సంగారెడ్డి మెడికల్ కళాశాలలో సిబ్బంది నియామకం అర్హతల ప్రకారం చేపట్టాలని అన్నారు. ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించి వాళ్ళ ఇష్టానుసారంగా కళాశాల,ఆసుపత్రి సిబ్బందిని నియమించడం సరయిన పద్ధతి కాదని దీనిపై జిల్లా కలెక్టర్ గారు తక్షణమే జోక్యం చేసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమం లో సిపిఎం నాయకులు మాణిక్యం, నర్సిములు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు

## భూ భారతి ఆర్.ఓ.ఆర్.చట్టం 2025 అవగాహన సదస్సు







**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 30 :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూభారతి నూతన ఆర్.ఓ.ఆర్. చట్టంను,ఇందులో పొందుపరిచిన అంశాలను రైతులు తెలుసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని మైనారిటీ ఫంక్షన్ హాల్ (షాది ఖాన) నందు భూభారతి నూతన ఆర్.ఓ.ఆర్. చట్టంపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్,మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాసరావు, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు అనిత,తహశిల్దార్ రఫతుల్లా లతో కలిసి హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి నూతన ఆర్.ఓ.ఆర్.చట్టం ద్వారా రైతులకు భూమిపై హక్కు,రికార్డులలో తప్పుల సవరణకు అవకాశం కల్పించడం జరిగిందని,రిజిస్ట్రేషన్,మ్యుటేషన్ చేసే ముందు భూముల పూర్తి వివరాలతో సర్వే చేసి,మ్యాప్ తయారు చేయడం జరుగుతుందని,పెండింగ్ సాదా బైనామా దరఖాస్తులను పరిష్కరించడం జరుగుతుందని, వారసత్వంగా వచ్చిన భూములకు విరాసత్ చేసే ముందు సమగ్ర విచారణ జరిపి పట్టా చేయడం జరుగుతుందని తెలిపారు.భూమి హక్కులు ఏ విధంగా సంక్రమించినా ముటేషన్ చేసి రికార్డులో నమోదు చేయడం జరుగుతుందని,పాసు పుస్తకాలలో భూమి పటం నమోదు చేయడం జరుగుతుందని,భూ సమస్యల పరిష్కారానికి 2 అంచెల అప్పీల్ వ్యవస్థ ఏర్పాటు చేయడం జరిగిందని,భూధార్ కార్డుల జారీ,ఇంటి స్థలాలకు, ఆబాది, వ్యవసాయేతర భూములకు హక్కుల రికార్డు,రైతులకు ఉచిత న్యాయ సహాయం,గ్రామ రెవెన్యూ రికార్డుల నిర్వహణతో పాటు మోసపూరితంగా హక్కుల రికార్డులు మార్చి ప్రభుత్వ,భూదాన్, అసైన్డ్,దేవాదాయ,వక్ఫ్ భూములకు పట్టాలు పొందితే రద్దు చేసే అవకాశం వంటి అంశాలను పొందు పర్చడం జరిగిందని తెలిపారు.భూభారతి నూతన ఆర్.ఓ.ఆర్.చట్టంపై రైతులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు.ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒక మండలాన్ని ఎంపిక చేసి మండలంలోని అన్ని రకాల సమస్యలను తెలుసుకొని జూన్ 2వ తేదీ వరకు పరిష్కరించడం జరుగుతుందని,సంబంధిత పూర్తి వివరాలతో ప్రభుత్వానికి నివేదిక అందించడం జరుగుతుందని, మిగిలిన మండలాలలోని సమస్యలను గుర్తించి ఆగస్టు 15వ తేదీ లోగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.గ్రామాలలో నెలకొన్న సమస్యలపై దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని, గ్రామస్థాయిలోని సమస్యలపై పూర్తి స్థాయిలో దృష్టిని కేంద్రీకరించి పరిష్కరించే దిశగా చర్యలు చేపడతామని,రైతులకు పట్టాభూమి,లావుని పట్టా,ఇతర రకాల భూములకు సంబంధించిన సమస్యలను ప్రభుత్వ ఆదేశాలు, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని, టైటిల్,పొసెషన్ సంబంధిత సమస్యలు,కోర్టులో కొనసాగుతున్న కేసులను మినహాయించి మిగిలిన వాటిని పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు.ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి నూతన ఆర్.ఓ.ఆర్. చట్టంలో పొందుపరిచిన అంశాలను రైతు ప్రయోజనం దిశగా పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తు పై ఎలాంటి చర్యలు లేవు.

### నక్షదారిలో అక్రమ నిర్మాణం, చోద్యం చూస్తున్న అధికారులు.

### చెరువును కబ్జా చేసి పత్తి మిల్లు నిర్మాణం.



10/02/2025, 12:24 Prajavani Government of Telangana

Prajavani Acknowledgement Receipt

| | |
|---|---|
| Name | Anil |
| Mobile No. | |
| Address | :Thallapalli,Ellanthakuta,Ellanthakuta |
| Village | :THALLAPALLE |
| Mandal | :ILLANTHAKUNTA |
| Grievance Subject | :Requests |

Your Grievance is Registered vide Registration no.RJ066/E/2025/00015 On10-02-2025Please keep the registration number for all future correspondence. Your Grievance is sent to TAHSILDAR OFFICE ELLANTHAKUNTA

**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, ఇల్లంతకుంట, ( ప్రజాబలం ),** రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం తాళ్లపల్లి గ్రామ రెవెన్యూ శివారులో నక్ష దారిలో అక్రమంగా నిర్మించిన రాజరాజేశ్వర ఆగ్రో ఇండస్ట్రీస్ పై ఫిబ్రవరి నెలలో రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ కు ప్రజావాణిలో ఫిర్యాదు అందింది. ఇట్టి ఫిర్యాదును జిల్లా కలెక్టర్ ఇల్లంతకుంట తాసిల్దార్ కార్యాలయానికి బదిలీ చేసే వారం రోజుల్లో సమస్యను పరిష్కరించి నివేదిక అందించాలని తెలిపారు. అయినప్పటికీ కూడా మండల సర్వేయర్ తనకు ఏమీ పట్టనట్లు, ఎన్నిసార్లు కలిసి మొరపెట్టుకున్న నేనేమి చేయాలి అంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నాడని బాధితుడు తెలిపాడు. దీనిపై స్థానిక తాసిల్దార్ ను వివరణ కోరగా మండల సర్వేయర్ కి లెటర్ పెట్టానని పని అవుతుందని తెలుపుతున్నాడు. ఈ ఇండస్ట్రీ నిర్మాణానికి ఎన్నిసార్లు అభ్యంతరం తెలుపుతూ అధికారులకు విన్నవించిన పట్టించుకున్న పాపాన పోలేదని బాధితులు వాపోతున్నారు. 2022 సంవత్సరంలో ఇదే తాళ్లపల్లి గ్రామంలో రైతులు వారించిన కూడా నక్షదారి ఎలా ఉంటే అలాగే నక్ష తీస్తామని అధికారులు దగ్గర ఉండి మరి నక్ష రోడ్డు నిర్మాణం చేపట్టారు. పర్మిషన్ ఇచ్చామని మేమేం చేయాలంటూ నిర్లక్ష్యం సమాధానం తెలుపుతున్నారు. గతంలో ఫిర్యాదు చేసిన బాధితుడిని చంపుతామని మిల్లు యాజమాన్యం బెదిరింపులకు గురిచేసినట్లు సమాచారం. ఏది ఏమైనా సామాన్యుడికి ఒక నీతి, బలిసినోడికి మరొక నీతి అన్నట్లు ఇల్లంతకుంట మండలంలో నడుస్తుంది. ఇట్టి అక్రమ మిల్లుల నిర్మాణం వల్ల దుమ్ము, ధూళి అధికంగా వచ్చి పక్కన పంట పొలాల పై పడటంతో పంట దిగుబడి కూడా తగ్గుతుంది. ఉదయం నుండి సాయంత్రం వరకు వ్యవసాయ పనులు చేసే రైతులకు, రైతు కూలీలకు శ్వాసకోస ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఉడకబెట్టిన నీళ్లను వృధాగా వదిలేయడంతో ఆ దుర్వాసనకు చుట్టుపక్కల రైతులకు అక్కడ కనీసం నిలబడలేని పరిస్థితి నెలకొంది.

## ప్రజాస్వామ్యంలో ఆదివాసీలు జీవించే హక్కును కాపాడాలి.

### ఆపరేషన్ కగార్ ను వెంటనే నిలిపివేయాలి.

### మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి.

### ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మంద అనిల్ కుమార్.




**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, ( ప్రజాబలం ),** కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర సాయుధ బలగాలు మావోయిస్టులపై హత్యాకాండ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆపరేషన్ కగార్ ను వెంటనే నిలిపివేయాలని ఏఐఎస్ఎఫ్ రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి మందా అనిల్ కుమార్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చత్తీస్గడ్ చుట్టుపక్కల ప్రాంతాల్లో కేంద్ర సాయుధ బలగాలను మోహరించి మావోయిస్టు పార్టీని అంతం చేయాలని కేంద్రం ప్రకటించిందని, కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా చివరి మావోయిస్టును చంపే దాకా వదిలిపెట్టబోమని మాట్లాడటం ప్రజాస్వామికమాని ఆయన అన్నారు. సైన్యం తమ సొంత ఆస్తిగా హెూమ్ శాఖ మంత్రి మాట్లాడడాన్ని ఖండిస్తున్నామన్నారు. మావోయిస్టు పార్టీ ప్రతినిధులను శాంతి చర్చలకు పిలవాలని కోరుతుంటే వారిని గౌరవించి పిలువకుండా తుద ముట్టించేదాకా వదల బో మనడం దుర్మార్గం అన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో చత్తీస్గడ్ అడవులలోని ఆదివాసులను నిర్మూలించే పద్ధతిని మోడీ సర్కార్ కొనసాగిస్తుందన్నారు. సాయుధులు అయిన మావోయిస్టులకు, పోలీస్ బలగాలకు మధ్య జరుగుతున్న యుద్ధంలా అది లేదని, బలగాలు అటవీ ప్రాంతాన్ని చుట్టుముట్టి ఆదివాసీలను భయభ్రాంతులకు గురిచేసి వారిని అడవుల నుంచి వెళ్లే కొట్టేలా ఉందన్నారు. అక్కడ మానవ, ఆదివాసి, గిరిజన హక్కులను హోరణ జరుగుతుందని, చత్తీస్గడ్ అటవీ ప్రాంతంలోని విలువైన స్వదేశీ ఖనిజ సంపదను, విదేశీ కార్పొరేటర్లకు కట్టబెట్టే కుట్ర దాని వెనుక ఉన్నదని ఆయన విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య యుతంగా వ్యవహరించాలని ఇప్పటికే శాంతి చర్చలకు సిద్ధమని మావోయిస్టులు ప్రకటించిన నేపథ్యంలో ఆ మేరకు స్పందించాలని ఆయన కోరారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు.

## సెస్ డైరెక్టర్ సందు పట్ల అంజిరెడ్డి ద్వారా ఉద్యోగ నియామక పత్రం అందుకున్న జెల్ల భాను ప్రసాద్.



**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, ముస్తాబాద్,( ప్రజాబలం ),** రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలోని చిప్పలపల్లి గ్రామానికి చెందిన జెల్ల లింగయ్య ముస్తాబాద్ కార్యాలయంలో లైన్ మెన్ గా విధులు నిర్వహిస్తూ గత ఎనిమిది నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. అతని కుమారుడైన జెల్ల భాను ప్రసాద్ కు మండల సెస్ డైరెక్టర్ చొరవ తీసుకొని 30-04-2025 బుధవారం రోజున సెస్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ కం కంప్యూటర్ ఆపరేటర్ గా ఉద్యోగ నియామక పత్రాన్ని అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా భాను ప్రసాద్ మాట్లాడుతూ సెస్ డైరెక్టర్ కు, మరియు ఏఈకి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెస్ ఏ ఈ విష్ణు తేజ, చిప్పలపల్లి గ్రామ మాజీ సర్పంచులు గాడి చర్ల దేవయ్య, తాడేపు జ్యోతి- ఎల్లం, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కొమ్మాటి రాజమల్లు, మాజీ ఏఎంసీ డైరెక్టర్ మాచేటి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com